: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
హైదరాబాద్
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
16-7-2025
బుధవారం సంపుటి: 31
సంచిక: 165 పేజీలు: 10+4 వెల: 6.50

# 'నీటి' అజెండా మార్చండి

## నేటి చర్చలకు తెలంగాణ సర్కార్ మెలిక

### బనకచర్ల అంశం లేకుండా చర్చలు జరపాలి

### తెలంగాణ ప్రతిపాదనలే అజెండాలో చేర్చాలని కేంద్రానికి లేఖ

### ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్ చర్చల్లో పాల్గొంటారా, లేదా అన్నది సస్పెన్స్





**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై15:** కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో బుధవారం ఢిల్లీలో జరుపుతున్న సమావేశం వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి సమావేశంలో గోదావరి–బనకచర్లపై చర్చ చేపట్టవద్దని,కృష్ణా గోదావరి నదులపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతుల అజెండాగా చర్చ జరపాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంకు కొద్దిగంటల ముందు ఎజెండా సవరించాలని తెలంగాణ ప్రతిపాదనలు మాత్రమే అందులో ఉండాలని మెలిక పెడుతూ లేఖ రాసి ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు ముందే ఢిల్లీకి వెళ్లి అక్కడే ఇతర కేంద్ర మంత్రులను కలుస్తూ బస చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లారు. అయితే కేంద్ర జలశక్తి సమావేశానికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ససేమిరా అంటున్నారు. అసలు బనకచర్ల ప్రాజెక్టే వద్దని వాదిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఢిల్లీకి వెళ్లడం ప్రాదాన్యం సంతరించుకుంది. దిల్లీలోని జలశక్తిశాఖ ప్రధాన కార్యాలయం శ్రమశక్తిభవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది.

కేంద్ర జలశక్తి సమావేశంలో పాల్గొంటారా? లేదా? అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన బనకచర్ల అజెండాపైనే కేంద్ర జలశక్తి శాఖ సిద్దం కావడాన్ని అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. బనకచర్ల అంశం లేకుండా ఎజెండాను సవరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖరాశారు. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలన్నింటినీ ప్రభుత్వం ఈలేఖలో ప్రస్తావించింది. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ మాత్రం గోదావరి బనకచర్ల సింగిల్ ఎజెండాతో



# అంతరిక్షం నుంచి క్షేమంగా అవనిపైకి..

- కాలిఫోర్నియా తీరంలో ల్యాండ్ అయిన శుక్లా బృందం క్యాప్సూల్
- దాదాపు 18 రోజులు ఐఎస్ఎస్‌లో పరిశోధనల్లో పాల్గొన్న శుభాంశు, మరో ముగ్గురు వ్యోమగాములు
- అంతర్జాతీయ స్పేస్ సెంటర్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుక్లా రికార్డు
- ఏడు రోజుల క్వారంటైన్‌కు ఆ నలుగురు
- గగన్‌యాన్‌కు దారివేసిన శుక్లా: ప్రధాని మోడీ అభినందనలు
- కుమారుడు క్షేమంగా తిరిగిరావడంతో తల్లిదండ్రుల ఆనందబాష్పాలు

**న్యూయార్క్, జూలై 15:** అంతరిక్ష యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారత్ కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా పుడమికి తిరిగొచ్చాడు. శుక్లాతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములతో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ ది213 గ్రేస్ క్యాప్సూల్ మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. జూన్ 26, 2025న భారత్ వైమానిక దళ టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా >>2



# గవర్నర్ చెంతకు బిసి కోటా ఆర్డినెన్స్

### ఆమోదం రాగానే చట్ట సవరణ అమల్లోకి

### స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్ల కోసం నిర్ణయం

### సెప్టెంబరు 30లోగా పంచాయతీ ఎన్నికల పూర్తికి సర్కార్ సమాయత్తం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై15:** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా సర్కారు నిర్ణయంతో రాజ్‌భవన్‌కు చేరింది. పంచాయతీరాజ్ చట్టం -2018లో సవరణల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్ ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్ ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ,ఎస్టీ,బీసీలకు కలిపి 50శాతంకు మించి రిజర్వేషన్లు ఇచ్చేందుకు వీల్లేదు. ఒకవేళ బిసిలకే 42శాతం ఇస్తే రిజర్వేషన్లు 70శాతానికి చేరుతుంది. ఈ నేపథ్యంలో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు హైకోర్టు విధించిన గడువు (సెప్టెంబర్ 30) సమీపిస్తున్నందున ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఈ ఫైలును న్యాయశాఖ ఆమోదించిన తర్వాత మంత్రి, ముఖ్యమంత్రి ఆమోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ >>2



# మాజీ ఇఎన్‌సి మురళీధర్ రావు అరెస్టు

### ఆయన నివాసం, మరో 10 చోట్ల ఎసిబి సోదాలు, కేసు నమోదు

### వందలకోట్ల అక్రమాస్తులు, బంగారు ఆభరణాల గుర్తింపు

### హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ సోదాల్లో సంచలన వివరాలు వెలుగులోకి, ఆస్తుల విలువ రూ. 400 కోట్లు పైనే

### కాళేశ్వరం ప్రాజెక్టులో పలు అవినీతి ఆరోపణలు

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖ రిటైర్డు ఇంజనీర్ ఇన్‌చీఫ్, చీటి మురళీధర్ రావును ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు అదుపులోనికి తీసుకున్నారు. >>2

# ప్రపంచ దేశాలకు మన వ్యాక్సిన్లే సరఫరా

### జినోమ్ వ్యాలీనుంచి 33% వ్యాక్సిన్ల ఉత్పత్తి

### పరిశ్రమల ఏర్పాటుకు అత్యంతంత ప్రాధాన్యం

### ఐకార్ బయోలాజిక్స్‌కు భూమిపూజ చేసిన సిఎం రేవంత్ రెడ్డి

### పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూలై 15, ప్రభాతవార్త:** దేశంలోనే వ్యాక్సిన్‌ల ఉత్పత్తిలో 33శాతం జీనమ్‌వ్యాలీ నుంచే ఉత్పత్తి జరిగి సరఫరా జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత కూడ జీనోమ్‌వ్యాలీ శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలదని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, విధానాల అమలులో, రాయితీలు ఇవ్వటంలో, అనుమతుల విషయంలో విధానపరమైన నిర్ణయాలతో ముందుకు వెళుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలోని జీనమ్‌వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ కొత్త యూనిట్ ఏర్పాటుకు సిఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ (శంకుస్థాపన) చేశారు. దీనిలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్‌వెంకటస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ >>2



మంగళవారం తుర్కపల్లిలోని జీనోమ్‌వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ కొత్త యూనిట్‌కు భూమిపూజ చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

# కేరళ నర్స్‌కు ఊరట

### యెమన్‌లో ఉరిశిక్ష వాయిదా



నిమిష ప్రియ

**సనా,జూలై 15:** ఉరి కంబం ఎక్కాల్సిన కేరళ నర్స్ నిమిష ప్రియకు ఊరట లభించింది. ఈ నెల 16 అమలు కావాల్సిన ఉరిశిక్షను యెమెన్ ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ఓ ప్రకటన చేసింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ కేసులో బాధితురాలికి సాయంచేేందుకు భారత్ ప్రభుత్వం మొదటి నుంచి తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. నిమిష, బాధిత కుటుంబాల మధ్య పరస్పరఅంగీకరానికి వచ్చి కేసును పరిష్కరించుకునేలా మరింతసమయం ఇవ్వాలని >>2

# పాలిసెట్‌లో 19వేల సీట్ల కేటాయింపు

- ఆరు కాలేజీల్లో 100% పూర్తి
- ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదివినవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎట్టకేలకు రాష్ట్రంలోని పాలిసెట్-2025లో వెబ్ ఆప్షన్లు ఇచ్చిన విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్ల కేటాయింపు కోసం గత10 రోజులుగా ఎదురు చూస్తున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాలిసెట్-2025లో అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 4న సీట్లను కేటాయించాల్సి ఉండగా.. ఫీజురీయింబర్స్‌మెంట్ విషయంలో జిఒఎంఎస్ నంబర్ 38 అమలుపై స్పష్టత లేకపోవడంతో కేటాయింపుచేయలేదు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వం స్పష్టత ఇస్తూ ఎస్‌సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ మెమో జారీ చేయడంతో మంగళవారం సీట్ల కేటాయింపు చేశారు. పాలిసెట్-2025లో 80,949 మంది అర్హత సాధించగా, వారిలో 20,811 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. 4,75,690 వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్టు సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 115 ప్రభుత్వ, ప్రైవేట్ డిప్లమా కాలేజీల్లో 28,996 సీట్లు అందుబాటులో ఉండగా.. 18,984 మందికి సీట్లను కేటాయించారు. మరో 10,012 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో మొదటి విడతలో 65.5 శాతం సీట్లు కేటాయించినట్టు ప్రకటనలో తెలిపారు. 5 ప్రభుత్వ కాలేజీలతోపాటు ఒక ప్రైవేటు కాలేజీలో 100 శాతం సీట్ల కేటాయింపు చేశారు. 59 ప్రభుత్వ కాలేజీల్లో 13,964 సీట్లు అందుబాటులో ఉంటే 11,455 సీట్లను(82శాతం) కేటాయించగా.. మరో 2509 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 56 ప్రైవేటు కాలేజీల్లో 15,032 సీట్లు >>2



# స్థానిక ఎన్నికల్లో పోటీకి బిజెపి రెడీ

### కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

### వారసత్వ రాజకీయాలను ప్రజలకు ఎత్తిచూపాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (ఘట్‌కేసర్), జూలై 15, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ద్వారా తెలంగాణ గ్రామాభివృద్ధి సాకారమైందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని పిపిఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం స్థానిక ఎన్నికలపై రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. బిజెపి రాష్ట్రశాఖ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో రోబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాల అమలుపై చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఇంచార్జ్ సునీల్‌బన్సల్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్‌పాటిల్, ఎంపీ–జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.అరుణ, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌తివారిలు హాజరై ప్రసంగించారు. కేంద్రమంతి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని, కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలను, వారసత్వ రాజకీయాలను ప్రజలకు ఎత్తిచూపాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. గ్రామీణాభివృద్ధి విషయంలోగత బిఆర్ఎస్ >>2

# దిల్‌సుఖ్ నగర్‌లో దుండగుల కాల్పులు, ఒకరి మృతి

### కాంగ్రెస్ యువనాయకుడి దారుణ హత్య

3లో

# ఎన్ని ఫోన్లు ట్యాపింగ్ చేశారు?

### ప్రభాకర్‌రావును మళ్లీ ప్రశ్నించిన సిట్

### బాధితుల వాంగ్మూలం ఆధారంగా ప్రశ్నలు సంధించిన అధికారులు, నేడు మళ్లీ విచారణ

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభా కర్ రావును సిట్ అధికారులు మంగళవారం మరోసారి విచారించారు. గత నెలలో అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన ప్రభాకర్ రావును ఇప్పటికే ప లుమార్లు విచారించిన సిట్ అధికారులు తాజాగా ఇదే కేసులో ఇటీవల బాధితులు వెల్లడించిన వాంగ్మూలం ఆధారంగా మరోసారి ప్రశ్నించారు. ఈ కేసులో ప్రభాకర్ రావును తాజాగా ఆరున్నర గంటల పాటు విచారించారు. ఇదే కేసులో ఇంతకు ముందు ఎస్ఐబి మాజీ డిఎస్‌పి, అప్పట్లో ఇక్కడ ఏర్పాటైన ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌కు బాస్‌గా పనిచేసిన దుగ్యాల ప్రణీత్‌రావుతో పాటు ఎంపిలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు నేతల వాంగ్మూలం తీసుకోవడం తెలిసిందే. వీరి వాంగ్మూలం ఆధారంగా మంగళవారం నాడు ప్రభాకర్ రావును సిట్ అధికారులు భిన్న కోణాల్లో విచారించారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? ఈ ఆదేశాలు ఇచ్చిన ఉన్నతా ధికారులు ఎందుకోసం ఇచ్చారు? ఏ ఉద్దేశంతో ఇచ్చారు? ఎంతకాలం పాటు ఈ ట్యాపింగ్ సాగింది. ఇందులో చట్టపరంగా సాగిన ఫోన్‌లు ఎన్ని? చట్ట వ్యతిరేకంగా సాగినవి ఎన్ని? ట్యాపింగ్ ఆధారంగా కొందరు ప్రముఖులను బ్లాక్ మెయిల్ చేసి కోట్లాది రూపాయలు డబ్బులు వ సూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి? రాజకీయ నేతల ప్రత్యర్థుల ఫోన్‌ల ట్యాపింగ్ వెనుక గల కారణాలు ఏమిటి? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును గుచ్చి గుచ్చి ప్రశ్నించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ఎస్ఐబి మాజీ డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావును పలుమార్లు విచారించగా అతను మీ ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందని లిఖిత పూర్వకంగా >>2



మంగళవారం సిట్ కార్యాలయం వద్ద ప్రభాకర్ రావు



మంగళవారం న్యూఢిల్లీలో 'వికసిత్ భారత్‌లో సిఎస్ఆర్ మిషన్' సమ్మిట్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి గడ్కరి

# క్షేమంగా అవనిపైకి..

>> అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడు. 39 ఏళ్ల వయసున్న శుక్లా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడిగా, 634వ వ్యోమగామిగా ఘనత పొందారు. మరో ప్రత్యేకత ఏంటంటే 41 ఏళ్ల తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడూ ఆయనే. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యాత్రలో పాల్గొన్న రెండో భారతీయుడిగా శుక్లా రికార్డుకెక్కారు. యాక్సియమ్ 4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్9 రాకెట్‌ను జూన్ 25న అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ మిషన్‌లో శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీవిస్నియెస్కీ, టిబోర్ కాపు పాల్గొన్నారు. భూమి చుట్టూ 28 గంటల ప్రయాణం తర్వాత వ్యోమగాములు బయల్దేరిన స్పేస్‌క్రాఫ్ట్ ఐఎస్ఎస్‌కు డాక్ అయింది. జూన్ 26న ఐఎస్ఎస్‌కుచేరుకున్న ఈ నలుగురు వ్యోమగాములు అమెరికా, భారతదేశం, పోలాండ్, హంగేరీ, సౌదీ అరేబియా, బ్రెజిల్, నైజీరియా, గీతిని, యూరప్ అంతటా ఉన్న దేశాలతో సహా 31 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మైక్రోగ్రావిటీలో దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. వాటిలో భారతదేశం ఇస్రో ద్వారా ఏడు కీలక అధ్యయనాలను ఈ మిషన్‌కు అందించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 18 రోజుల పాటు విస్తృత పరిశోధనలు జరిపిన అనంతరం నిన్న అంటే జులై 14న సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్ఎస్‌తో క్రూ డ్రాగన్ ది213 గ్రేస్ క్యాప్సూల్ అన్‌డాకింగ్ ప్రక్రియ నిర్వహించారు. పలు ఆర్బిటల్ ప్రక్రియల అనంతరం ఇవాళ మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా తీరంలో క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండ్ అయింది. వెంటనే శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ విస్నియెస్కీ, టిబోర్ కాపు వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నారు. అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూమిపైకి చేరగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు ఈ చర్యలు తీసుకోనున్నట్లు ఇస్రో పేర్కొంది. అందుకోసం వారం రోజుల పాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచనున్నట్లు తెలిపింది. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించింది.

**చరిత్ర సృష్టించిన శుక్లా: ప్రధాని మోదీ**



అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా శుభాన్షు శుక్లా కొత్త చరిత్ర సృష్టించాడు. తన అంకితభావం, ధైర్యం మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను నిజం చేశారు. ఇది భారత మానవ అంతరిక్ష విమాన మిషన్ - గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధాని ఎక్స్ వేదికగా తన అధికారిక అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాన్షు శుక్లాను అభినందిస్తూ. చారిత్రాత్మక మిషన్ నుండి భూమికి తిరిగి వస్తున్న గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను యావత్ దేశంతో పాటు నేను స్వాగతిస్తున్నాను. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన భారతదేశపు మొట్టమొదటి వ్యోమగామిగా, ఆయన తన అంకితభావం, ధైర్యం మరియు మార్గదర్శక స్ఫూర్తి ద్వారా బిలియన్ల కలలను ప్రేరేపించారు. ఇది మన స్వంత మానవ అంతరిక్ష విమాన మిషన్ - గగన్‌యాన్ వైపు మరో మైలురాయిని సూచిస్తుందని అన్నారు.

**భగవంతునికి కృతజ్ఞతలు: తల్లిదండ్రులు**



ఐఎస్ఎస్ నుంచి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతో పాటు యాక్సియమ్4 సిబ్బంది సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన క్షణాల్లో భావోద్వేగాలు ఉప్పొంగాయి. పసిఫిక్ మహాసముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ అయిన వార్తకు స్పందించిన శుక్లా తల్లి ఆశా శుక్లా కన్నీళ్లు పెట్టుకున్నారు. చాలా రోజుల తర్వాత తన కొడుకు సురక్షితంగా పుడమికి చేరుకోవడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. తన కుమారుడు శుక్లా పైలట్‌గా వ్యవహరించిన యాక్సియమ్4 మిషన్ విజయంపై ఆమె మాట్లాడారు. మొదట్లో నాకు భయం వేసింది. అయితే ఇప్పుడు నాకు చాలా గర్వంగా ఉంది. రాబోయే తరం కూడా ప్రేరణ పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియమ్4 సిబ్బంది భూమికి చేరుకున్న తరణంలో లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నా కొడుకు సురక్షితంగా పుడమికి తిరిగి వచ్చాడు. ఐ థాంక్ టూ గాడ్. ఈ లైవ్ ఈవెంట్‌ను కవర్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు. నా కొడుకు భూమికి చేరుకున్న క్షణంలో నేను భావోద్వేగానికి గురయ్యాను. ఎందుకంటే చాలా రోజుల తర్వాత నా బిడ్డ భూమికి తిరిగి వచ్చాడని ఆమె విలేకరులతో అన్నారు.



మంగళవారం బెంగళూరులో బి. సరోజాదేవి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కర్ణాటక సిఎం సిద్దరామయ్య

# మురళీధర్ రావు అరెస్టు

>> కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో, మాజీ ఇఎన్‌సి మురళీధర్ రావు ఇంటిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం ఉదయం నుంచి సోదాలు ప్రారంభించారు.హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ పాటు మురళీధర్‌రావు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో 11ప్రదేశాలలో ఎసిబి సోదాలు కొనసాగుతున్నాయి శేరిలింగంపల్లిలోని గోపన్పల్లిలో ఉన్న క్రిస్టన్ విల్లాలో ఆయన నివాసంలో బంధువులు స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో ఎసిబి బృందాలు సోదాలు చేస్తున్నాయి.రిటైర్డు ఇఎన్‌సి మురళీధర్‌రావు నివాసంతో పాటు హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ తదితర పదిచోట్ల ఎసిబి నిర్వహిస్తున్న సోదాలలో సంచలన విషయాలు అక్రమ ఆస్తులు, బంగారు, వజ్రాల ఆభరణాలు వెలుగు చూస్తున్నాయి. కొండాపూర్‌లో ఒక ఖరీదైన విల్లా, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడా, బేగంపేట్, కోకాపేట్‌లో ఒక ఫ్లాట్, కరీంనగర్, హైదరాబాద్‌లో ఒక్కొక్క వాణిజ్య భవనం, కోదాడలో ఒక అపార్టుమెంట్ జహీరాబాద్‌లో 2కెడబ్ల్యు సోలార్ పవర్ ప్రాజెక్టు,వరంగల్‌లో ఒక అపార్టుమెంట్ నిర్మాణదశలో ఉంది. 11 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన నాలుగు ఇంటి స్థలాలు,మోకిలాలో 6500 చదరపు అడుగుల భూమి,మెర్సిడ్ బెంజ్‌కారుతో కలిపి మూడు ఖరీదైన కార్లు అధికారులు ఇప్పటి వరకు గుర్తించారు. ప్రభుత్వలెక్కల ప్రకారం సుమారు నాలుగు వందల కోట్లపైనే ఆస్తుల విలువ ఉంటుంది. అధికారులు మురళీధర్ నివాసంలోని పలు డాక్యుమెంట్లు, ఆస్తుల వివరాలను జప్తు చేశారు. ప్రస్తుతం ఆయన రిటైర్డ్ అయినా, కాళేశ్వరం ఇఎన్‌సి కొనసాగిన కాలంలో అనేక కీలక పనులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. కళాశాల స్థాయి స్థాపనలతో పాటు ప్రాజెక్ట్ నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తం కావడంతో, అధికారులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. మిగిలిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై కూడా ఎసిబి విచారణ కొనసాగుతోంది.గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడంతో మురళీధర్‌రావును విజిలెన్స్,ఇతర నిఘా వ్యవస్థలు బాధ్యులుగా భావిస్తూ విచారణ జరుపుతున్నాయి. ఆనాటి ఇఎన్‌సిగా బిల్లుల చెల్లింపులో కీలక పాత్ర పోషించిన మురళీధర్ రావు ఏదైనా అక్రమార్జన చేశారా అనే కోణంలో ఎసిబి సోదాలు చేపట్టింది. కాళేశ్వరం నిధులను తన కుమారుడు అభిషేక్ రావుకు చెందిన సొంత కంపెనీల హర్ష కన్ స్ట్రక్షన్‌కు మళ్లించినట్లు ఎసిబి గుర్తించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరంతో పాటు పాలమూరులోను భారీగా సబ్ కాంట్రాక్టులు చేశారని, తన కుమారుడు అభిషేక్ బినామీలకు లబ్ది చేకూరేలా మురళీధర్ రావు వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వర్క్ ఆర్డర్స్ జారీలోనూ మురళీధర్ రావు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.నీటి పారుదల శాఖ రిటైర్డు ఇంజినీర్ ఇన్ చీఫ్ జూబ్లీహిల్స్‌లోని మురళీధర్‌రావును ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయన్ను విచారించనున్నారు. ఇఎన్‌సి జనరల్ కీలకంగా వ్యవహరించిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీవిరమణ పొందారు. ఆ తర్వాత ములీధర్‌రావు పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తర్వాత మురళీధర్ రావును ప్రభుత్వం తొలగించింది. రాష్ట్ర నీటిపారుదల శాఖలో ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌ను రాజీనామా చేయాల్సిందిగా 2024 ఫిబ్రవరి 7న తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ శాఖ కార్యదర్శి ఆదేశించడంతో ఆయన రాజీనామా చేశారు. అదే రోజు రామగుండం లో పనిచేస్తున్న ఇఎన్‌సి ఎన్ వెంకటేశ్వర్లును సర్వీస్ నుంచి తొలగిస్తూ ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మేడిగడ్డ బరాజ్‌పై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావును ఎసిబి అదుపులోకి తీసుకొని ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఆయనపై కేసు నమోదుచేశారు.ఈఎన్సీగా పనిచేస్తుండగా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.

# బిసి కోటా ఆర్డినెన్స్

>> ముసాయిదాగా పంపించింది. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందితే చట్ట సవరణ వెంటనే అమల్లోకి రానుంది. దీనికి అనుగుణంగా బిసి డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను సిఫార్సు చేయనుంది. వాటి ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు పంపించనుంది. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు గడువు విధించిన సంగతి తెలిసిందే.

# పోటీకి బిజెపి రెడీ

>> ప్రభుత్వం నిధులు ఇవ్వక స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ఇంచార్జ్ సునీల్‌బన్సల్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారం లోకి వచ్చిన తర్వాత 14వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు వచ్చేవిధంగా ఏర్పాటు చేశారని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గ్రామపంచాయతీ, మండల పరిషత్, జడ్పీలకు కూడా నిధులు కేటాయించి వాటిని కూడా బలోపేతం చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కార్ సహకరించనప్పటికి తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఇప్పటి వరకు రూ.12 లక్షల కోట్లు కేటాయించి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సహకారం అందించిందని తెలిపారు. ఈకార్యశా లలో స్థానికఎన్నికల్లో విజయం సాధించేం దుకు చేపట్టవలసిన కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేశారు. బిజెపి శాసనసభాపక్ష నేత ఏలిటి మహేశ్వర్‌రెడ్డి, మండలిపక్ష నేతేవిఎన్.రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ-జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గసభ్యులు గరికపాటి మోహన్‌రావు, తమిళనాడు సహ-ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పావర్, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ జడ్పీచైర్మన్లు, జిల్లాల అధ్యక్షులలతో పాటు మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, గిరిజనమోర్చ జాతీయ కార్యవర్గసభ్యులు నానావత్ బిక్కునాయక్, రాష్ట్ర ఒబిసి మోర్చ నాయకులు కాలేరు రామోజీ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కొమ్మిడి శోభారాణిదామోదర్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు బసవ రాజుగౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ఎంపీ రాజేందర్‌లను సన్మానించారు.

# శుభాంశు శుక్లాను ఆసుపత్రికి తరలించిన నాసా అధికారులు

**వాషింగ్టన్, జూలై 15:** అంతర్జాతీయ అంతరిక్షకేంద్రం నుంచి కాలిఫోర్నియాలో శాండియాగో సముద్ర తీరంలో యాక్సియం 4 మిషన్ సురక్షితంగా దిగింది. ఈ యాత్రను పూర్తి చేసుకుని భూమిపైకి చేరిన శుభాంశు శుక్లాతోపాటు అతడి బృందాన్ని నాసా అధికారులు ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత వీరి రక్తపోటు, హృదయ స్పందన రేటు, ఆక్సిజన్ స్థాయిలను వైద్యులు తనిఖీ చేస్తారు. వారి నుంచి క్యాప్సూల్ తీస్తారు. అనంతరం వారిని రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) ఇస్తారు. ఎందుకంటే.. శరీరంలో రక్తపోటు అకస్మాత్తుగా పడిపోకుండా ఉండేందుకు ఉప్పు లేదా ఎలక్ట్రోలైట్లు కలిగిన నీటిని వీరికి అందిస్తారు. అంతరిక్షానికి దిగిన వెంటనే శుభాంశు శుక్లా బృందాన్ని నేరుగా నాసాకు చెందిన జాన్సన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకు వెళ్తారు. 1 నుంచి 2 గంటల తర్వాత.. వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం సూప్ లేదా జ్యూస్ అది కాకుంటే ద్రవ ఆహారం వారికి అందజేయనున్నారు. సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణం తర్వాత వ్యోమగాముల కడుపులో జీర్ణ క్రియ నెమ్మదిస్తుంది. ఈ నేపథ్యంలో వారికి తేలికపాటి ద్రవాలు అందజేస్తారు.ఇక 6 నుంచి 12 గంటలలోపు.. వీరు ఆరోగ్యంగా ఉంటే తేలికపాటి స్నాక్స్ లేదా ఆహారం అందజేస్తారు. అయితే కొన్ని సార్లు తమకు ఇష్టమైన ఆహారాన్ని వ్యోమగాములు అడుగుతుంటారు. వీరు అంతరిక్షంలో 18 రోజులు గడిపారు. దాంతో అక్కడ సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తికి భూమి మీద సహజ గురుత్వాకర్షణ శక్తికి చాలా తేడా ఉంటుంది. దీంతో వీరి ఆరోగ్యం భూమి మీదకు వచ్చిన వెంటనే సర్దుబాటు కాదు. ఈ దశలో వ్యోమగాముల శరీరాలు అనేక మార్పులకు లోనవుతాయి. అంటే.. ఎముక సాంద్రతతోపాటు కండరాల బలాన్ని తాత్కాలికంగా కోల్పోయే పరిస్థితి నెలకొంటుంది. అది అవయవ పని తీరుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇక నాసా నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతరిక్షయానం ప్రారంభంలో ముఖంలో వాపు, కాళ్లలో రక్తం పేరుకుపోవడం వంటివి జరుగుతాయి. వీరు భూమికి తిరిగి వచ్చిన తర్వాత సర్దుబాటు చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. దీంతో వీరిని వారం రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతారు.

# వాణిజ్యపన్నుల శాఖలో ముగ్గురు అదనపు కమిషనర్లపై బదలీ వేటు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త :** వాణిజ్య పన్నుల శాఖలో చాలాకాలంగా డివిజన్లు వదిలి వెళ్లని ముగ్గురు అదనపు కమిషనర్లపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. సికింద్రాబాద్ నుంచి వాసవీ జగన్నాథం, అబిడ్స్ నుంచి లావణ్య, మాదాపూర్ నుంచి గీతకు స్థానభ్రంశం కల్పించింది. వారి స్థానాల్లో ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న జాయింట్ కమిషనర్లకు పోస్టింగ్స్ ఇస్తూ వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు.అదనపు కమిషనర్లుగా పదోన్నతులు పొందినా డివిజన్లు వదిలి వెళ్లడానికి ఈ ముగ్గురు ఒప్పుకోవట్లేదని వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అబిడ్స్ అదనపు కమిషనర్ లావణ్య.. అధికారులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. మంగళవారం ఉదయం నుంచి లావణ్యపై వచ్చిన ఫిర్యాదులు. ఈటీవీలో వచ్చిన కథనంపై స్పందించిన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత.. అబిడ్స్ డివిజన్లో చోటు చేసుకున్న వ్యవహారంపై ఆరా తీయాలని అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి ఈ మేరకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

# 19వేల సీట్ల కేటాయింపు

>> అందుబాటులో ఉంటే వాటిలో 7529 సీట్లను(50.10 శాతం) కేటాయించారు. ఇడబ్ల్యూఎస్ కోటాలో 713 సీట్లను కేటాయించారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 18లోపుగా ట్యూషన్ ఫీజు చెల్లించి కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చిన అనంతరం ఈ నెల 28 నుంచి 30లోపుగా ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పాలీసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా జూన్ 24 నుంచి 28 వరకు పాలీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూన్ 26 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపట్టారు.

**జిఒఎంఎస్ నంబర్ 38పై స్పష్టత..**

పాలీసెట్-2025 కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందిన ఎస్‌సి, ఎస్‌సి, మైనారిటీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను అందించనున్నారు. అలాగే ప్రభుత్వ, జిల్లా పరిషత్, నవోదయ పాఠశాలలు, సంక్షేమ, విద్యా శాఖలచే నిర్వహించబడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందనున్నారు. పై రెండు వర్గాల వారు కాకుండా పాలీసెట్-2025లో 1000 లోపు ర్యాంక్ సాధించిన విద్యార్థులు కూడా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌కి అర్హులు. ఇక ఈ మూడు వర్గాలకి చెందని వారికి రూ. 14,900 ఫీజురీయింబర్స్‌మెంట్ పొందనున్నారు.

వీరు రూ. 39వేల ఫీజులో మిగిలిన దానిని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటూ జీవో ఎంఎస్ నంబర్ 38పై ఎస్‌సి డెవలప్‌మెంట్ శాఖ సోమవారం మెమో నంబర్ 1165ను జారీ చేసింది. జీవో ఎంఎస్ నంబర్ 38పై స్పష్టత ఇవ్వడంతో మంగళవారం పాలీసెట్-2025 సీట్ల కేటాయింపును పూర్తి చేశారు.

# వ్యాక్సిన్లే సరఫరా

>> ప్రాణాలను మెరుగుపర్చే, రక్షించే ప్లాస్మా ఉత్పన్న చికిత్సలను తయారు చేయటానికి అభివృద్ధి పరచటానికి ఐకార్ బయోలాజిక్స్ పునాది వేసిందనిఅన్నారు. ప్రపంచ బల్క్‌డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటుందని, దేశంలోనే 33శాతం వ్యాక్సిన్స్, బల్క్ డ్రగ్స్‌లో 43శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని ఆయన వివరించారు. కోవిడ్ సమయంలో జీనోమ్‌వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్స్ ఎగుమతి చేసిన ఘనతఉందని, దీనిలో పారిశ్రామికవేత్తలు,శాస్త్రవేత్తలదని, ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకవెళ్లె విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని ఆయన అన్నారు. మా ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకు వెళుతుందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని తాము అధికారం లోకి వచ్చిన నాటినుంచి ఇప్పటి వరకు 3లక్షల28వేల కోట్ల పెట్టుబడులు సాధించామని సిఎంఅన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, ఆధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని, రానున్న పదేళ్లలో తెలంగాణను 1ట్రిలియన్ ఎకనామీగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ముందుగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు సిఎంకు అందజేసి స్వాగతం పలికారు.

# కేరళ నర్సుకు ఊరట

>> కోరాం. ఈ విషయంలో స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం జరిపిన సంప్రదింపులు ఫలించాయి. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకారం తెలిపారని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ కేసులో బ్లడ్ మనీ తీసుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు కాంతాపురం ఎపి అబూబకర్ ముస్లియార్ సంప్రదింపులు జరపుతున్నారు. ఆ చర్చలు కూడా సానుకూలంగా జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. బాధిత కుటుంబానికి ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.6కోట్ల) క్షమాధనాన్ని ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధంగా ఉంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది. కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిష నర్సు కోర్సు పూర్తి చేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. 2011లో థామస్‌ను వివాహం చేసుకున్న ఆమె అక్కడే ఓ క్లినిక్ తెరవాలనుకొన్నారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక తలాల్ అదిబ్ మెహది అనే వ్యక్తిని నిమిష, థామస్ జంట తమ వ్యాపార భాగస్వామిగా చేసుకొన్నారు. వారు అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. కొన్నేళ్ల తర్వాత ఆమె భర్త, కుమార్తె కేరళకు వచ్చేశారు. నిమిష యెమెన్‌లోనే ఉంటూ సెంటర్‌ను కొనసాగించారు. ఈ సమయంలో మెహది నిమిష ప్రియను తన భార్యగా పేర్కొంటూ వేధింపులకు గురిచేస్తూ ఆమె పాస్‌పోర్టు లాక్కొన్నాడు. అతడిపై 2016లో ప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోయేసరికి, 2017లో మెహదికి మత్తు మందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని ఆమె భావించింది. మోతాదు ఎక్కువవడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పడేసింది. అక్కడి నుంచి సౌదీకి పారిపోతుండగా ఆమెను అరెస్టు చేశారు. ఈ కేసులో 2020లో ఆమె ఉరిశిక్ష విధించగా, 2023లో చివరి అప్పీల్‌ను యెమెన్ ప్రభుత్వం తిరస్కరించింది. ప్రస్తుతం నిమిష ప్రియ యెమెన్ రాజధానిలోని సనా జైలులో ఉంది.

## వారం - వర్జ్యం

16-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి రా.9.02
పూర్వాభాద్ర ఉ.5.44, ఉత్తరాభాద్ర తె.4.50
వర్జ్యం : తె.4.41-7.44
దు.ఉ.11.49-12.40
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.కీలక నిర్ణయాలలో కొంత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**వృషభం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందుకొంటారు. ఆరోగ్య సమస్యలు చికాకులు కలిగిస్తాయి.

**మిథునం:** గృహనిర్మాణ ఆలోచనలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి

**కర్కాటకం :** శ్రమకు తగిన ఫలితం కష్టమే. ఎదుటివారి విషయాలలో జోక్యం తగదు.ఆర్థిక పరిస్థితి అనుకూలం..

**సింహం:** పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు. ఇంటాబయటా కొంతవరకు ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. బంధువులకు కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచన మంచిది. సాంకేతిక, రాజకీయ రంగాల వారికి కొంత అనుకూలంగా వుండును.

**ధనుస్సు:** సోదరుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** శ్రమకు తగిన ఫలితం దక్కదు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మీనం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుపాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'నీటి' అజెండా మార్చండి

>>చర్చజరుపాలని కోరుకొంటున్నది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలతో కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సిఆర్ పాటిల్ సమావేశానికి సన్నద్ధమయ్యారు. అయితే సమావేశం అజెండాను మార్చాలని, కృష్ణాపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టిఎంసిల నీటి కేటాయింపుతో పాటు ఎబిఐపి సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో తెలంగాణ ఎజెండాను పంపించింది. ఎపి ఇచ్చిన బనకచర్ల ఎజెండాపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం ఉదయాన్నే కేంద్రానికి మరో లేఖ తెలంగాణ ప్రభుత్వం రాసింది. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరిగే ఇద్దరు సిఎంల సమావేశంలో బనకచర్లపై చర్చించాల్సిన అవసరం లేదని ఈ లేఖలో స్పష్టం చేసింది. జిఆర్ఎంబి, సిడబ్ల్యూసి, ఇఎసి కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చ జరిపితే కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతింటుందని లేఖలో తెలంగాణ ప్రభుత్వం హెచ్చరించింది. ఇప్పటివరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవు. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నీ ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదనే వాదనను ఈ లేఖలో ప్రస్తావించింది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అందులో ప్రస్తావించింది.ఇప్పటికే ఎపి సమర్పించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఇఎసి తిరస్కరించిన విషయాన్ని ఈ లేఖలో ఉటంకించింది. కేంద్ర జల సంఘం కూడా ప్రీ ఫిజిబులిటీ రిపోర్టును తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని కోరారు. రెండు రాష్ట్రాల సీఎంల సమావేశంలో గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదావేయాలని, తెలంగాణ ప్రభుత్వంపంపించిన ప్రతిపాదనలను అజెండాలో చేర్చాలని విజ్ఞప్తిచేశారు. సిఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఐదుగంటలకు ఢిల్లీలో మీడియాతో మాట్లాడనున్నట్లు మీడియాకు ముందస్తు సమాచారం ఇచ్చారు.

# ట్యాపింగ్ చేశారు?

>> వాంగ్మూలం ఇచ్చారు? ఇందులో నా ప్రమేయం లేదని మీరు ఎలా అంటారు? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించగా ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది. అప్పట్లో మీ పై అధికారులు మీకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు? ఫోన్ ట్యాపింగ్‌కు మేము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని అప్పట్లో మీకు ఉన్నతాధికారు లుగా వ్యవహరించిన వారు వాంగ్మూలం ఇచ్చిన విషయమై ప్రభాకర్ రావును సిట్ అధికారులు పలుమార్లు ప్రశ్నించగా ఆయన సమాధానం దాట వే శాడని తెలిసింది. మీడియా అధినేత శ్రవణ్ రావుతో ఎస్ఐబికి వున్న సంబంధం గురించి కూడా సిట్ అధికారులు ప్రభాకర్ రావును మరోమారు అనే క అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. శ్రవణ్ రావుకు ఫోన్ ట్యాపింగ్‌కు ఏమిటీ సంబంధం? అతని పాత్ర ఇందులో ఏమిటి? జడ్జిలు, రాజ కీయ నేతలు, సెలబ్రిటీల ఫోన్‌లను ట్యాపింగ్ చేయమని శ్రవణ్ రావు మీకు చెప్పేవారా...? ఆయనకు అప్పటి అధికార పార్టీలోని ఎవరైనా ముఖ్య లు ఈ ఆదేశాలు ఇవ్వమని చెప్పేవారా? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించగా వీటికి కూడా ఆయన సమాధానాలు దాటవేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం అసాంఘీక శక్తులు, నక్సలైట్ల ఫోన్‌లు మినహా ఇతరుల ఫోన్లను ట్యాపింగ్ చేయడం చట్ట విరుద్ధమని తెలిసినప్పటికీ నాలుగు వేల మంది ఫోన్లు ఎలా ట్యాపింగ్ చేశారు? గత అసెంబ్లీ ఎన్నికలకు ఒక నెల ముందు 500 మంది ప్రముఖుల ఫోన్‌ల ట్యాపింగ్ వెనుక మర్మం ఏమిటనే దానిపైనా సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు సమాచారం. దీనివల్ల మీరు ఆశించింది ఏమిటి? లబ్ది పొందింది ఏమిటి? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించగా దీనికి కూడా ఆయన సమాధానాలు చెప్పలేక మౌనం వహించారని సమాచారం. మీ హయాంలో నిబంధనల మేరకు ఎంతమంది ఫోన్‌లను ట్యాపింగ్ చేశారు? ఇందులో నక్సలైట్లకు సంబంధించినవి ఎన్నీ? నేరగాళ్లకు సంబంధించినవి ఎన్ని? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును అడగగా తనకు జ్ఞాపకం లేదని ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ఎందుకు ధ్వంసం చేయాల్సి వచ్చింది? దీనివల్ల పోలీసు శాఖకు కలిగిన నష్టాలకు ఎవరు బాధ్యులు? అని సిట్ అధికారులు ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు సమాచారం. విచారణలో భాగంగా ప్రభాకర్ రావు నుంచి కొన్ని ప్రశ్నలకు సిట్ అధికారులు రాతపూర్వక సమాధానాలు తీసుకున్నారని తెలిసింది. మొత్తం మీద సిట్ అధికారులు ఇప్పటి వరకు ప్రభాకర్ రావును ఆరుసార్లు విచారించినా ఆయన పెద్దగా సహకరించలేదని తెలిసింది. బుధవారం నాడు మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. మరోవైపు సిట్ విచారణకు ప్రభాకర్ రావు సహకరించనందున సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయించేందుకు పోలీసులు ప్రయత్నిస్తుం డడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను బుధవారం నాడు సిట్ అధికారులు మరోసారి విచారించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

### ప్రజాభవన్ హిట్ అండ్ రన్ కేసు..

## బోధన్ మాజీఎమ్మెల్యే షకీల్‌కు హైకోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** నగరంలోని పంజాగుట్ట వద్ద గల ప్రజా భవన్ ఎదుట 2023 డిసెంబర్ నెలలో జరిగిన హిట్ రన్ కేసులో బోధన్ మాజీ ఎంఎల్ఎ షకీల్‌కు హైకోర్టులో చుక్కెదురయ్యింది. ఈ కేసులో షకీల్ తనయుడు సాహిల్ అలియాస్ రాహీల్ సహా 17 మంది నింది తులుగా వుండడం తెలిసిందే. డిసెంబర్ 23వ తేదీన అర్ధరాత్రి సమయంలో సాహిల్ ప్రయాణిస్తున్న కారు ప్రజా భవన్ వద్ద రోడ్డుపై వున్న బారీకేడ్ల ను ఢీకొని వెళ్లిపోవడం విదితమే. ఈ కేసులో మరుసటి రోజున సాహిల్‌కు బదులు మరొకరిని నిందితుడుగా చూపడంతో పాటు అతన్ని పోలీసులు రిమాండుకు పంపారు. అయితే ఈ కేసులో అసలు నిందితుడు సాహిల్ అని నిర్ధారణ అవడంతో కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాటి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ సహా మొత్తం పోలీసు స్టేషన్ సిబ్బందిపై వేటు పడింది. ఈ కేసులో సాహిల్‌తో పాటు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా 17 మంది అ రెస్టవడం సంచలనం రేపింది. ఈ ఘటన తరువాత సాహిల్ దుబాయ్ పారిపోగా 2024 ఏడాది ఏప్రిల్‌లో భారత్‌కు రాగా అప్పుడు అతన్ని అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు బోధన్ మాజీ ఎంఎల్ఏ షకీల్‌పైనా కేసు నమోదయ్యింది. అయితే తనపై నమో దైన కేసును కొట్టివేయాలని షకీల్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా షకీల్ తరపున వాదించిన న్యాయవాది పోలీసులు కావాలనే తన క్లయింట్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. దీనిని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖండించారు. ఈ కేసులో షకీల్ నిందితుడేనని, తన తనయుడిని కేసు నుంచి తప్పించేందుకు కుట్ర పన్నాడని, తగిన ఇందుకు ఆధారాలు వున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి వుందని ఆయన తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు షకీల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతోపాటు పోలీసుల విచారణ కొనసాగించాలని ఆదేశించింది.



## సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల కట్టడికి చర్యలు: సుప్రీం

**న్యూఢిల్లీ, జూలై 15:** సోషల్ మీడియాలో కొందరు యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు, కళాకారులు ఇష్టానుసారం అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సోషల్ మీడియాలో ఏం చేసినా, ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి పలువురిలో కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయని మండిపడింది. ప్రధాని నరేంద్రమోడీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ వేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. అయితే ఇదే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతకరమైన పోస్టులను షేర్ చేస్తే చట్ట ప్రకారం అతడిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. ప్రధాని నరేంద్రమోడీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయపై న్యాయవాది, ఆర్ఎస్ఎస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మాలవీయ సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన విషయాలను అప్‌లోడ్ చేయడం ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని జోషి ఆరోపించారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హేమంత్ మాలవీయ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా న్యాయస్థానం దాని తోసిపుచ్చడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

## చిరంజీవి దరఖాస్తును చట్టప్రకారం పరిష్కరించండి

### జిహెచ్ఎంసికి హైకోర్టు సూచన

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఇంటి పునరుద్ధరణలో భాగంగా చేపట్టిననిర్మాణాలను క్రమబద్ధీకరించాలంటూ సినీనటుడు చిరంజీవి చేసిన దరఖాస్తును పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని జీహెచ్ఎంసీకి హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. పునరుద్ధరణలో భాగంగా చేపట్టిన రిటైన్ వాల్ క్రమబద్ధీకరణకు జూన్ 5న దరఖాస్తు చేసుకున్నా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ చిరంజీవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2002లో అనుమతి తీసుకుని జీ+2 ఇంటిని నిర్మించినట్లు తెలిపారు. తరువాత పునరుద్ధరణలో భాగంగా ముందస్తు జాగ్రత్త చర్యగా అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. నిర్మాణాన్ని తనిఖీ చేసి క్రమబద్ధీకరించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. జీహెచ్ఎంసీ తరపు న్యాయవాది.. చట్టప్రకారం దరఖాస్తుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషనర్ దరఖాస్తుపై చట్టప్రకారం ఉత్తర్వులు జారీ చేయాలని జీహెచ్ఎంసీని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ మూసివేశారు.

## ముంబయి విమానాశ్రయంలో మహిళ అరెస్టు.. రూ.62 కోట్ల కొకైన్ జప్తు

### చేతి సంచిలో బిస్కట్లు, చాక్లెట్లలో ఉంచి రవాణా



ముంబయి విమానాశ్రయంలో మహిళ వద్ద పట్టుబడిన కొకైన్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ముంబయిలోని ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడింది. దోహా నుంచి ముంబాయికి సోమవారం రాత్రి వచ్చిన విమానంలో ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. దోహా నుంచి రాగానే మ రో విమానంలో ఇంకో ప్రదేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు ఆమెను నిలువరించారు. ఆమె చేతి సంచిలో భారీగా బిస్కట్ల ప్యాకెట్లు, చాకెట్లు కనిపించాయి. వీటిని అనుమానం వచ్చి పరిశీలించగా బిస్కట్లు, చాకెట్ల మధ్య కొకైన్ క్యాప్సు ల్స్ వుంచి స్మగ్లింగ్ చేస్తున్నట్లు తేలింది. మొత్తం కొకైన్‌తో నింపివున్న 300 క్యాప్సుల్స్‌ను డిఆర్ఐ అధికారులు జప్తు చేశారు. పట్టుబడ్డ కొకైన్ విలు వ 62 కోట్ల 60 లక్షల రూపాయలని డిఆర్ఐ అధికారులు తెలిపారు. పట్టుబడ్డ మహిళ భారత్‌కు చెందినదిగా అధికారులు చెబుతున్నప్పటికీ ఆమె పేరును వెల్లడించలేదు. ఆమెను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని, కస్టడీలోకి తీసుకుని ఈ రాకెట్ వెనుక వున్న వారికోసం విచారణ చేస్తామ ని డిఆర్ఐ అధికారులు తెలిపారు. గతంలోనూ పలువురు మహిళలు విదేశాల నుంచి భారత్‌కు డ్రగ్స్ తరలిస్తూ ముంబాయి విమానాశ్రయంలో పట్టు బడడం విదితమే. ఇందులో ఆఫ్రికన్ దేశాలకు చెందిన వారు ఎక్కువగా వున్నారు. వీరిలో పలువురు ప్రమాదకరంగా క్యాప్సుల్స్ రూపంలో వున్న డ్రగ్స్‌ను కడుపులో, శరీరంలోని ఇతర అవయవాల్లో దాచివుంచి స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోయారు. వీరి వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్ హస్తం వుందని డిఆర్ఐ అధికారులు చెబుతున్నారు. ముంబాయిలో తాజాగా పట్టుబడ్డ మహిళ కూడా ఇదే ముఠాకు చెందినదిగా వారు అనుమానిస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లకు ఇసి ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ప్రారంభం మొదలైంది. గత సంవత్సర కాలంగా పల్లెల్లో సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారులతో గ్రామాలపరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎప్పుడెప్పుడు పంచాయితీ ఎన్నికలు వస్తాయాని ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మొదట ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది.
ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం సూచనలు కూడా చేసింది. ఎంపిటిసిల ఎన్నికల తర్వాత సర్పంచ్ ఎన్నికల నిర్వహణ ఉండటంతో అధికారులు ఆ విధంగా ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది.
పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది డేటాను సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నమోదైన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను మరోసారి పరిశీలించాలని ఈ సందర్భంగా ఈసి సూచించినట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలోని జిల్లా, రెవెన్యూ, డివిజన్, మండల, పంచాయితీ లతోపాటు వార్డులసంఖ్య ఆధారంగా పూర్తి వివరాలతో అందుబాటులో ఉండాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశించింది.
ఈ ఆదేశాలతో త్వరలోనే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## 42శాతం రిజర్వేషన్ అమలుచేయకుంటే భూకంపమే!

### బిసిపిఎఫ్ ఆధ్వర్యంలో బిసిల మహాధర్నా

### ధర్నాకు హాజరైన మాజీ మంత్రులు



ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, శ్రీనివాసగౌడ్, మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 15, ప్రభాతవార్త:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయకుంటే భూకంపం సృష్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ హెచ్చరించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీపీఎఫ్ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ పేరుతో బీసీల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్‌లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, హడావిడిగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపటం తప్ప, బిల్లుకు చట్టబద్ధత కోసం కేంద్రంపై వత్తిడి తీసుకు రాలేదని ఆరోపించారు. మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. బీసీలను కులాలుగా విడదీసి, కుట్రలు చేస్తున్నారని, మనలో ఎన్ని కులాలు ఉన్నప్పటికీ, కులాలను పక్కకు పెట్టి, మన కులం బీసీ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే మీ అడ్రస్ లేకుండా చేస్తామని అన్నారు. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం చూశారు, ఇకపై బీసీ ఉద్యమం చూస్తారని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు అమలుచేయకపోతే మీ అధికారం గుంజుకుంటామని హెచ్చరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలను జీవో పేరుతో మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జీవోతో రిజర్వేషన్లు అమలవుతాయంటే ఇన్నాళ్లూ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కామారెడ్డిలో కార్ణటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో బీసీ డిక్లరేషన్ చేయించారు కాబట్టి వేలమందితో కర్ణాటక వెళ్లి సిద్ధరామయ్య ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. శాసన మండలి మాజీ ఛైర్మన్ కే.స్వామిగౌడ్ మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలని అంబేద్కర్ చెబితే ఆయనను పక్కకు పెట్టిన ఘనత కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. బీసీ హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి బీసీ బిడ్డ పాల్గొనాలని పిలుపునిచ్చారు.
9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్లు చేర్చే వరకు సెక్యూరిటీ ఉండదని, మన రిజర్వేషన్లు మనం సాధించుకోవటానికి బీసీలం ఏకం కావాలని, పోరాడి సాధించుకోవాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్, బీఆర్ఎస్ నేత క్యామ మల్లేష్, తుల ఉమ, తలసాని సాయి కిరణ్‌యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ముఠా జైసింహా, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ కేసులో

## పోలీసు అధికారుల కుమారుల అరెస్టు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ కేసులో మరోసారి పోలీసు అధికారుల కుటుంబీకుల పాత్ర వెలుగు చూసింది. ఇప్పటికే పలుమార్లు మాదకద్రవ్యాల కేసుల్లో పోలీసులు లేదా వారి కుటుంబీకులు అరెస్టవడం తెలిసిందే. తాజాగా శివార్లలోని పేట్ బషీరాబాద్ పరిధిలో గల మల్నాడు రెస్టారెంట్‌లో రట్టయిన డ్రగ్స్ రాకెట్‌లో ఇద్దరు పోలీసు అధికారుల కుమారుల హస్తం వెలుగు చూసింది.
ఈ కేసును తెలంగాణ డ్రగ్స్ క ట్టడి విభాగం ఈగల్ విచారిస్తుండడం తెలిసిందే. ఈ కేసులో సైబరాబాద్ కమిషనరేట్‌లో హెడ్ క్వార్టర్స్ డిసిపిగా వున్న సంజీవరావు కుమారుడు మోహన్‌ను ఇప్పటికే అరెస్టు చేయగా తాజాగా నిఘా విభాగంలో అదనపు ఎస్పీగా వున్న వేణుగోపాల్ కుమారుడు రాహుల్ తేజా పాత్రపైనా ఈగల్ పోలీసులకు పక్కా ఆధారాలు లభించడంతో అతన్ని కూడా కటకటాల్లోనెట్టారు. నిజామాబాద్‌లో నెల రోజుల క్రితం వెలుగుచూసిన డ్రగ్స్ కేసులో రాహుల్ తేజా వున్నప్పటికీ అతన్ని అక్కడి పోలీసులు అరెస్టు చేయలేదు. ఈ కేసులో రాహుల్ తేజా పరారీలో వున్నాడు. మల్నాడు రెస్టారెంట్ య జమాని కుమారుడు సూర్యతో పాటు ఇతని స్నేహితుడు హర్ష పోలీసు అధికారి సంజీవరావు కుమారుడు మోహన్ సహా ఆరుగురిని ఈగల్ విభాగం పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వీరిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తూ మరింత సమాచారం సేకరిస్తున్నారు. వీరితో పా టు రాహుల్ తేజా ఒక బృందంగా ఏర్పడి డ్రగ్స్ దందాలు చేస్తున్నట్లు ఈగల్ తేల్చింది. రాహుల్ తేజాను మంగళవారం అరెస్టు చేశారు.

### బాంబే స్టాక్‌ఎక్ఛేంజీకి బాంబు బెదరింపు

**ముంబయి, జూలై 15:** ప్రతిష్టాత్మకమైన ఈక్విటీ స్టాక్ ఎక్ఛేంజి కంపెనీ బాంబేస్టాక్ ఎక్స్ఛేంజికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇమెయిల్‌ద్వారా ఈ హెచ్చరిక అందడంతో పోలీసులు విస్తృత గాలింపు చేపట్టారు. చివరకు బోగస్ బెదిరింపుకాల్ అని పోలీసులు నిర్ధారించారు. బిఎస్ఇ ఉదోనయగి ఒకరికి ఆదివారం ఒక మెయిల్ వచ్చింది. దక్షిణాదిలోని ఒక రాజకీయ నాయకుడిపేరుతో ఈ మెయిల్ వచ్చింది. ఈ మెయిల్‌లోనే ఆర్డీఎక్స్, ఐఇడిలను బిఎస్ఇ భవనంలో ఉంచామని, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకల్లాభవనం పేలిపోతుందని ఆ మెయిల్‌లో ఉంది. దీనితో ఆ ఉద్యోగి వెంటనే స్టాక్ ఎక్ఛేంజి అధికారులను అప్రమత్తంచేసి ముంబయి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబ్ డిటెక్షన్‌బృందం, ముంబయి పోలీసులు వెంటనే బిఎస్ఇ హైటవర్‌వద్దకు చేరుకుని విస్తృత గాలింపు జరిపారు. అయితే అనుమానాస్పద వస్తువు ఏదీ కనిపించలేదని తేలింది.

## గగన్‌యాన్‌కు ఇది మైలురాయి

### అంతరిక్షయాత్ర నుంచి తిరిగివచ్చిన శుక్లాకు ప్రధాని మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ, జూలై 15:** యాక్సియమ్ - 4మిషన్ విజయవంతమైంది. దాదాపు 18 రోజులపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపిన భారత వ్యోమగామి శుభాన్షు బృందం ఈ రోజు భూమికి తిరిగొచ్చింది. ఈ సందర్భంగా శుభాన్షు బృందం క్షేమంగా భూమికి తిరిగి రావడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాన్షు చరిత్ర సృష్టించారు. ఆయన చూపిన పట్టుదల, అంకితభావం, సాహస చర్యల వల్ల కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ చారిత్రక యాత్ర భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌కు మైలురాయిగా నిలుస్తుంది' అని ప్రధాని పేర్కొన్నారు. భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణి ముగిసింది. దాదాపు 18 రోజులు పాటు అంతరిక్ష కేంద్రంలో గడిపిన శుభాన్షు బృందం ప్రయాణిస్తున్న స్పేస్‌క్రాఫ్ట్ ఈ రోజు మధ్యాహ్నం అమెరికా కాలిఫోర్నియా సమీపంలోని సముద్రంలో ల్యాండ్ అయింది. అనంతరం అక్కడే ఉన్న సిబ్బంది వారి వద్దకు చేరుకుని నౌకలోకి తీసుకొచ్చారు. ఇక భూమికి చేరుకున్న వ్యోమగాములు ఏడు రోజులపాటు క్వారంటైన్‌లో ఉండనున్నారు. ఇస్రోకు చెందిన ఫ్లైట్ సర్జన్లు వారం రోజుల పాటు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారు.

## డిప్యూటీసిఎం భట్టివిక్రమార్కకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లీగల్ నోటీసులు

### బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 15:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు లీగల్ నోటీసులు పంపించారు. రోహిత్ వేముల ఆత్మహత్య అంశంపై భట్టి విక్రమా ర్క చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయన తరపు న్యాయవాది విజయ్ కాంత్ ద్వారా ఈ నోటీసులు పంపించారు. తనపై నిరాధార ఆరోపణలు చేసినందుకు మల్లు భట్టివిక్రమార్క మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నారు.



## ప్రభుత్వ గురుకులాల్లోని సమస్యలను పరిష్కరించాలి

### వివిధ సొసైటీల సెక్రటరీలకు ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురుకులాల సమయాన్ని శాస్త్రీయంగా మార్చేలా చరర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్, లెనిన్ గువేరా, కైలాష్ తదితరులు మంగళవారం సాంఘీక సంక్షేమ సొసైటీ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్, మహాత్మా జ్యోతిభాపూలే గురుకులాల డిప్యూటీ సెక్రటరీ చక్రవర్తి, ట్రైబల్ గురుకులాల కార్యదర్శి సీతా లక్ష్మీకి వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలోని గురుకులాల సమస్యలను పరిష్కారం చేసి విద్యార్థుల సంక్షేమానికి నిధులు ఇవ్వాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ యువ నాయకుడి దారుణహత్య

### శరీరంలో రెండు బుల్లెట్‌లు..

### ఘటనాస్థలంలో నాలుగు లభ్యం

**సంగారెడ్డి బ్యూరో, కొల్చారం జూలై 15, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పైతర గ్రామానికి చెందిన మారెల్లి అనిల్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడిగా పని చేస్తున్నాడు. సోమవారం గాంధీభవన్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంను మధ్యలో దించి, ఒంటరిగా వెళ్తుండగా.. అప్పటికే కారులో వెంబడించిన గుర్తు తెలియని వ్యక్తులు అనిల్‌పై కాల్పులు జరిపారు. దీంతో అక్కడిక్కడే అనిల్ మృతి చెందాడు. స్థానికులు మెదక్‌లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా... అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని శరీరంపైన బుల్లెట్ గాయాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలంలో పరిశీలించగా, నాలుగు బుల్లెట్‌లు లభ్యం అయ్యాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భూతగాదా విషయంలో కక్ష య పెంచుకున్న వారే ఈ దారుణానికి పాల్పడి ఉండొ చ్చని స్థానికులు, అనిల్ సన్నిహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనిల్ మృతి ప్రమాదంగా భావించినప్పటికీ హత్యగా తేలడంతో, మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఫోరెన్సిక్ నిపుణులు అనిల్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బుల్లెట్‌లను తొలగించారు. మారెల్లి అనిల్ హత్య కేసును త్వరలోని ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం ఆయన కొల్చారం పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడుతూ.. బుల్లెట్ గాయాలు ఉండటంతో హత్య గా నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. ఈ కేసు విచారణకు 4 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అనిల్ (ఫైల్)

# దిల్‌సుఖ్‌నగర్‌లో కాల్పుల కలకలం

### పార్క్‌లో వాకింగ్‌చేసి వస్తున్న చందునాయక్‌పై దుండగుల కాల్పులు.. అక్కడికక్కడే మృతి

### పాత కక్షలు, భూవివాదాల నేపథ్యంలోనే హత్య జరిగిందని భావిస్తున్న పోలీసులు

### ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిసిపి చైతన్యకుమార్



చందునాయక్ (ఫైల్)

**హైదరాబాద్(మలక్‌పేట) జూలై 15, ప్రభాతవార్త:** నగరంలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. భూతగాదాలు, పాతకక్షల నేపథ్యంలో పార్కులో వాకింగ్ చేసి ఇంటికి వెళుతున్న వ్యక్తిపై పట్టపగలే కారులో వచ్చిన నలుగురు దుండ గులు కళ్లల్లో కారంకొట్టి జరిపిన కాల్పుల్లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ చందునాయక్ రాథోడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పార్కు వద్ద కాల్పులతో వాకర్స్ భయంతో పరుగు లంకించుకున్నారు. పోలీసులు, మృ తుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలం నరసయ్యపల్లి తాండకు చెందిన చందునాయక్ రాథోడ్ (55)కు భార్య నారీబాయి, కుమారుడు సిద్ధూ, కూతురు సింధూ ఉన్నారు. సిద్దూ కెనడాలో ఉంటుండగా, సింధూ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ప్రస్తుతం చైతన్యపురిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.
జనగామ జిల్లా కడివెండిలోని సిపిఐఎంఎల్‌కు చెందిన రాజేష్, సుధాకర్, బాషాలతో కలిసి చందునాయక్ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించి పలువురికి పట్టాలు కూడా ఇప్పించాడు. అయితే నాగోల్ సాయినగర్‌తో పాటు ఇటీవల హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రావి నారాయణరెడ్డినగర్ కాలనీలోని ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేయించే విషయంలో రాజేష్, సుధాకర్, బాషా, చందునాయక్‌ల మధ్య గొడవలు జరిగి విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ఇటీవలే చందు నాయక్ తన స్వగ్రామంలో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నారని ఆరోపణలు రావడంతో పార్టీ ఫండ్‌తో కొనుగోలు చేసావని తనకు కూడా వాటా ఇవ్వాలని రాజేష్ చందునాయకుని కోరగా, చందునాయక్ నిరాకరించారు. దాంతో చందు నాయక్ పై కోపాన్ని పెంచుకున్న రాజేష్ సుధాకర్ మరో ఇద్దరు వ్యక్తులు చందు నాయక్ ను హతమార్చాలని పథకం పన్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు వాకింగ్ కోసమని శాలివాహన నగర్ పార్కుకు వచ్చిన చందునాయక్‌ను వెంబడించిన దుండగులు పార్కు వద్ద కారులో మాటువేసి కూర్చున్నారు. వాకింగ్ పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న చందు నాయక్ కళ్లల్లో కారంపొడి కొట్టడంతో మంటతో పరుగులు తీసిన ఆయన పార్కు గేటు వద్ద ఇసుకలో జారిపడటంతో, దుండగులు ఐదు రౌండ్ల కాల్పులు జరిపి పారిపోయారు. దాంతో చందు నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు.
సమాచారాన్ని అందుకున్న మలక్ పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ను రప్పించారు. ఘటనా స్థలం నుంచి శాలివాహన నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు రోడ్డు నుంచి కొంత దూరం వెళ్లిన జాగిలం ఆగిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్, ఏసీపీ లు సుబ్బరామిరెడ్డి, సోమ వెంకటరెడ్డి, మలక్ పేట ఇన్ స్పెక్టర్ పెదమర్తి నరేష్ లు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఘటనా స్థలి నుంచి ఆధారాలను సేకరించి పోలీసులు, దుండగులను పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు. మర్డర్ కేసులో నిందితుడిగా చందు నాయక్ 2022లో నాగోల్ సాయి నగర్ గుడిసెల్లో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుడి హత్య కేసులో చందు నాయక్ నిందితుడిగా ఉన్నాడని, ఎల్ బి నగర్ పిఎస్ లో అతనిపై కేసు నమోదయి ఉందని డిసిపి చైతన్యకుమార్ తెలిపారు. అదేవిధంగా భూ సెటిల్ మెంట్ల విషయంలో కూడా చందు నాయక్ బాగానే తలదూర్చి సెటిల్మెంట్లు చేశారని, దాంతో పలువురితో శత్రుత్వాలు ఏర్పడ్డాయని, వాటి విషయంలో కూడా లోతుగా దర్యాప్తు జరుపుతామని ఆయన తెలిపారు. ఆర్థిక లావాదేవీల విషయంలో గతంలో తనతో పాటే సహచరులుగా ఉన్న మిత్రులతో ఏర్పడిన శత్రుత్వం చివరికి అతని ప్రాణాలను తీసింది. కాగా సంఘటనా స్థలాన్ని డీసీపీ చైతన్యకుమార్ ఏసీపీ సుబ్బరామిరెడ్డి, సైదాబాద్ ఏసిపి సోమ వెంకటరెడ్డి, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులు సందర్శించారు.

## విజయ డెయిరీ అక్రమాలకు పాల్పడుతన్నవారిపై చర్యలు తీసుకోండి

### సంస్థ ఉద్యోగుల డిమాండ్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** విజయ డెయిరీలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అసంస్థ ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. విజయ డెయిరీ పాలను ప్రైవేట్ డెయిరీలకు అక్రమంగా సరఫరా చేస్తున్నారని అరోపిస్తున్నారు. మార్గదర్శకాలు, నిబంధనలనకు విరుద్ధంగా సిబ్బందిని బదిలీచేస్తున్నారని వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. సంస్థలో పనిచేస్తున్న కొందరు అక్రమాలకు పాల్పడతున్నారని, అటువంటి వారిపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఫుడ్స్
(తెలంగాణ ప్రభుత్వం యొక్క సంస్థ)
(ISO 22000:2018 సర్టిఫైడ్ కంపెనీ)
రోడ్ నం.14, IDA, నాచారం, హైదరాబాద్ 500076, T.G., ఇండియా
ఇ-మెయిల్: mdtsfoods@gmail.com వెబ్ సైట్:http://tfoods.telangana.gov.in
రిఫరెన్స్ నం. TFOODS-MECH/5/2025(816887) తేది: 15.07.2025
టెండర్ ప్రకటన
తెలంగాణ ఫుడ్స్ ఇ-టెండర్ బిడ్స్ ఆహ్వానిస్తోంది. వివరాలు ఈ క్రింది విధంగా-. 1. తెలంగాణ ఫుడ్స్, IDA-నాచారం, హైదరాబాద్ యొక్క ప్రాంగణంలో RPO ఆయిల్ ట్యాంక్స్ నుండి డోసింగ్ ట్యాంక్స్-02నం.లు కావాల్సిన మెటీరియల్‌తో మరియు MS స్టీల్ సపోర్టింగ్ స్ట్రక్చర్స్, అవసరమైన సివిల్ పనులతో SS పైప్‌లైన్ కనెక్షన్ వేయుట. 2. మా Axtel ప్రీ-ప్రాసెసింగ్ మెషీన్‌కి "ఎల్లెన్ బ్రాడ్లీ", రన్-టైమ్, డిస్ప్లేలు 100 సాఫ్ట్‌వేర్ FT వ్యూ సైట్ ఎడిషన్ ప్రొక్యూర్‌మెంట్ మరియు స్థాపన. బిడ్ దాఖలుకు ముగింపు తేదీ మరియు సమయం : 30.07.2025 మ.01.00గం. వరకు. గమనిక: పూర్తి టెండర్ ప్రకటన మరియు నియమాలు మరియు నిబంధనలతో టెండర్ షెడ్యూల్, ప్రత్యేక వివరణలు వగైరాలను వెబ్‌సైట్: http://tender.eprocurement.gov.in నుండి 17.07.2025 ఉ.11.00గం. వరకు ఆపై డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/-. డిప్యూటీ జనరల్ మేనేజర్ (టెక్).
DIPR.NO. 5061-PP/CL/ADVT/1/2025-26 తేది: 15.07.2025

వార్త

ఒక పని అంటే గాని, లేదా దానివల్ల కలిగే ఫలితాలంటే గానీ భయపడి, ఆ పని చేయడాన్ని మానుకోవడం చాలా చిన్నతనం.


-మహాత్మాగాంధీ

# రాజకీయ నాయకులకూ 'విరమణ' అవసరమే!

**ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల ఒక సమావేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధినేత మోహన్ భగవత్ మాట్లాడుతూ రాజకీయాల్లో డెబ్బై ఐదు సంవత్సరాలు వయసు పైబడిన నాయకులు స్వచ్ఛందంగా హుందాతనంగా రాజకీయాల నుండి తప్పుకోవాలన్న సూచన,రాజకీయాలలో కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న భావనకు దారితీస్తుందనే భిన్న అభిప్రాయాలు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల్లో సంచలనాలు రేపుతున్నాయి. అయితే రాజకీయాల్లో స్వచ్ఛంద విరమణ ప్రామాణికం డెబ్బైఐదు ఏళ్ల వయస్సు తర్వాతే ఎందుకని ఆర్ఎస్ఎస్ అధినేత వ్యాఖ్యలు ఉన్నాయన్న అంశంపై రాజకీయాల్లో విభిన్న వాదనలు తెర పైకి వస్తున్నాయి. ఈ క్రమంలో అసలు రాజకీయంలో వయస్సు పైబడిన వారికి రాజకీయాల నుండి నిష్క్రమణ ఎందుకు ఉండకూడదు అనే చర్చ మరోవైపు కొనసాగుతుంది. రాజ్యాంగ ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ కావాలన్నా ఒక ప్రత్యేకమైన వయసు పరిమితి నిర్ధారించిన భారత రాజ్యాంగం మరి రాజకీయాల నుండి తప్పుకోవడానికి రాజకీయ నాయకులకి ఏ వయసు వరకు పరిమితం కావాలని సూచించిన దాఖలాలు ఉన్నాయా లేవా అనే అంశాన్ని పక్కన పెడితే, రాజకీయ నాయకులు డెబ్బై ఐదు సంవత్సరాల జీవిత గమనంలో ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజల సమస్యలకు స్వయంగా తీసుకునే నిర్ణయాలు సమస్య పరిష్కారానికి ఏ మేరకు ప్రభావితం చేయగలరనే సంశయం కొందరిలోనైన లేకపోలేదు. డెబ్బై ఐదు ఏళ్లు పూర్తయినా మనసు స్థిరంగా ఉన్నా, వయసు పైబడుతుంటే చాలావరకు శరీరం అనుకున్న స్థాయిలో సహకరించక పోవడం సహజం. అలాంటి పరిస్థితుల్లో కొత్త తరం యువ నాయకత్వంపై తప్పనిసరిగా దృష్టి సారించాల్సిన పరిస్థితులు ప్రత్యామ్నాయంగా అత్యవసరమవుతాయని అర్థం చేసుకోగల మనస్తత్వం అన్ని పార్టీలోని రాజకీయ నాయకులలో ఉండాల్సిందేమో. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో అనేక సంవత్సరాలు అనుభవం ఉన్న రాజకీయ నాయకత్వం కొత్త తరం యువ నాయకత్వానికి ప్రతిబింబంవలె గోచరిస్తూ, కొత్త తరం నాయకత్వానికి మార్గదర్శకులుగా ఉండి యువ నాయకత్వాన్ని సరేన దిశానిర్దేశంలోముందుకు నడిపించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే భావన అవకాశాలు రావటం లేదన్న కొత్తతరం యువ రాజకీయ నాయకులలో కొంతైన ఉంటుందని భావించే వారు లేకపోలేదు. ప్రస్తుతం దేశంలో వచ్చే ఎన్నికల వరకు అనేక రాజకీయ పార్టీలలో నాయకులు చాలావరకు పది పదులు దాటిన



వయసున్నవారే అధికంగా ఉండడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు పదవి విరమణ వయసు ఉన్నట్ల రాజకీయాల్లో కూడా పదవి విరమణ అనేది సాధ్యమవుతుందా కాదా అనే చర్చ సమాజంలో జోరుగా సాగుతుంది. నిజానికి గత ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ పెన్షన్ విధానం ఉన్నట్లు ఎమ్మెల్యే, ఎంపీలకు కాలపరిమితితోపాటు వారి హోదాలను బట్టి నెలనెలా జీతాలు ఉంటాయి. తిరిగి వారు ఎన్నిక కాక పోయినా జీవితాంతం వారికి ప్రత్యేక పెన్షన్‌తో పాటు అనేక సదుపాయాలు ఉంటాయి. అలాంటప్పుడు రిటర్మెంట్ వయసు ఎందుకు ఉండకూడదు అనే సందేహం సమా జంలో లేకపోలేదు. రాజకీయ నాయకుల రిటైర్మెంట్ వయసు గురించి మోహన్ భగవత్ చేసిన సూచనలు ఏవిధంగా ఉన్నప్పటికీ, రాజకీయ నాయకులకు స్వచ్ఛంద రాజకీయ విరమణ విషయంలో అవసరమైతేతప్ప వ్యక్తి గతంగా రాజకీయాల నుంచి తప్పుకోవడానికి అవకాశం ఉంటుందేమో కానీ, రాజకీయంలోకి పోయిన తర్వాత ప్రజలు ఎన్నుకున్నంత కాలం నాయకులు రాజకీయాల్లో కొనసాగుతూ వస్తుండడం దేశ చరిత్రలో ఆనవాయితీగా వస్తూనే ఉంది. కాని మితిమీరిన వయస్సు ఎవరైనా సరే ఏ వృత్తిలోనైనా ఎల్లప్పుడూ అనుకున్న పనులు చేయుటకు శరీరం సహకరించదనే విభిన్న అభిప్రాయాలు సమాజంలో లేకపోలేదు. అధిక వయసులో ఉన్నవారు దేశ రాజకీయాల్లో ప్రాధాన్యత గల పదవుల్లో ఉన్నప్పుడు దేశ అంతర్జాతీయ విషయాల్లో సమర్థవంతమైన భావ వ్యక్తికరణ సరియైన మూర్తిమత్వాన్ని ప్రదర్శించాల్సి వచ్చినప్పుడు రాజకీయఅనుభవం ఒక మహా ఆయుధంగా కొన్ని సందర్భాల్లో ఉపయుక్తమైన, మరి కొన్ని సందర్భాల్లో అన్ని విధాల అర్హత కలిగి దేశ రాజకీయాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచే యువనాయకత్వం కూడా అవసరమనే వాదనలు తెరపైకి రాకమానవు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేసినవో గాని మొత్తానికి అన్ని రాజకీయ పార్టీలో ఈ అంశం పెద్ద రాజకీయ దుమారమే లేపిందనే చర్చ జోరుగా సాగుతుంది. రాజ్యాంగపరంగా రాజకీయాల్లో నాయకులకు రిటైర్మెంట్ వయసుకు సంబంధించిన అంశం ఎంతవరకు సాధ్యం అన్న విషయాన్ని పక్కన పెడితే, వయసు పైబడిపోతున్న కొందరు చివరి వరకు రాజకీయాల్లో అలాగే కొనసాగుతూ ఉండడం, ఆధునిక రాజకీయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందిన నేటితరం యువ రాజకీయ నాయకత్వానికి కొన్ని సందర్భాల్లో తప్పితే చాలావరకు రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు రాకపోవడానికి ఒక కారణం కావచ్చు అనే సంశయం కలగక మానదు. ఏదేమైనప్పటికీ దేశ రాజకీయ వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలలో వయసులో పెద్దవారై రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన నాయకులు ఈతరం నాయకులకు మార్గదర్శకులుగా ఉంటూ, మంచి ఆలోచన వివేచన నిర్ణయాత్మక ధోరణిగల యువ నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందనే వాదనలు సమాజంలో వినిపిస్తుండడం గమనార్హం. ●

# పేదలకు అందని ప్రభుత్వ వైద్యం?

సీజన్ మారినప్పుడల్లా విజృంభిస్తున్న దోమలు వాటి వల్ల ప్రబలే రోగాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విలవిల్లాడుతున్నారు. విషజ్వరాలు ఏమీ కొత్తకాదు. వర్షాకాలం ఆరంభంతో పాత నీరుపోయి, కొత్తనీరు రావడంతో రోగాలు విజృంభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి.ఈ యేడాది ఇప్పటికే విషజ్వరాల బారినపడి బీదా, బిక్కి,ధనిక,అని తేడా లేకుండా అల్లాడిపోతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ దవాఖానాలన్నీ కిటకిటలాడిపోతున్నాయి. ఈ వ్యాధులు సోకిన లక్ష్మిప్రసన్నుల సంగతి అలా ఉంచితే మధ్యతరగతి, మరీ ముఖ్యంగా రెక్కాడితే డొక్కాడని రోజూ కూలీలు, చిన్నాచితక వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగించేవారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇక ఏనాడో కూకటివేళ్లతో పెకిలించామని చెప్పుకుంటున్న వ్యాధులు కూడా అక్కడక్కడ కన్పిస్తున్నాయి.పాతరోగాలు తిరిగి మొలకెత్తి విస్తరిస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా భారత్ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యల్లో మలేరియా ఒకటిగా చెప్పొచ్చు. ఒకనాడు ఈ వ్యాధి సోకిందంటే ప్రాణాలు పోయినట్లేనని భయాందోళనలు చెందేవారు. 1947లో దాదాపు ఏడు న్నర కోట్ల మందికి ఈ వ్యాధి సోకగా సుమారు ఎనిమిదిన్నర లక్షల మందికిపైగా మరణించారు. ప్రధానంగా జూన్, సెప్టెంబరుల మధ్యనే ఈ వ్యాధి విస్తరించేది. ఆనాటి నుంచే చేస్తున్న పరిశోధనలు,నూతన మందులు, చికిత్స విధానంలో మార్పుల ఫలితంగా తగ్గుముఖం పట్టాయనే చెప్పొచ్చు. గత యేడాది రెండు లక్షల ఇరవై ఏడువేల మందికి ఈ వ్యాధి సోకగా మరణాలసంఖ్య కేవలం ఇరవైమూడుకు తగ్గించగలిగారు. కేంద్రప్రభుత్వం 2006లో 'జాతీయ వ్యూహాత్మక మలేరియా నిర్మూలన ప్రణాళిక' ద్వారా ఆ వ్యాధి వ్యాపిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టింది. ఒడిశా,మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రత్యేక చికిత్స విధానాన్ని చేపట్టి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి రాకుండా అడ్డుకట్ట వేయగలిగారు. నగరాలు, పట్టణాల్లో కొంతవరకు నియంత్రించగలుగుతున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకర రంగా ఉంది. జనాభాలో ఎనిమిది శాతానికిపైగా ఉన్న గిరిజనుల్లో మలేరియా బారినపడుతున్న వారి సంఖ్య సగానికి కంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా. మెదడులో వ్యాపించే ప్రమాదకర పాల్సీపారం మలేరియా మృతుల్లో అరవైఐదు శాతానికి పైగా గిరిజనులే.అడవుల్లో, కొండ ప్రాంతాల్లో తేమ వాతావరణం దోమల వ్యాప్తికి కారణమవుతున్నది. ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్న దోమల్లో ఇమ్యూనిటీ పెరగడంవల్ల వాడుతున్న మందులు వాటిని నియంత్రించలేకపోతున్నట్లు డాక్టర్లే అంగీకరిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా పారిశుధ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకుతిలోదకాలు ఇవ్వడం వల్లదోమలు పెద్దఎత్తున ఉత్పత్తికావడం, రకరకాల వ్యాధుల విస్తరణకు కారణమవుతున్నాయి. సిబ్బంది, నిధుల కొరతతోగ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా ఏజెన్సీల్లో పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతున్నది. ఉన్న సిబ్బందిని కూడా ఆయా ప్రాంతాలకు పంపించి చికిత్స అందించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. భారత్‌ను మలేరియా రహితంగా మార్చాలనే లక్ష్యం నెరవేరాలంటే గ్రామీణరంగంలో వైద్యాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది.ప్రత్యేక నిధులను కేటాయించి పారి శుధ్యాన్ని మెరుగుపర్చాలి. ఇక కొత్తరోగాల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చికెన్‌గున్యా వ్యాధి గ్రామీణులను గడగడలాడిస్తున్నది. ఒకటి, రెండు రోజులు కాదు, నెలల తరబడి ఈ వ్యాధిసోకిన వారు మంచాన్ని వదలలేకపోతున్నారు. కొందరైతే రోజువారీ కాలకృత్యాలకు కూడా మరొకరి సహాయం లేకుండా చేసుకోలేకపోతున్నారు. ఈ వ్యాధివల్ల ప్రాణం పోకపోవచ్చు కానీ ఈ వ్యాధి ఇతర వ్యాధులకు తోడైతే ప్రాణాపాయం కలుగవచ్చునని వైద్యనిపుణుల అభిప్రాయం. ఇక డెంగ్యూ వ్యాధి ఇంకా వదలిపెట్టడం లేదు. ఇప్పటికీ డెంగ్యూతో మరణించేవారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా రోగ నిర్ధారణ ఒక మిథ్యగా మారుతున్నది. మామూలు జ్వరం లేక,డెంగ్యూనా, మరేదన్ననా అనే విషయంకోసం పరీక్షలు చేయడంలోనే జాప్యం జరిగితే వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. ముఖ్యంగా వైద్యసహాయానికి ఆమడదూరంలో ఉండే మారుమూల ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాల దాటినా నేటికీ కనీస ప్రాథమిక అవసరాలు తీర్చడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమ వుతున్నాయి.రాజ్యాంగం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలను పెంచి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ఆరోగ్యం అనేది ప్రజల ప్రాథమిక హక్కు. దాన్ని ప్రజలకు సమకూర్చడంలో ప్రభుత్వాలు ఏమేరకు సఫలం అవుతున్నాయో చెప్పక్కర్లేదు. యేటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చుపెడుతూ ఎన్నో సంస్కరణలు చేస్తూ ప్రభుత్వ వైద్యరంగం పురోగమిస్తుందని చెప్పుకుంటుంటే కేవలం కొందరి నిర్వాహకం వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం అంతకంత సన్నగిల్లుతున్నది. మొన్న కరోనా విజృంభణ సమయంలో దేశంలో వైద్యరంగం డొల్లతనం బయటపడింది. కనీసం ప్రాణవాయువు అందించలేకపోవడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా పాలకులు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలి.

> లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.
>
> రామకృష్ణ పరమహంస

> ప్రతి మనిషిలోనూ ఆవరించి ఉన్న పిశాచం స్వార్థం. స్వార్థంలో ప్రతి అంశం, ప్రతి భాగం పిశాచమే.
>
> స్వామి వివేకానంద

# స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు సాధ్యమేనా?

యం.అర్జున్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిర్ణయం రాజకీయ,సామాజిక, చట్టపరమైన చర్చలకు దారి తీసింది. ఈ నిర్ణయం కేంద్రరాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ సవరణలు, న్యాయ సమీక్షలు, కులగణన ద్వారా సేకరించిన గణాంకాల వివరాలతో ముడిపడి ఉంది. రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేసే తీర్పులు ఉన్నందున ఏదైనా రాష్ట్రం పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేసే ప్రయత్నం చేసినపుడు అవి న్యాయ సమీక్షకు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే, ఈ పరిమితిని అధిగమించేందుకు కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం తరుపున కేవియేట్ పిటిషన్ వేసినా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందంటూ ఆశావహ అభ్యర్థులు ఈ నిర్ణయంపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టుకు వెళ్ళినపుడు న్యాయ సమీక్షకు గురయ్యే అవకాశం లేకపోలేదు. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా మాత్రమే ఈ రిజర్వేషన్‌కు చట్టబద్ధ రక్షణ లభిస్తుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. 2024లో నిర్వహించిన కులగణన ఈ రిజర్వేషన్ పెంపులో కీలక పాత్ర పోషించనుంది.ఈగణన ప్రకారం, తెలంగాణ జనాభా 3.70 కోట్లుగా, బిసిలు 56.33 శాతంగా నమోదైంది. ఇందులో ముస్లింలు 10.08 శాతం, హిందువులు 46.25 శాతం ఉన్నారు. ఎస్సీ కేటగిరి 17.43.శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) 10.45 శాతం, ఓపెన్ కేటగిరీ 15.79శాతం, ముస్లింలు 2.48 శాతం ఉన్నారు. మొత్తం ముస్లింజనాభా 12.56 శాతం ఉన్నారు. ఈ సర్వేలో 3.54 కోట్ల మంది పాల్గొన్నారని మరో 16 లక్షల మంది సర్వేకు దూరంగా ఉన్నారని మొత్తం రాష్ట్ర జనాభా 3.70 కోట్లని ప్రభుత్వం తెలిపింది.ఈ గణాంకాలపై వివిధ కుల సంఘాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ముస్లింలను బీసీల్లో కలిపి లెక్కించారా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు. 2001-2011 దశాబ్దవృద్ధి రేటును, రాష్ట్రంలో ఉన్న ఆధార్ కార్డులు, ఓటర్ కార్డుల్ని పరిగణలోకి తీసుకున్నా రాష్ట్ర జనాభా నాలుగు కోట్లకు పైగా ఉంటుందన్నది వారి వాదన. 2011 జనగణన ప్రకారం తెలంగాణ జనాభా 3.50 కోట్లు, 2014 సమగ్ర కుటుంబ సర్వేప్రకారం 3.63 కోట్లుగా ఉంది.అంటే దాదాపు మూడు



న్నర ఏళ్లలో 13 లక్షల వరకు జనాభా పెరిగింది. కానీ, 2024 రాష్ట్ర జనాభా 3.70 కోట్లుగా తెలిపారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లలో కేవలం 7లక్షల జనాభా పెరిగినట్లు ఈ సర్వేద్వారా తెలుస్తోంది. ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశం ఒకవేళన్యాయ సమీక్షకు వెళ్తే న్యాయస్థానాల్లో ఈ డేటా సమర్పించినప్పుడు, ఈ సర్వే విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం లేకపోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2025 మార్చి 17న తెలంగాణ అసెంబ్లీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచే బిల్లులను ఆమోదించింది. ఈ బిల్లు 50 శాతం పరిమితిని మించడం వల్ల, కేంద్రఆమోదం, రాజ్యాంగ సవరణ అవసరం. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ అమలు చేయడం న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీతో పాటు పలు కుల సంఘాల నేతలు అధికార కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారు. సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్నీకేసులో రిజర్వేషన్‌ను 50శాతంగా పరిమితం చేసింది. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ పరిమితిని మించవచ్చని, దీనికి శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని తీర్పును ఇచ్చింది. వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ పరిమితిని మించినప్పుడు న్యాయస్థానాలు జోక్యంచేసుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. 2021లో మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ 50 శాతం పరిమితిని మించడంతో సుప్రీంకోర్టు దానిని రద్దుచేసింది. అసాధారణ పరిస్థితులను రుజువు చేయడంలో విఫలమైందని తీర్పు ఇచ్చింది. 2024లో బీహార్‌లో65శాతం రిజర్వేషన్‌ను పాట్నా హైకోర్టు రద్దు చేసింది. కులగణన డేటా సమర్థనీయం కాదని పేర్కొంది. తమిళనాడు 69శాతం రిజర్వేషన్‌ను 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా చట్టబద్ధ రక్షణ పొందింది.ఇదే విధమైన రాజ్యాంగ రక్షణ కల్పించాలని బిసి కుల సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. లేకుంటే గతంలో వెలువడిన తీర్పుల వల్ల తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ అమలు న్యాయస్థానాల్లో నిలదొక్కుకోవడం కష్టమని వాపోతున్నారు. కేంద్రం 2026లో జనగణనతో పాటు కులగణన చేపట్టనుంది. తెలంగాణ కులగణన గణాంకాలు, కేంద్రం సేకరించే డేటాతో సరితూగకుంటే, రిజర్వేషన్ అమలు సంక్లిష్టమవుతుంది. కేంద్ర ఆమోదం లేకుండా రాష్ట్రం ఏకపక్షంగా చేసే ప్రయత్నాలు చట్టపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. రాష్ట్రం తన డేటాను కేంద్రానికి సమర్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల్లో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నపుడు ఈ ప్రక్రియను ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం లేదా న్యాయ సమీక్షకు వెళ్ళినపుడు శాస్త్రీయమైన గణాంకాల్ని సమర్పించడం ద్వారా ఈ రిజర్వేషన్ చట్టబద్ధమైన రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ●

# ప్రజావాక్కు

## జనాభాను పెంచండి

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యువతరాన్ని ఎక్కువ మంది పిల్లలను కనమని సందేశం ఇచ్చారు. కొంతకాలం క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతులను చూసి వరి పంట పండించవద్దని హెచ్చరించారు. పై మూడు అంశాల్ని విడివిడిగా పరిశీలిస్తే విజయవాడలో గవర్నమెంట్‌హాస్పిటల్ పనిచేస్తున్న యువగైనకాలజిస్ట్ ముఖ్యమంత్రి గారితో ముఖాముఖిలో ఈ విషయంపై నిలదీశారు. ఉపాధి అవకాశాలతో తక్కువగా ఉన్న ఈ రోజుల్లో ఎక్కువమంది పిల్లల్ని కంటే ఎవరు పెంచుతారని ఆమె అడిగారు? వరి పంట పండిం చవద్దని,పొగాకు పత్తివంటి వ్యాపార పంటలను పండించ మనిపిలుపునిస్తూ అమరావతి రాజధాని పేరు పెట్టి కొన్ని వేల ఎకరాలు కాంక్రీట్ జంగిల్ చేయాలని చూస్తున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఉపాధ్యాయులను వేధించవద్దు

మెగా పిటిఎంను జూలై 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందరూ ఉపాధ్యాయులు తమకు శక్తి మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు,దాతలు, ప్రజాప్రతినిధులు, సహకారంతో విజయవంతం చేశారు. ఇప్పుడు అప్లోడ్ చేసిన ఫోటోలు వీడియోలు బాగోలేదు మరలసరిచూసి బాగున్నవి అప్లోడ్ చేయండి అని చెప్పడం సరికాదు. ఈ కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలోనే విద్యాశాఖ వారు మంచి సామర్థ్యం ఉన్న కెమెరాతో కెమెరామెన్ కూడా నియామకం చేస్తే బాగుండేది. ఉపాధ్యాయులు తమ శక్తి మేరకుతాము తీయించిన ఫోటోలు అప్లోడ్‌చేశారు. ఫోటోలు బాగో లేకపోతే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి ఇవ్వాలి. సంజాయిషీలు తెలపాలి అనడం సరైనది కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఎంజిఎం ఆసుపత్రిని పట్టించుకోండి

ఉత్తర తెలంగాణ జిల్లాలోవరంగల్ కేంద్రంగా ఉన్న ఎంజిఎం ఆసుపత్రికి నిత్యం వేలాది మంది వివిధ జబ్బులతో బాధపడుతూ రోగులురావడం జరుగుతుంది. కొన్ని విభాగాలలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్లా వివిధ రోగాలతో బాధపడేవారు ఇబ్బందులు పడుతూ వున్నారు. ప్రభుత్వంస్పందించి డాక్టర్స్ సమయపాలన పాటించేలా, రోగులకు మంచి వైద్యం అందించేలా కృషి చేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## అమెరికా దుందుడుకు చర్య

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2024లో మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదంతో భారీ విజయం సాధించి గద్దెనెక్కారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ప్రపంచ దేశాల వాణిజ్య వ్యవహారాల విషయంలో అనుసరిస్తున్న తీరు వివాద స్పదమవుతోంది. ఆయా దేశాలపై విధిస్తున్న సుంకాల విషయంలో గడువు తేదీలుపెట్టడం, అమెరికా ఎగుమతి చేసే వాటిపై అధిక సుంకాలు విధిస్తూ, అమెరికా దిగుమతి చేసుకునే వాటిపై సుంకాలను తగ్గించుకునే విధంగా ప్రపంచ దేశాలను ఒత్తిడి చేయటం దుందుడుకు చర్య. 'రాను రాను రాజు గుఱ్ఱం గాడిద'గా మారిన చందంగా అమెరికా వ్యవహారశైలి ఉంటోంది. గతంలోనిఅమెరికా ప్రభుత్వాలు ప్రపంచదేశాలకు నిధులను మంజూరు చేసి ప్రపంచ దేశాలను తన గుప్పెట్లో పెట్టుకునేది. ఇప్పుడు, అప్పటి పరిస్థితులు లేవు. అన్ని దేశాలు కొద్దో గొప్పో అభివృద్ధి చెందాయి. ఆ కారణం చేత ప్రపంచ దేశాలపై సుంకాలు అధికంచేస్తోంది.ప్రతిదేశానికి వాణిజ్యపరమైన కొన్ని ప్రణాళికలు ఉంటాయి. ప్రపంచంలో అమెరికా మాత్రమే దేశం కాదు. అన్ని దేశాలు సమానంగా మనుగడ సాగించే వీలు ఉంటుంది.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## అందని యూరియా.. సాగు సాగేదెట్లా?

వానాకాలం మొదలయ్యి ఇప్పటికే నెలన్నర దాటింది. ఇప్పటికే లోటు వర్షాపాతంతో బాధపడుతున్న రైతన్నలకు యూరియా కరవు దిగులును మిగులుస్తుంది. దాన్ని అదనుగా తీసుకొని దళారి వ్యాపారులు నల్ల మార్కెట్‌కు తెరతీశారు. దీనివల్ల రైతు మరింత ఇబ్బందుల పాలయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి ఒక ఐఎస్ ఆఫీసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా పెట్టి ఎక్కడికక్కడ పరిస్థితిని చక్కదిద్దాలి. లేకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

- భారత అవినాష్,జనగామ

## తెలుగు, హిందీ, టీచింగ్‌పై నిర్లక్ష్యం

ప్రతి విద్యా సంస్థలలో, గురుకులాల్లో తెలంగాణ రాష్ట్ర మాతృ భాష అయిన తెలుగు, జాతీయ మాతృ భాష అయిన హిందీ భాషా నిర్లక్ష్యంచేయడం జరుగుతుంది. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్నవిద్యార్థులకు తెలుగు,హిందీ భాషలలో అక్షరాలు చదవడం రాయడం రావడం లేదు. కనీసం అక్షర జ్ఞానం లేని విద్యార్థులు ఉంటున్నారు. పార్ట్ టైం జాబ్ టీచర్స్ సమయ పాలన పాటించడం లేదు.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# హస్త భూషణమా! మస్తక వ్యసనమా?



మేకిరి దామోదర్

ఆధునిక సమాజంలోని మనుషులు వివిధ రకాల భావజాలాలతో ఉంటారు. అలా మితవాదులు, అతివాదులు, హేతువాదులు వీరంతా వారివారి వాదాలను దృఢంగా నమ్ముతారు. కొన్నిసార్లు వారి వాదాలను పక్కనపెట్టి అందరికీ సమ్మతమైన మానవతావాద దృక్కోణంలో చూస్తారు.పూర్వకాలంలో పురాణాల్లో రాముడు కోదండపాణి ధారి,కృష్ణుడు చక్రధారి మరి ఆధునిక యుగంలో మనమంతా స్మార్ట్‌ఫోన్ ధారులం. పైన చెప్పిన వారి వాదాలకైనా,ఆయుధాలకైనా విరామం ఉంటుందేమో గాని విశ్వమానవాళి స్మార్ట్‌ఫోన్‌కు బానిసై నిర్విరామంగా అదే పనిగా చూస్తూ, అందులోనే మునిగిపోతున్నారు. వారి విలువైన కాలాన్ని వృథాగా గడిపేస్తున్నారు. ఎప్పుడో ముసలితనంలో మనిషికి 'చాదస్తం' అనే 'మూడో హస్తం' మొలుస్తుందంటారు. కానీ నేటి ఆధునిక టెక్నాలజీ యుగంలో చిన్నతనంలోనే స్మార్ట్‌ఫోన్ అరచేతిని ఆక్రమించింది. పుస్తకం 'హస్త భూషణం' అనేది పాత మాట, స్మార్ట్‌ఫోనే 'హస్తభూషణం' అనేది నేటిపాటగా మారింది. పొద్దస్తమానం ఆన్‌లైన్‌లో ఉంటారు. రింగ్‌రింగో అంటూ మ్రోగుతోంది.డ్రగ్స్, గంజాయి, మద్యం ఇవే కాదు డిజిటల్ రూపంలోనూ వ్యసనం యువతను, పిల్లల్ని వెంటాడుతోంది. వారు సెల్‌ఫోన్ వదల్లేకపోతున్నారు.చిన్నపిల్లలు అయితే మొబైల్ ఇస్తేనేతింటాం, చెప్పింది చేస్తామంటూ మారం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా వారిని బుజ్జగించే క్రమంలో పిల్లల చేతిలో మొబైల్ పెట్టేస్తున్నారు. దీంతో ఆడుతూ పాడుతూ గడపాల్సిన బాల్యం స్మార్ట్‌ఫోన్ చెరలో బందీ అవుతోంది. పిల్లలు వారికి తెలియకుండా ఆవలలో చిక్కుకుంటున్నారు. వారించే ప్రయత్నం చేస్తే తల్లిదండ్రులని కూడా చూడకుండా క్రూరంగా దాడులకు తెగబడుతున్నారు. ఏ అలవాటైనా వ్యసనంగా మారినప్పుడు ఎవరైనా నిరోధించడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటనకు దారితీస్తుంది. ఆ కోపంలో దాడి చేసేందుకు కూడా వెనకాడరని మానసిక నిపుణులు చెప్తున్నారు.ఇలాంటి వారికి ఒకపద్ధతి ప్రకారం నచ్చచెబుతూ వాటినుంచి దూరం చేయాలని సూచిస్తున్నారు. రోజులో ఒక ఖచ్చితమైన సమయంలో ఫోన్ చూసేందుకు అనుమతించాలి. అరగంటలేదా గంట గడువు పెట్టాలి. ఇది పిల్లలు స్క్రీన్‌పై ఎక్కువ సమయం గడపకుండా నిరోధిస్తుంది. దినచర్యలో నిర్ణీత సమయం భాగమైనప్పుడు వ్యసనం కూడా అడ్డుకట్ట వేయవచ్చు. ప్రస్తుతం చాలా మంది పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారు. పిల్లల శారీరక,మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో ముఖ్యం.రోజూ ఒక గంటపాటు అవుట్ డోర్ ఆటల వైపు మళ్ళించడం వల్ల ఫోన్, ఇతర వ్యసనాల బారిన పడకుండా చూసుకోవచ్చు. హోంవర్క్ చేస్తే, అన్నం తింటేఫోన్ ఇస్తానని పిల్లలకు కొందరు తల్లిదండ్రులు ఆశ చూపుతుంటారు. ఆ పని చేసిన వెంటనే ఆడుకోవడానికి ఫోన్ ఇచ్చేస్తుంటారు. ఇలా చేయడం కూడా వారిని వ్యసనం వైపు మళ్లి



స్తుందని గుర్తించాలి.చాలామంది తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతూ పిల్లలకు మాత్రం ఉపయోగించ వద్దని సూచిస్తుంటారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ముందు మీరు క్రమశిక్షణ పాటించాలి. దీంతో పిల్లలు మిమ్మల్ని చూసి అనుసరిస్తారు. సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించేలా ఆటలు, ఈత, మ్యూజిక్, డాన్స్‌వంటి వాటిపై దృష్టి సారించేలా చేయాలి. చిన్నప్పటి నుంచి ప్రత్యేక లక్ష్యం దిశగా పిల్లల్ని నడిపించాలి. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి అలవాటు పడితే బయటపడడం చాలా కష్టం. ఆపాలని చూసినా కొందరు చాలా క్రూరంగా మారిపోతారు. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ కూడా వ్యసనంగా మారుతోంది. పిల్లలకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర. కచ్చితంగా కొంత సమయమే వినియోగించేలా చూడటం. పిల్లలతో ఎక్కువ సమయం గడపడం, అవసరమైతే కౌన్సిలర్ సలహా తీసుకోవడం వంటి చర్యలతో వ్యసనం నుంచి క్రమేపి దూరం చేయాలి. స్మార్ట్ ఫోన్ అతి వినియోగానికి అడ్డుకట్టుట వేయడం ద్వారా భావితరం జీవితాలు ప్రమాదంలో పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది.ప్రపంచ దేశాలలో సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడం పై నిషేధం విధించింది. దేశంలోని పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ చర్యలు తీసుకుంది. స్వీడన్‌లో 13 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు మూడు గంటల కంటే ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలను వినియోగించకూడదు.దక్షిణకొరియాలో 16 ఏళ్లలోపు పిల్లలు మధ్య రాత్రి నుంచి ఉదయం 6 గంటల వరకు ఆన్లైన్ గేమ్‌లు ఆడకూడదు. చైనాలో రోజుకు 40 నిమిషాలకు మించి టిక్‌టాక్ ఆన్లైన్ గేమింగ్‌పై నిషేధం. ఇంగ్లాండ్‌లో 16 ఏళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగానికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. స్పెయిన్‌లో 16 ఏళ్ల వరకు సోషల్ మీడియా వినియోగంపై బ్యాన్ విధించింది.ఇలా ఇతర దేశాలవలె పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై కఠిన నిబంధనలు రావాలి. మన దేశంలో కూడా డిజిటల్ డేటా,ప్రొటెక్షన్ యాక్ట్2023 ప్రకారం పిల్లలు సామాజిక మాధ్యమాలను వినియోగించాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. కానీ తల్లిదండ్రులే వయసు తారతమ్యం లేకుండా పిల్లలనుంచి వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్లో బానిసలై వ్యసనపరులుగా మారిన దుర్భర స్థితి మన దేశంతో పాటు విశ్వమానవ సమాజాన్ని వెంటాడుతోంది. స్మార్ట్‌ఫోన్ తయారీ అధినేత తన పిల్లలను 14 ఏళ్లు దాటేదాకా స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉంచారు.16 సంవత్సరాల వయసువరకు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని ఆయన సూచన. ఈ వ్యసనం భావోద్వేగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే సోయి కూడా మర్చిపోతున్నారు. మనుషుల కోరికలకు సమాజ కట్టుబాట్లకు, ఆరోగ్యానికి మధ్యసంఘర్షణను..అనుబంధాల సంక్లిష్ట గాఢతను ఫోన్ దూరం చేస్తోంది. వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక బాధ్యతలను విస్మరించిన మనిషి ఫోను మోజులో పడి ఎంతో నలిగిపోతూ ఒత్తిడికి గురవుతున్నాడు. స్మార్ట్‌ఫోను అవసరానికి వాడితే ఫర్వాలేదు. అతి చేసి మితిమీరి గతి తప్పితే మతి చెడుతుంది. నేటి, రేపటి తరంలో స్వీయ మనోవికాసం తగ్గి, సృజనాత్మకత, వినూత్నత కొరవడుతుంది. ●

# రష్యా చమురుకొంటే 100% అదనపు సుంకాలే!


## ప్రత్యేక బిల్లు తెస్తున్న అమెరికా



**మాస్కో,జూలై 15:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతరదేశాలకు షాక్ ఇచ్చేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతోంది. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ 50 రోజుల్లో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడంలో విఫలమైతే మాస్కోపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత యూఎస్ సెనేటర్లు లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారత్ సహా ఇతర దేశాలపై కూడా భారీ ఆర్థిక ఆంక్షలు విధిస్తామని లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ హెచ్చరించారు. అలాగే రష్యాపై 100 శాతం సెకండరీ టారిఫ్‌లు విధిస్తామన్న ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాన్ని ప్రశంసిస్తూ, దీన్ని కీలకమైన ముందడుగుగా అభివర్ణించారు. ఈ క్రమంలో యూఎస్ సెనేటర్లు లిండ్స్ గ్రాహం, రిటర్డ్ బ్లూమెంటర్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చైనా, భారత్, బ్రెజిల్, ఇతర దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నాయి. ఈ దేశాలు రష్యా యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్నాయి. రష్యాకు సహాయం చేసే దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధించాలి. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి అంతిమ అవకాశం చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై సుంకాలు విధించడమే. రాబోయే 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యన్ చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం సుంకాలను అమలు చేయాలనే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. వీటి లక్ష్యం పుతిన్ శాంతి ఒప్పందానికి వచ్చేలా చేయడమే. రష్యా నుంచి చమురు, గ్యాస్ ను కొనుగోలు చేసి ఉక్రెయిన్‌కు సహాయం చేయని దేశాలపై 500 శాతం వరకు సుంకాలను అమలు చేసే మా ద్వైపాక్షిక రష్యా ఆంక్షల చట్టంపై వైట్‌హౌస్‌తో కలిసి పనిచేస్తామని గ్రాహం, బ్లూమెంటల్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కరోలీనా రిపబ్లికన్ సెనేటర్ గ్రాహం, డెమొక్రటిక్ సెనేటర్ బ్లూమెంటల్ ఈ ఏడాది ప్రారంభంలో కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన ద్వైపాక్షిక బిల్లుపై 85 సహ స్పాన్సర్లకు నాయకత్వం వహించారు. ఈ బిల్లును మాస్కోపై ఆంక్షలను అమలు చేసేందుకు రూపొందిచారు. భారత్, చైనా, బ్రెజిల్, ఇతర దేశాలను పుతిన్ యుద్ధతంత్రానికి ఆజ్యం పోయకుండా నిరోధించడానికి సెనేటర్ గ్రాహం, నేను రష్యా ఆంక్షల బిల్లు కోసం ఒత్తిడి చేస్తూనే ఉంటామని రిచర్డ్ బ్లూమెంటల్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుత్తెతో సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రష్యా వైఖరిపట్ల చాలా అసంతృప్తిగా ఉన్నానన్నారు. 50రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యాపై 100శాతం సెకండరీ టారిఫ్‌లను విధిస్తామని హెచ్చరించారు. రష్యా వైఖరి పట్ల తాము చాలా అసంతృప్తిగా ఉన్నామని తెలియజేయడానికే నాటో చీఫ్‌తో భేటీ అయ్యానని తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే అమెరికా బిల్లు గురించి ఇటీవలే భారత విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందించారు. రష్యాపై బిల్లుకు సంబంధించి భారత రాయబార కార్యాలయం సెనేటర్ గ్రాహంతో సంప్రదింపులు జరిపిందన్నారు. ఇంధనం, భద్రతపై భారత్ తమ ఆందోళనలు, ఆసక్తులను గ్రాహంకు వివరించిందని పేర్కొన్నారు. సెనేటర్ లిండ్సే గ్రాహం రూపొందించిన బిల్లు భారత ప్రయోజనాలను ఏమైనా ప్రభావితం చేస్తుందా అనేది తెలుసుకుంటున్నాం. అందుకే మేము సెనేటర్ లిండ్సే గ్రాహంతో సంప్రదింపులు జరుపుతున్నాం. అమెరికాలోని భారత రాయబారి ఆయనతో చర్చలు జరిపారు. ఇంధనం, భద్రతపై భారత్ ఆందోళనలు, ఆసక్తులను ఆయనకు తెలియజేశామని జైశంకర్ తెలిపారు.

# చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జైశంకర్ భేటీ

## ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు



**బీజింగ్,జూలై 15:** భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిశారు. ఇటీవలి కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జరిగిన పరిణామాల గురించి ఆయనకువివరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ రోజు ఉదయం బీజింగ్‌లో నా తోటి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రులతో కలిసి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిశాను. ఇటీవల ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పురోగతి గురించి ఆయనకు వివరించాను. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో దేశ నాయకత్వాల నిరంతర మార్గదర్శకత్వం ఎంతో అవసరమని వివరించాను. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం జైశంకర్ చైనాలో పర్యటిస్తున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్, విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీ అయిన ఆయన, చైనాభారత్ సంబంధాలు క్రమంగా బలపడుతున్నట్లు వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాలను మరింత బలోపేతం చేసుకోవడం వల్ల ఇరుదేశాలతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనకరమని అభిప్రాయపడ్డారు. చైనా వైపు నుంచి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటికి సంబంధించిన సమాచారాన్ని అందించడంపై జైశంకర్ వారితో చర్చించారు. సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, ప్రజల రాకపోకలను అనుమతించడం, నిర్బంధ వాణిజ్య చర్యలను, అడ్డంకులను నివారించడం మా బాధ్యత. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల పథంలో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాము. రేపు టియాంజియన్‌లో జరిగే ఎస్‌సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకావడానికి ఎదురుచూస్తున్నాము. మంచి ఫలితాలు, నిర్ణయాలను నిర్ధరించడానికి భారత్ కట్టుబడి ఉందని జైశంకర్ అన్నారు. సింగపూర్ పర్యటన ముగించుకున్న జైశంకర్ ఎస్‌సీఓ సమావేశంలో పాల్గొనేందుకు చైనా వెళ్లారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య విమానాల పునరుద్ధరణ సహా భారత్ పాక్ ఉద్రిక్తతలు, దలైలామా వారసత్వంపై ఇటీవల చెలరేగిన వివాదం మొదలైన అంశాల గురించి ఆయన చర్చించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జూన్ నెలలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌లు చైనాలో పర్యటించారు. అప్పుడు రాజనాథ్ సింగ్ చైనాలోని క్వింగ్దావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వ స్థాయి సదస్సుకు హాజరయ్యారు.



# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరం సింగపూర్

**సింగపూర్‌సిటీ, జూలై 15:** విలాసానికి అవధులుండవు. కానీ, దానిని అనుభవించాలంటే కచ్చితంగా డబ్బు కావాల్సిందే. మీరు ఖర్చుకు వెనకాడని వ్యక్తి అయితే ప్రపంచంలో బోలెడు ఖరీదైన నగరాలున్నాయి. సకల సౌకర్యాలను అనుభవించడంతోపాటు ఎంచక్కా మీకు కావాల్సిన ఖరీదైన వస్తువులను కూడా కొనుక్కోవచ్చు. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యంత ఖరీదమైన నగరంగా సింగపూర్ నిలిచింది. వరుసగా మూడో యేడాది ఈ ఘనతను సింగూర్ దక్కించుకోవడం విశేషం. మరోవైపు రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను పక్కను నెట్టి ఆ స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంగ్‌కాంగ్ మూడో స్థానానికి పరిమితమైంది. కనీసం 1 మిలియన్ డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న విలాసాల ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్‌స్టయిల్ ఇండెక్స్ విశ్లేషించి ఈ నివేదికను తయారుచేసింది. ఈ యేడా ఫిబ్రవరి–మార్చి మధ్య డేటాను పరిగణనలోకి తీసుకున్నట్లు జూలియస్ బేర్ వెల్లడించింది. **ఖరీదైన నగరంగా సింగపూర్ ఎందుకు?** సింగపూర్ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు అందరికీ అనుకూలంగా ఉన్నాయి. దీంతో పలువురు అంతర్జాతీయ వ్యాపారులు సింగపూర్ కేంద్రంగానే తమ బిజినెస్‌ను నిర్వహించేందుకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా గతంలో వెళ్లిపోయిన వ్యాపారులను కూడా తిరిగి రప్పించేందుకు సింగపూర్ కొన్ని సంస్కరణలు చేపట్టింది. దీంతో అక్కడి జీవన వ్యయం అమాంతం పెరిగిపోయింది. ఇక్కడి ప్రజలు ఎక్కువగా బంగారం కొనుగోలు చేసేందుకు ఇష్టపడతారు. ఇదే సింగపూర్‌ను అత్యంత ఖరీదైన నగరంగా నిలిచేలా చేసిందని రిపోర్టు పేర్కొంది. అంతేకాకుండా స్థానికులు ఎక్కువగా ఆహారం, బూట్లు, హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్, విద్యపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు జూలియస్ బేర్ నివేదిక పేర్కొంది. తాజా ఫలితాల ప్రకారం కరోనా మహమ్మారి తీవ్రత సాధారణ స్థితికి వచ్చినప్పటికీ.. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ధరలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయని నివేదిక పేర్కొంది.

**హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి..** గతేడాది ఫలితాలతో పోల్చుకుంటే లండన్ మహానగరం ఓ మెట్టు ఎక్కింది. రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. జ్యూరిచ్ సహా ఇతర ఐరోపా నగరాలు కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డాయి.

**టాప్ 10 ఖరీదైన నగరాలు ఇవే:** 1. సింగపూర్ 2. లండన్ 3. హాంగ్‌కాంగ్ 4. షాంఘై 5. మొనాకో 6. జ్యూరిచ్ 7. న్యూయార్క్ 8. పారిస్ 9. సావోపాలో 10. మిలాన్.

# ఆత్మహత్యకాదు వ్యవస్థీకృత హత్య: విద్యార్థిని మృతిపై భగ్గుమన్న విపక్షాలు



**భువనేశ్వర్,జూలై 15:** ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మృతి చెందడంతో ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకృత హత్య అని దుయ్యబట్టాయి. మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిజెపి తీరును తీవ్రంగా ఖండించారు. ఒడిశాలో ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తాళలేక నిప్పంటించుకున్న 22 ఏళ్ల విద్యార్థిని 3 రోజులుగా ప్రాణాలతో పోరాడి ఓడిపోయింది. 95శాతం కాలిన గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు మూత్రపిండాల మార్పిడి కూడా చేసినట్లు ఎయిమ్స్ భువనేశ్వర్ వైద్యులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యం వల్ల ఒక ప్రాణం పోయిందని తలుచుకుని ఆవేదన చెందుతున్నాం. ఇది అత్యంత బాధాకరమైన విషయం. వాస్తవానికి ఇది ప్రమాదం కాదు. ఆమెకు సాయం చేయకుండా సైలెంట్‌గా ఉన్న వ్యవస్థ వైఫల్యం వల్లే ఇలా జరిగింది. కళాశాల అధికారులు పట్టించుకోకపోయినా ఆమె ధైర్యం కోల్పోలేదు. న్యాయం కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని న్యాయం చేయాలని అడిగింది. బాలేశ్వర్ ఎంపీని స్వయంగా కలిసింది. ఎవరైనా ఒకరు బాధ్యత తీసుకుని ఉంటే ఆ విద్యార్థిని బతికే అవకాశం ఉండేదని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. కాగా, ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకృత హత్య అని బిజెపిపై మండిపడ్డారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందంటూ రాహుల్ మంగళవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం బాధిత విద్యార్థిని ధైర్యంగా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా తన గొంతుకను వినిపించింది. అందుకు, ఆమెకు న్యాయం చేయడానికి బదులుగా బెదిరించి, హింసించారు. పదేపదే అవమానించారు. ఎప్పటిలాగే బిజెపివ్యవస్థ నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. ఒక అమాయకురాలైన విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకునేలా చేసింది. ఇది ఆత్మహత్య కాదు వ్యవస్థీకృత హత్య. మోడీజీ ఒడిశా లేదా మణిపూర్‌లో అయినా దేశంలో కుమార్తెలు కాలిపోతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు ఇంకా మౌనంగానే ఉంటారా దేశానికి మీ మౌనం అవసరం లేదు. వీటన్నింటికీ సమాధానాలు కావాలి. భారతదేశ మహిళలకు భద్రత, న్యాయం కావాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# న్యూయార్క్, న్యూజెర్సీలను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

**వాషింగ్టన్, జూలై 15:** అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ నగరాలకు వరదలు ముంచెత్తాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదలకు అనేక ఇళ్లు నీట మునిగాయి. ప్రధాన రహదారులు సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. రవాణా ఆగిపోయింది. ఈ ప్రభావం విమానాల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నేపథ్యంలో న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, అధిక వర్షపాతం కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నివాసితులు ఇళ్లలోనే ఉండాలని, అనవసర ప్రయాణాలను పెట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. మరోవైపు న్యూయార్క్ సిటీలోని మన్‌హటన్, బ్రూక్లిన్, క్వీన్స్, స్టేటెన్ ఐలాండ్ ప్రాంతాలకు నేషనల్ వెదర్ సర్వీస్ ఆకస్మిక వరద హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు న్యూయార్క్ సిటీ మెట్రో వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. సబ్‌వేల్లోకి వరద పోటెత్తింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో అనేకమంది నివాసితులు అంధకారంలో ఉండిపోయారు. పలు ప్రాంతాలను వరదలు చుట్టుముట్టడంతో



వేలాది మంది నివాసితులు జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపాయి. వరదలు, వర్షాల కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# సంజయ్‌దత్ తలుచుకుంటే ముంబయి పేలుళ్లు ఆపేవారు

## ప్రముఖ న్యాయవాది ఎంపి ఉజ్వల్‌నికమ్



**ముంబయి, జూలై 15:** మహానగరం ముంబైలో 1993లో జరిగిన పేలుళ్ల కేసును వాదించిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తలుచుకుని ఉంటే ఆ పేలుళ్లను ఆపి ఉండేవాడని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదిగా పలు సంచలన కేసులను వాదించిన ఉజ్వల్ నికమ్ ఆ తర్వాత రాజకీయ అరంగేట్రం చేశారు. మీడియా ఇంటర్వ్యూల్లో ఆయన ముంబై పేలుళ్ల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. 1993, మార్చి 12న ముంబైలో వరుస పేలుళ్లు జరిగాయి. ఆ పేలుళ్లకు కొన్ని రోజుల ముందు సంజయ్ ఇంటికి ఆయుధాలతో నిండిన ఓ వ్యాన్ వచ్చింది. గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబూ సలేం తీసుకొచ్చిన ఆ వ్యాన్‌లో హ్యాండ్ గ్రనేడ్లు, ఏకే 47 తుపాకులు, బాంబులు ఉన్నాయి. వాటిని సంజయ్ పరిశీలించారు. వాటిల్లో నుంచి ఒక ఏకే 47 తుపాకీని తీసుకుని తన దగ్గర ఉంచుకున్నారు. అయితే ఆ ఆయుధాల వ్యాన్ గురించి పోలీసులకు సంజయ్ సమాచారం ఇచ్చి ఉంటే ఆ పేలుళ్లు జరిగి అంత మంది చనిపోయి ఉండేవారు కాదు అని ఉజ్వల్ పేర్కొన్నారు. ముంబై పేలుళ్లతో సంబంధం ఉందనే కారణంతో సంజయ్‌పై అప్పట్లో టాడా కేసు నమోదైంది. సంజయ్ ఉగ్రవాది అని ఆరోపణలు వచ్చాయి. కోర్టు మాత్రం సంజయ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడనే అభియోగం మాత్రం రుజువు కావడంతో సంజయ్‌ను దోషిగా నిర్ధారిస్తూ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. పుణెలోని యరవాడ జైల్లో శిక్ష అనుభవించిన సంజయ్ 2016లో విడుదల అయ్యాడు. కాగా, న్యాయవాది ఉజ్వల్ నికమ్ బిజెపిలో చేరి 2024లో ముంబై నార్త్‌సెంట్రల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా ఆయనను బిజెపిరాజ్యసభకు నామినేట్ చేసింది.

# మారథాన్ యోధుడు రోడ్డుప్రమాదంలో దుర్మరణం

**జలంధర్,జూలై 15:** మారథాన్‌ను పూర్తి చేసిన అత్యధిక వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన ఫౌజా సింగ్ ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం జలంధర్ పఠాన్ కోట్ జాతీయ రహదారిపై ఆయనను ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఫౌజా సింగ్‌ను స్థానికులు హుటాహుటిన దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఫౌజా సింగ్ తలకు తీవ్ర గాయమైందని, రక్తస్రావం కారణంగా ఆయన తుదిశ్వాస వదిలారని వైద్యులు ప్రకటించారు. విదేశాల్లో ఉంటున్న ఆయన పిల్లలు వచ్చే వరకూ ఫౌజా సింగ్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచుతామని వారు చెప్పారు. పంజాబ్ లోని జలంధర్ జిల్లా బేయాస్ గ్రామంలో 1911 ఏప్రిల్ 1న ఫౌజా సింగ్ జన్మించారు. ఆయనకు ప్రస్తుతం 114 ఏళ్లు. భార్య, కొడుకు మరణం తర్వాత ఫౌజా



సింగ్ రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. 89 ఏళ్ల వయసులో మొదలు పెట్టిన పరుగును వందేళ్లు దాటినా ఆపలేదు. ఈ వయసులోనూ ఫౌజా సింగ్ ఉత్సాహంగా పరుగులు తీసి రికార్డులకెక్కారు. పలు మారథాన్లను పూర్తిచేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. లండన్, న్యూయార్క్, టొరంటోలలో జరిగిన మారథాన్ లలో ఫౌజా సింగ్ పాల్గొన్నారు. ఫౌజా సింగ్ మరణంపై పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా విచారం వ్యక్తంచేశారు.వందేళ్లు దాటినా ఉత్సాహంగా పరుగులు తీస్తూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు.

# యుద్ధాలను ఆపాలంటే నన్ను మించినవారు లేరు..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్,జూలై 15:** దేశాల మధ్య యుద్ధాలను ఆపడంలో తనను మించిన వారు లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని తన చాతుర్యంతో తప్పించానని చెప్పారు. భారత్ పాకిస్థాన్ ల మధ్య అణు యుద్ధం జరిగే ప్రమాదాన్ని తానే తప్పించేశానని మరోమారు పేర్కొన్నారు. ఇటీవల ఆ రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయని, యుద్ధం ముదిరి అణ్వాయుధ ప్రయోగానికి దారి తీసే ముప్పు ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. దీంతో తాను జోక్యం చేసుకుని ఇరు దేశాలను గట్టిగా హెచ్చరించినట్లు తెలిపారు. యుద్ధం ఆపకపోతే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని, భవిష్యత్తులో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోబోమని ఒత్తిడి చేశానని వివరించారు. దీంతో ఇరు దేశాలు వెనక్కి తగ్గాయని, ప్రపంచానికి మరో అణు యుద్ధ ముప్పు తప్పిందని ట్రంప్ తెలిపారు. రువాండా కాంగోల మధ్య గడిచిన 30 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం గురించి ప్రపంచం మొత్తానికీ తెలుసని ట్రంప్ గుర్తు చేశారు. ఇందులో సుమారు 70 లక్షల మంది చనిపోయారని ట్రంప్ చెప్పారు. ఈ వివాదాన్ని కూడా తాను సమసిపోయేలా చేశానని చెప్పుకున్నారు. ఈమేరకు సోమవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఉక్రెయిన్ ప్రభుత్వంలో ప్రక్షాళన





## ప్రధానిగా ఆర్థిక మంత్రి యూలియా స్విరిడెంకో నియామకం

### ప్రస్తుత ప్రధాని డెనిస్ ష్మీహాల్‌ను రక్షణమంత్రిగా నియమించుకున్న జెలెన్‌స్కీ

**కీవ్(ఉక్రెయిన్), జూలై 15:** మూడేళ్లుగారష్యాతో జరుగుతున్న యుద్ధంతో సతమతం అవుతున్న ఉక్రెయిన్‌లో ఇపుడు ప్రభుత్వ ప్రక్షాళన సాగుతోంది. అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీ కొత్తప్రధానమంత్రిని నియమించారు. అంతేకాకుండా ఇప్పటివరకూ ప్రధానిగా కొనసాగిన డెనిస్ ష్మీహాల్‌ను తన కేబినెట్‌లో రక్షణ మంత్రిగా నియమించుకున్నారు. కొత్తప్రధాన మంత్రిగా ఇప్పటివరకూ మొదటి డిప్యూటి ప్రధానిగా కొనసాగిన యూలియా స్విరిడెంకోను నియమిస్తున్నట్లు ప్రకటించారు. సోషల్‌మీడియా టెలిగ్రామ్‌లో డెనిస్ తన రాజీనామా లేఖను కూడా పోస్టు చేసారు. తనను ఇప్పటిరకూ సమర్థించినవారికి రుణపడి ఉంటానని, ఇపుడు మరింత కీలక స్థానంలోకి వస్తున్నామని, ఉక్రెయిన్‌ను శత్రుమూకలనుంచి రక్షించేందుకు అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి పనిచేస్తామన్నారు. డిప్యూటి ప్రధానిగా ఉన్న యూలియా ఎకానమి మంత్రిగా కూడా పనిచేసారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం అనుకోని సవాళ్లను తెచ్చింది. దీనికి తోడు అంతర్జాతీయంగా కూడా దౌత్యబంధాల పటిష్టతకు దోహదంచేసేవిధంగా ఉండాలని రష్యా పూర్తిస్థాయిలో మూడేళ్లుగా సాగిస్తున్న యుద్ధానికి చెక్‌పెట్టేందుకే ఈ విధానం అనుసరిస్తున్నట్లు వెల్లడి అయింది. జెలెన్‌స్కీ అధికార సోషల్‌మీడియా ఛానెళ్ల ప్రభుత్వానికి కొత్త ఉత్తేజం తీసుకురావాల్సిన అవసరం ఉందన్న వార్తలుప్రసారంచేసాయి. అందువల్లనే జెలెన్‌స్కీ యూలియా స్విరిడెంకోను ప్రధానిగా నియమించా రని చెపుతున్నారు. అలాగే విశేష అనుభవం ఉన్న ప్రస్తుత ప్రధాని డెనిస్‌ను రక్షణమంత్రిగా నియమించుకోవడం జెలెన్‌స్కీకి ఎంతోమేలు చేస్తుందన్న భావన వ్యక్తం అవుతోంది. ఉక్రెయిన్ ఆర్థిక నాయకత్వంలో కీలక పాత్రపోషించిన 39 ఏళ్ల స్విరిడెంకో అమెరికాతో చర్చల్లోకూడా కీలకపాత్రపోషించారు. అత్యంత కీలకమైన మిలిటరీ భాగస్వామితో జరిగిన చర్చల్లోకూడా ఆమె పాల్గొని కీలకపాత్రపోషించారు.

# సంక్షిప్తంగా

## రైతుల భూమిసేకరణపై వెనక్కి తగ్గిన కర్ణాటక సర్కార్

**బెంగళూరు, జూలై 15:** కర్ణాటకలోని దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్న హుబ్లి వద్ద 1,777 ఎకరాల రైతు భూములను సేకరించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకున్నట్టు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు ప్రకటించారు. బెంగళూరు రూరల్ జిల్లా చెన్నరాయపట్న హుబ్లి, సమీప గ్రామాల్లో 1,777 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా మూడున్నర ఏళ్లుగా రైతులు, ల్యాండ్ రైట్ యాక్టివిస్టులు తీవ్ర నిరసనలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ పెట్టాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. రైతుల సుదీర్ఘ



ఆందోళన నేపథ్యంలో సిద్ధరామయ్య అధ్యక్షతను మంగళవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాలు, భూముల యజమానులు, ల్యాండ్ రైట్స్ యాక్టివిస్టులు విధానసౌధలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. భూసేకరణకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఈ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది.

## సైన్యంపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్

**లక్నో, జూలై 15:** ఇండియన్ ఆర్మీపై పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీకి ఊరట లభించింది. ఆయనకు ఎంపి/ఎమ్మెల్యే కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. రూ. 20,000 వ్యక్తిగత పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అలోక్‌వర్మ ఆదేశించారు. తదుపరి విచారణకు ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేశారు. రాహుల్ మంగళవారం కోర్టు ముందు హాజరుకాగా, గతంలో ఐదుసార్లు ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. 2020లో భారత్, చైనా బలగాల మధ్య ఘర్షణలు సమయంలో భారత సైనికుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ ఈ పిటిషన్ వేశారు. భారత్ జోడో యాత్ర సమయంలో సరిహద్దుల్లోని పరిస్థితిని రాహుల్ ప్రస్తావిస్తూ అరుణాచల్ ప్రదేశ్‌లో భారత సైనికులను 'కొడుతుంటే' మీడియా ఎలాంటి ప్రశ్నలు వేయడం లేదని అన్నట్లు పిటిషనర్ పేర్కొన్నారు.

## ఎన్నికల్లో పార్టీ బలంతోనే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం: పళనిసామి



**చెన్నై,జూలై 15:** బీజేపీ తదితర పార్టీల కలయికతో ఏర్పడిన పొత్తు పటిష్టమని, సొంత బలంతోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని మాజీముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి మరోమారు ధీమా వ్యక్తంచేశారు. సేలం అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ప్రారంభించిన ఈపీఎస్ అక్కడినుంచి ఎన్నికల ప్రచారానికి బయలుదేరారు. ఈపీఎస్ మీడి యాతో మాట్లా డుతూ, అన్నాడీఎంకే కూటమి ఏకాభిప్రాయంతో దృఢంగా, విజయం సాధిస్తా మన్న నమ్మకంతో ఉందని, అందువల్ల 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించి తీరుతుందని అన్నాడీఎం సొంత బలంతోనే అధికార పీఠమెక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థినిపై లెక్చరర్ల అఘాయిత్యం: తల్లిదండ్రుల ఫిర్యాదుతో అరెస్ట్

**బెంగళూరు, జులై 15:** విద్యార్థులకు విద్య నేర్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురువులే మానవ మృగలలా ప్రవర్తించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ దారుణం జరిగింది. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో నరేంద్ర అనే వ్యక్తి ఫిజిక్స్ లెక్చరర్‌గా, సందీప్ బయాలజీ లెక్చరర్‌గా, అనూప్ నాన్‌టీచింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. అదే కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని నరేంద్ర అకడమిక్ నోట్స్ షేరింగ్ పేరుతో పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత అనూప్ ఇంటికి పిలిపించుకుని ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. నరేంద్ర విషయం బయటపెడతానని బ్లాక్‌మెయిల్ చేసి కొన్ని రోజుల తర్వాత సందీప్ కూడా అత్యాచారం చేశాడు. ఆ ఇద్దరితో కలిసేందుకు తన రూమ్‌కు పలుమార్లు వచ్చిన సిసి ఫుటేజ్ ఉందని బెదిరించి అనూప్ కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇలా ముగ్గురూ ఆమెను బెదిరిస్తూ దఫాలుగా అఘాయిత్యానికి ఒడిగట్టారు. చివరికి ఆ విద్యార్థిని తనను కలిసేందుకు వచ్చిన తల్లిదండ్రులతో విషయం చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. బాధితురాలికి వైద్యపరీక్షలు చేయించారు.

# రాష్ట్రంలో 5,774 ఎంపిటిసి స్థానాలు

### లెక్క తేల్చిన అధికారులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంపిటిసి స్థానాల లెక్క తేలింది. మొత్తంగా 5,774 స్థానాలు ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఖరారు చేసింది. ఈనెల 12తో ఎంపిటిసి స్థానాల పునర్విభజన పూర్తయింది. దీంతో స్థానాలపై స్పష్టత వచ్చింది. గత మార్చిలో 5,817 ఎంపిటిసి స్థానాలు ఉండగా... ప్రస్తుతం ఆ సంఖ్య 5,774కు తగ్గింది. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలు గ్రామాలు విలీనం కావడం, ఓఆర్ఆర్‌లోని గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడమే ఇందుకు కారణం. కొన్ని మండలాల్లో జనాభా ప్రకారం రెండు, మూడు ఎంపిటిసి స్థానాలే ఉండటంతో ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. ఒక మండలంలో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండే విధంగా మార్పులు చేసింది. వాస్తవానికి ఒక ఎంపిటిసి స్థానానికి 3,500 జనాభా ఉండాలి. ఎంపిపి వైస్‌ఎంపీపీలకు ఇద్దరు ఎంపిటిసి కావాలి. వారిని ఎన్నుకోవడానికి, ఎవరో వేదిక మీద కూర్చుంటే సమావేశానికి హాజరుకావడానికి కనీసం మరో ఎంపిటిసిఅయినా ఉండాలి. కాని పలు గ్రామాల్లో ఆ పరిస్థితులు లేకపోవడంతో ప్రతి మండలంలో కనీసం ఐదుగురు ఎంపిటిసిలు ఉండే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో అనేక మండలాల్లో ఐదు ఎంపిటిసి స్థానాలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో గతమార్చి తర్వాత కొత్తగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పడటంతో సమీప గ్రామాలను అందులో కలిపారు. ఓఆర్ఆర్ లోపలి గ్రామాలను సైతం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో ఎంపిటిసిల స్థానాల సంఖ్య తగ్గింది. గత మార్చిలో 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 5,774కు తగ్గింది. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలో 19 ఎంపిటిసి స్థానాలు ఉండగా ఆ జిల్లాను అర్బన్ జిల్లా మార్చారు. దీంతో ఆ 19 స్థానాలు కనుమ రుగైపోయాయి. ఖమ్మం, నారాయ ణపేట్, నాగర్ కర్నూలు, కొత్తగూడెం జిల్లాల్లో నాలుగు చొప్పున, ములుగు, సంగారెడ్డి జిల్లాల్లో మూడు చొప్పున, రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో ఒకటి చొప్పున ఎంపిటిసి స్థానాలు పట్టణ స్థానిక సంస్థల్లో విలీ నమయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 352 ఎంపిటీసీ స్థానాలు ఉండగా.. అత్యల్పం గా ములుగు జిల్లాలో 84 ఎంపిటీసీ స్థానాలు ఉన్నాయి.

**జిల్లాల వారీగా ఎంపిటిసిల స్థానాల వివరాలు**

మంచిర్యాలలో 166, ఆసిఫాబాద్‌లో 127, మంచి ర్యాలలో 129, నిర్మల్ 157, కరీంనగర్‌లో 170, జగిత్యాలలో 216, సిరిసిల్లలో 123, పెద్దపల్లిలో 139, నిజామాబాద్‌లో 307, కామారెడ్డిలో 237, సిద్దిపేటలో 230, సంగారెడ్డిలో 273, మెదక్‌లో 190, రంగారెడ్డిలో 231, వికారాబాద్‌లో 227, మహబూబ్‌నగర్‌లో 175, నారాయణపేటలో 132, నాగర్ కర్నూల్లో 210, గద్వాల్లో 142, వనపర్తిలో 133, సూర్యాపేటలో 235, నల్గొండలో 352, భువనగిరిలో 178, వరంగల్‌లో 130, హన్మకొండలో 129, ములుగులో 84, మహబూబాబాద్‌లో 193, భూపాలపల్లి 109, జనగామలో 134, ఖమ్మంలో 288, కొత్తగూడెంలో 288లో ఉన్నాయి.



## సహకార రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** సహకార రంగంలో నూతన ఒరవడికి శ్రీకారంచుట్టినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు మరియు వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సహకార పరపతి సంఘాలను తమ దృక్పథం మార్చుకోవాలన్నారు. కేవలం ఒకటి లేదా రెండు సేవలకు పరిమితం కాకుండా, రైతులకు సంబంధించి అన్ని సేవల రూపకల్పనలో పాలుపంచుకొన్నప్పుడుయితేనే ఆర్థిక పరిపుష్టి సాధించడంతో పాటు రైతులకు కూడా ప్రయోజనకారిగా ఉండగలమని పేర్కొన్నారు. ముల్కనూరు లాంటి సహకార సంస్థల మరిన్ని రాష్ట్రంలో ఉద్భవించే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మార్చి, వారికి మరింత ఆర్థికతోడ్పాటు అందించే ఆలోచన చేశామని తెలిపారు. రాష్ట్రంలో 311 సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లుగా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. వీటికి ఒక్కొకదానికి 15 లక్షల ఈక్విటీ గ్రాంటు మరియు 18 లక్షల మేనేజ్ మెంట్ ఖర్చు (మొత్తం 33 లక్షలు ) 167.93 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందులో మొదటి విడతాగా 9 కోట్లు 85 లక్షల 40 వేల రూపాయలు (ప్రతి శితిదిళీ కు 3,16,849 రూ ) విడుదల చేశామని వివరించారు.

## గత ప్రభుత్వ తప్పిదాలు కాంగ్రెస్‌కు ఆపాదించొద్దు: ఎంపి చామల

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం చేసిన పదేళ్ల తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దుతు దీనంతటికి మా ప్రభుత్వమేనన్నట్లుగా బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు రాంచందర్‌రావు ఆపాదించొద్దని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో ఎంపి చామల కిరణ్ మాట్లాడుతూ బిజెపి లో పాత కకారులు పోయి కొత్త కలహాలు వచ్చాయని ఎకసెక్కం చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాటల్లో సబ్జెక్ట్ లేదు. రాంచందర్ రావుకు మతి మరుపు ఉన్నట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు రేషన్ కార్డు లలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఫోటో ఎందుకు పెట్టలేదని నిలదీశారు. ట్రిపుల్ఆర్, మెట్రో ఫేజ్-2 త్వరగా నిధులు ఇచ్చి పూర్తి చేయడానికి సహకరిస్తే వాటి దగ్గర మోడీ ఫోటో లు పెడతామని తెలిపారు. బ్రిటీష్ హయాంలోనే కొందరు మైనారిటీ ముస్లిం లను బిసి లలో చేర్చారని ఆయన గుర్తుచేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా మైనారిటీ ముస్లింలు బిసిలలోనే ఉన్నారు. రాంచందర్‌రావు విషయపరిజ్ఞానం పెంచు కుంటే మంచిదని కోరారు. గత పదేళ్లలో ఏ రోజైనా తుంగతుర్తి అభివృద్ధి గురించి జగదీష్‌రెడ్డి మాట్లాడలేదని అన్నారు. గంజి లేని జగదీష్‌రెడ్డి బెంజ్ కారులో ఎలా తిరుగుతున్నాడని ప్రశ్నించారు.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 353

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 15, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 353 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 63 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 22 దరఖాస్తులు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి 07దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 57దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 144 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

## 12 శాతమున్న ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లా?



**తెలంగాణలో కాంగ్రెస్ కుట్రలు ప్రజలకు వివరిస్తాం**

**బిసి జాబితా నుంచి ముస్లింలను తీసేస్తేనే మద్దతు**

**బిసిలకు జరుగుతున్న అన్యాయంపై ఉద్యమిస్తాం**

**కేంద్రమంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్లు**

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్ల అమలుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని మండి పడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దుర్మార్గమన్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తక్షణమే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే దక్కేలా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 శాతమున్న బీసీలకు 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12 శాతమున్న ముస్లింలకు మాత్రం వందకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని కోరారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజ కవర్గంలో ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే టెన్త్ విద్యార్థులందరికీ సైకిళ్లను అందజేస్తున్నామని 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంపై కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులతో సమావేశం కాబోతుందన ఈ నేపథ్యంలో తెలంగాణ వాదనను బలంగా విన్పించాలని అయన కోరారు. కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదని స్పష్టం చేశారు. రాష్ట్ర వాదనను సీఎంల మీటింగ్ లో రేవంత్ రెడ్డి గట్టిగా విన్పించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ప్రభుత్వం వాస్తవాలను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమేనని దీనివల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అట్లాగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయని అందులో ముస్లింలు లబ్ది పొందుతుండగా రాష్ట్రంలో 12 శాతం మంది ముస్లింలు ఉంటే... కాంగ్రెస్ 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ముస్లింలకు ఇకపై వందకు వంద శాతం రిజర్వేషన్లు పొందబోతున్నారని తెలిపారు. బీసీలకు మాత్రం తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అయినా ఆర్డినెన్స్ తీసుకు వస్తామని చెప్పడం దుర్మార్గమని ఆరోపించారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ల జాబితా నుండి ముస్లింలను తొలగించాలని కేంద్ర సహాయ మంత్రి సంజయ్ డిమాండ్ చేశారు. 42కు 42 శాతం రిజరే షన్లను బీసీలకు అమలు చేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి ఆమోదం తెలిపే బాధ్యతను మేం తీసుకుంటామని లేనిపక్షంలో ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు రాజ్యాధికారం అప్పగించడమే కాంగ్రెస్ లక్ష్యం

### బిసి ధూంధాం పోస్టర్ ఆవిష్కరణలో పిసిసి మహేష్‌కుమార్, మంత్రి వివేక్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** అణగారినవర్గాలకు రాజ్యాధికారం అప్పగించడమే కాంగ్రెస్ లక్ష్యమని రాజకీయ, ఆర్థిక సమానత్వంతో దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి వివేక్ అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం"42శాతం రిజర్వేషన్ కోసం ధూంధాం"పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వెంటనే తెలంగాణ బిసి రిజర్వేషన్ బిల్లును భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన కోరారు. స్థానిక సంస్థలలో 42శాతం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించేలా ఈనెల 18న ఉస్మానియాలో చేపట్టిన ధూంధాం విజయవంతం చేయాలని ఆయన కోరారు. 42 శాతం వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం ధూంధాంను బిసిల హక్కుల సాధనలో భాగంగా, ఆల్ ఇండియా ఒబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే కార్యక్రమం విజయవంతమైతే కేంద్రంలో కూడా చలనం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట్ స్వామి విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 23న విద్యాసంస్థల బంద్

### ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి

### వామపక్ష విద్యార్థి సంఘాలు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 23న విద్యా సంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ విద్యా సంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడినీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. బంద్ పోస్టర్‌ని హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆవిష్కరించారు.

## మహిళల ఆనందమే తెలంగాణ సౌభాగ్యం

### రూ. 20.56 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కు అందించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** ఆడబిడ్డల ఆనందమే తెలంగాణ సౌభాగ్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సా హంతో తెలంగాణ మహిళలు గణనీయమైన విజయాలను సాధిస్తు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా మహిళా సమాఖ్యకు రూ.20.56 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళా స్వయం సహాయక బృందాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి కలెక్టరేట్లో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ద్వారా ప్రతి నెల రూ. లక్ష ఆదాయాన్ని మహిళా సంఘాలు పొందుతూ ఇందిరా మహిళా శక్తి విజయానికి చక్కటి ఉదహారణగా నిలుస్తున్నారన్నారు. ఒకప్పుడు మహిళలకు బ్యాంకులు అప్పు ఇవ్వాలంటేనే బయపడే పరిస్థితి ఉండేదనీ, కానీ ఇప్పుడు అవే బ్యాంకుల ద్వారా ఏడాదికి కనీసం రూ.25 వేల కోట్లకు తగ్గకుండా రుణాలు సమకూర్చుతున్నాయన్నారు. త్వరలో కామా రెడ్డిలో పసుపు ఆదారిత పరిశ్రమను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పుతామన్నారు. మహిళలు స్వతంత్రంగా ఎదగాలి..కోటీశ్వరులుగా నిలవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## మంత్రి జూపల్లితో నిథమ్ డైరెక్టర్ భేటీ

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకటరమణ.. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణకు మంత్రి జూపల్లి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

## ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ఆధ్వర్యంలో

# కల్లు కాంపౌండ్‌లపై ముప్పేట దాడులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కల్లు కాంపౌండులపై ప్రత్యేకంగా దాడులు నిర్వహించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్‌డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఇచ్చిన అదేశాల మేరకు దాడులను ముమ్మరం చేశారు. హెచ్‌డిఎఫ్, ఏ టీం లీడర్ అంజిరెడ్డి టీమ్‌లు నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 32 లీటర్ల కల్లును అక్రమంగా రవాణ చేస్తూ ఉండగా స్వాధీనం చ్కేసుకున్నారు. ఒక్క బైక్‌ను సీజ్ చేసి, శాంపిల్ తీసుకున్నారు. కాంబ్లే గిరిధర్‌పై కేసు నమోదు చేశారు. ఎస్‌టిఎఫ్ సిసిఐ వెంకటేశ్వర్ల అధ్వర్యంలో గోల్కొండ, శంషాబాద్ బండ్లగూడ ప్రాంతాల్లో కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిల్లను సేకరించారు. సిఐ నాగరాజు ఆధ్వర్యంలో మైలార్‌దేవరపల్లి హైదర్‌గూడ, ముద్దోవ్వాల, జంగంపేట్, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అన్ని కల్లు దుకాణాల్లో శాంపిళ్లను సేకరించారు. ఎస్‌టిఎఫ్‌బి టీం గద్వాల, రాయన్‌పేట, ఏదుర్తి నుంచి మసాయిపేట ప్రాంతాల్లో సిఐ బిక్షారెడ్డి, సిఐ బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజులతోపాటు సిబ్బంది కలిసి 6 చోట్ల దాడులు నిర్వహించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు, లైసెన్స్‌లు లేకుండా కల్లు దుకాణాలను నిర్వహిస్తుండంతో ఈ కల్లు కంపౌండ్‌లోని ఉన్న కల్లును నేలపాలు చేశారు. మరో 595 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని అవసరమైన శాంపిల్స్‌ను తీసుకున్నారు. మల్లయ్య, నరేందర్ కృష్ణ, వెంకటేష్ పద్మమ్మలపై కేసు నమోదుచేసి వారిని గద్వాల ఎక్సైజ్ స్టేషన్ అప్పగించారు. నాగర్ కర్నూల్ ఎక్సైజ్ ఎక్సైజ్‌స్టేషన్ సిబ్బందితో కలిసి 350 లీటర్ల అనుమతి లేని కల్లును స్వాధీనం చేసుకుంటున్నారు. మంగనూర్, బిజినేపల్లి ప్రాంతాల్లో ద్కాడులు నిర్వహించారు. నాగర్ కర్నూల్ డిటిఎఫ్ సిఐ సిబ్బంది కలిసి ఒక వాహనంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 31.2 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై బిజెపి దృష్టి

### మెజారిటీ స్థానాలు గెలవాలంటూ దిశానిర్దేశం

### రాష్ట్ర నేతలతో సునీల్‌బన్సాల్ సమావేశం

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** బిజెపి అధినాయకత్వం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారించింది. మెజారిటీ స్థానాలు గెలపొందాలంటూ నేతలకు జాతీయ నేతలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో బిజెపి రాష్ట్ర శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్‌తో భేటీ అయ్యారు ఈ సమావేశంలో ముఖ్యంగా రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ సన్నాహాలపై ప్రధానంగా చర్చించారు. పార్టీలో కొత్త, పాత వివాదంపై కూడా డిస్కస్ చేసినట్లుగా సమాచారం. రాష్ట్ర కమిటీలో తమ వారికి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఈటల, మహేశ్వర్ రెడ్డి కోరినట్లుగా సమాచారం. ఇక స్థానిక ఎన్నికల బాధ్యతలను పూర్తిగా ఈటల రాజేందరు అప్పగించే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. ఇవాళ మధ్యాహ్నం స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సునీల్ బన్సల్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌తో పాటు జోనల్ స్థాయి వర్క్‌షాప్‌లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సునిల్ బన్సల్ భేటీ కొనసాగుతున్న నేపథ్యంలో కంటోన్మెంట్ బోర్డు సమావేశం ఉండటంతో ఎంపి ఈటల మధ్యలోనే వెళ్లిపోయారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని, మెజార్టీ స్థానలు కైవసం చేసుకుని మరోసారి ఎన్నికలలో సత్తా చాటాలని, నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలంటూ దిశానిర్ధేశనం చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసికి ఇవ్వాలి

### టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎలక్ట్రిక్ బస్సులు ఆర్‌టిసికి ఇవ్వాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. వాతావరణ కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తినకుండా ఉండాలంటే డీజిల్, పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కేంద్ర ప్రభుత్వం సమర్థించటాన్ని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తప్పు పట్టారు. కేవలం ఆర్‌టిసి బస్సుల వల్లనే పర్యావరణం దెబ్బతినడం లేదని, టూ వీలర్ దగ్గర నుండి.. సుమారు 60 లక్షల వాహనాలు తెలంగాణ ప్రాంతంలో ఆపరేట్ అవుతున్న సందర్భంలో పర్యావరణం దెబ్బ తినడం లేదా అని ప్రశ్నించారు. ఆర్‌టిసి బస్సుల వల్ల కాలుష్యం కేవలం 0.09 శాతం మాత్రమేనని, మిగిలిన కాలుష్యమంతా ఇతర వాహనాలతోనే వస్తోందన్నారు. కాలుష్యం పేరుతో కార్పొరేట్ శక్తులకు సబ్సిడీ ఇచ్చి, బస్సులను తయారు చేయడం కార్పొరేట్ రంగాన్ని బలోపేతం చేసి, ఆర్‌టిసిని నిర్వీర్యం చేయడమేనన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉన్న బస్ బాడీ బిల్డింగ్ యూనిట్లకు సబ్సిడీ ఇచ్చి వారిని బాగు చేసే బదులు.. అదే సబ్సిడీలు ఆర్‌టిసికిచ్చి వారి బాడీ బిల్డింగ్ యూనిట్లలో ఎలక్ట్రిక్ బస్సుల తయారయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే 600 ఎలక్ట్రిక్ బస్సులు తెలంగాణ ఆర్‌టిసిలో అద్దెబస్సులుగా రావడం వలన కొన్ని డిపోలు, గ్యారేజీలు ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం జరిగిందని.. దానివలన ఆ డిపోల నుండి వందలాది మంది సిబ్బంది బలవంతంగా బయటికి గెంటివేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

## సాహితీ, సాంస్కృతిక రంగాల్లో యువతను ప్రోత్సహించాలి

### మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

### వైభవంగా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 15, ప్రభాతవార్త :** తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా ప్రతిభావంతులకు, మేధావులకు, వివిధరంగాల్లో నిష్ణాతులకు పురస్కారాలు ఇవ్వడమే కాకుండా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో అభిరుచి, ఆసక్తిగత యువతను గుర్తించి వారిలోని సృజనాత్మకశక్తిని పెంపొందించి ప్రోత్సహించే కీలక బాధ్యతను విశ్వవిద్యాలయం పోషించాలని, ఆ దిశగా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యా నందరావు సభాధ్యక్షతన జరిగిన 2023 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి విశిష్ట అతిథులుగా సింగరేణి కాలరీస్ సీఎండి ఎం.బలరామ్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అదనపు సంచాలకుడు రింగు రామమూర్తితో కలిసి వివిధరంగాల్లో విశేష సేవలందించిన 12మంది ప్రముఖులు ఎలనాగు (కవిత్వం), డా. ప్రభల జానకి (విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి (చిత్ర లేఖనం), ఎ.సంపత్‌రెడ్డి (శిల్పం), పేరిణి రమేష్ లాల్ (నృత్యం), బి.హరిప్రియ (సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి (పత్రికా రంగం), గుమ్మడి గోపాలకృష్ణ (నాటకరంగం), కడకంచి పాపయ్య (జానపద రంగం), ధూళిపాళ మహాదేవమణి (అవధానం), ఆచార్య కె.మలయవాసిని (ఉత్తమ రచయిత్రి), డా. శాంతినారాయణ (నవల/కథ)లను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారంతోపాటు 20,116 రూపాయల నగదు, శాలువ, అభినందనపత్రాన్ని అందజేసి వారి సేవలను ప్రశంసించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. మన మాతృభాష తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రతీఒక్కరూ విధిగా తీసుకోవాలని, అన్యభాషలను ద్వేషించకుండా గౌరవించాలని కోరారు. కళలు, సాహిత్యం ద్వారా సమాజాన్ని మేల్కొలిపి చైతన్యవంతుల్ని చేస్తున్న ప్రతిభామూర్తులను తగురీతిన పురస్కారాలతో సన్మానించడం హర్షణీయమని ఎం.బలరామ్ అన్నారు. అధ్యక్షోపన్యాసంలో ఆచార్య నిత్యానందరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయంచేస్తూ వారిలోని అసాధారణ ప్రతిభాపాటవాలను వివరించారు. ముందుగా కోట్ల హనుమంతరావు స్వాగతోపన్యాసంలో వివిధ రంగాలలో తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని సవివరపరిచారు. చివరిగా పురస్కార గ్రహీతలు తమ స్పందనలో విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు. రింగు రామమూర్తి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.




ప్రతిభా పురస్కార గ్రహీతలతో సుఖేందర్‌రెడ్డి, నిత్యానందరావు, బలరామ్, హనుమంతరావు, రామమూర్తి తదితరులు

## తెలంగాణ కాంగ్రెస్ బిసి నేతలకు బెంగళూరులో ఘనస్వాగతం

### ఎఐసిసి ఒబిసి సలహా మండలి సమావేశంలో కీలకనిర్ణయాలు

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ బిసినేతలకు బెంగళూరులో ఘనస్వాగతం లభించింది. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం బెంగళూరు లో ఎఐసిసి ఒబిసి నేషనల్ అడ్వైజరీ మండలి సమావేశంలో పాల్గొన్నారు. ఎఐసిసి ఒబిసి సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సురేఖ, వాకాటి శ్రీహరిలు కులగణన సర్వే చేసిన విధానం వివరించారు. రాజకీయంగా విద్యా, ఉపాధి విషయంలో కూడా 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీర్మాణం చేశామని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి కేంద్రంకు పంపామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. బెంగళూరు వెళ్లిన ఎఐసిసి ఒబిసి సెల్ జాతీయ అధ్యక్షుడు అనిల్ కుమార్ జైహింద్, సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, బీకే.హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పూర్ణిమ యాదవ్ మరియు ఇతర నేతలు ఉన్నారు.

## వర్షాలు పడొద్దని శాపనార్థాలతో కెటిఆర్ రాక్షసానందం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 15,ప్రభాతవార్త:** నైరుతి రుతుపవన సీజన్ పూర్తి గా ప్రారంభం కాకుండానే కెటిఆర్ శాపనార్థాలు ప్రారంభమైనాయనీ, వర్షాలు పడొద్దని కోరుకుంటూ ఆయన రాక్షసానందం పొందతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం సిఎల్‌పి సమావేశంలో మాట్లాడుతూ వానకాలం విత్తనాలు ఇంకా విత్తనేలేదురైతులకు నీళ్లు ఇవ్వడం లేదని కెటిఆర్ గగ్గోలు పెడుతున్నాడని అన్నారు. ఎవరైనా మంచి వర్షాలు పడాలని రైతులు బాగుండాలని కోరుకుంటారు కానీ కెటిఆర్ రైతులు పచ్చగా ఉంటే ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయి పంటలు ఎండిపోతున్నాయని పిచ్చి వాగుడు వాగుతున్నాడని సత్యం విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఎకరం ఎండిపోయిందా? కేటీఆర్ నిరూపించాలి అని ఆయన అన్నారు. రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ ను ఇస్తున్నామని తెలిపారు. ఏ సబ్ స్టేషన్ దగ్గర చిన్న నిరసన లేదని అన్నారు. విద్యుత్ డిమాండ్ 16 వేల మెగావాట్లు దాటినా రెప్పపాటు కూడా కరెంటు పోకుండా చూశామని అన్నారు. రైతుల కోసం వేల కోట్లు వెచ్చించి ఉచిత విద్యుత్ ఇస్తున్నామని మేడిపల్లిసత్యం తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ట్రాన్స్ ఫార్మర్లు పని చేయకపోతే వాటిని చూపించాలిన అన్నారు. కెటిఆర్ ఇంట్లో కూర్చుని ట్వీట్లు చేస్తున్నాడు, పొలాల వెంట వెళ్లి చూడు ఏం జరుగుతుందో చూడాలని అన్నారు.



## రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మృతి

### ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్‌లో ఘోరప్రమాదాలు

### లోయలో పడిన టెంపోలు.. పలువురికి తీవ్రగాయాలు

**దెహ్రాదూన్, జూలై 15:** వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తరాఖండ్ పితోర్‌గఢ్ జిల్లా మువనీ పట్టణంలోని సుని బ్రిడ్జ్ సమీపంలోని వాహనం భారీ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 8 మంది మరణించారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.అలాగే జమ్మూ కశ్మీర్ దోడా జిల్లాలో 22 మందితో వెళుతున్న టెంపో లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించారు. మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ రెండు ఘటనలపై సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అందులోభాగంగా క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఇక ఆ రెండు ప్రమాద ఘటనల్లో మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. పరిమితికి మించి ప్రయాణికుల కారణంగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని దోడా జిల్లా అధికారులు వెల్లడించారు. ఇక ప్రమాదంపై జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోపాటు సీఎం ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు చేపట్టి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ సైతం ఈ ప్రమాదంపై స్పందించారు. ఈ ఘటనపై మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశించారు.

## విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి: మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై15:** రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్‌తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

## బంగాళా ఖాతంలో వాయుగుండం

### ఆరురోజులపాటు భారీ వర్షాలు

**చెన్నై, జూలై 15:** బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం, పడమటి గాలుల వేగం కారణంగా రాష్ట్రంలో మంగళవారం నుండి ఆరు రోజులపాటు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. 16 నుండి 17 వరకు చెన్నై సహా ఆరుజిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఉత్తర బంగాళాఖాతంలో సాయంత్రం ఏర్పడిన అల్ప పీడనం ఉత్తర దిశగా కదులుతూ వాయువ్యదిశగా పయనించి వేకువజాము 5.30 గంటలకు వాయుగుండంగా మారి బంగ్లాదేశ్ సమీపంలో కేంద్రీకృతమైంది. ఈ వాయుగుండం కారణంగా పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోను, పుదుచ్చేరిలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుండి 40 కి.మీ.ల వేగంతో గాలులు వీచాయి. దీంతో నీలగిరి జిల్లాల్లో సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు సహా 6 జిల్లాల్లో ఈ నెల 16 నుండి 17 వరకు కుండపోతగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. సముద్రతీర ప్రాంతాల నుండి రాష్ట్రం వైపు వీచే పడమటి గాలుల వేగంలో మార్పుల కారణంగా మంగళవారం నుండి పలు చోట్ల చెదురుమదురుగా ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

కోవై, నీలగిరి జిల్లాల్లో మంగళవారం భారీగా వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ నెల 16, 17 తేదీలలో చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, నీలగిరి, కోయంబత్తూరు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయని వివరించారు. తేని, దిండుగల్ జిల్లాలోనూ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ నెల 18న రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లోను, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోను ఉరుములు, మెరుపులతో ఓమోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆ సందర్భంగా గంటకు 40 నుండి 50 కి.మీల. వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు.

నీలగిరి,కోయంబత్తూరు జిల్లాల్లో పర్వతశ్రేణుల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని, తేని, తెన్‌కాశి, తిరువళ్లూరు, కాంచీపురం, తిరువణ్ణామలై, విల్లుపురం, కళ్ళకురిచ్చి, కడలూరు జిల్లాల్లోను, పుదుచ్చేరి రాష్ట్రంలోనూ భారీగా వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. 19 నుండి 20 వరకు రాష్ట్రంలోని కొన్నిచోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయి. జాలర్లకు హెచ్చరికఇదిలా ఉండగా ఈ నెల 18న దక్షిణాది జిల్లాల్లోని సముద్రతీర ప్రాంతాల్లో, ప్రత్యేకించి మన్నార్‌జలసంధి ప్రాంతంలో గంటలకు 45 నుండి 55 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సముద్రపు అలలు ఉధృతంగా ఎగసిపడే అవకాశాలున్నాయని, ఈ కారణంగా జాలర్లు ఆ రోజు చేపలవేటకు వెళ్ళకూడదని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

# డిగ్రీలు కాదు.. స్కిల్స్ అవసరం

### స్మార్ట్ వర్క్‌తో కూడిన హార్డ్ వర్క్ చేయాలి

### విద్యార్థులకు మంత్రి శ్రీధర్‌బాబు దిశానిర్దేశం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంతో పాటు మనం కూడా మారాలి... కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగాలి... అప్పుడే సక్సెస్ మనల్ని వరిస్తుంది అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్ అనేది ఇప్పుడు సక్సెస్‌కు ఫార్ముల అని వివరించారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "మన మాట అమెరికా తెలుగు సంఘం టాస్క్ ఫ్రీ ఆన్ లైన్ ఐటీ ట్రైనింగ్ సర్టిఫికేట్ల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. "ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. 50 శాతం మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలకు అవసరమైన స్కిల్స్ లేవని నాస్కామ్ గుర్తించిందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో కనీస అవగాహన ఉండటం లేదని తేల్చింది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన వద్దు అన్నారు. 2025 నాటికి 8.5 కోట్ల ఉద్యోగాలు రోబోలు, ఏఐ వల్ల పోతే... కొత్తగా 9.7 కోట్లు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం తేల్చింది అని చెప్పారు. చేతిలో డిగ్రీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై పట్టు ఉంటేనే కొత్త ఉద్యోగాలను సాధించలేరని అన్నారు. క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీం వర్క్, అడాప్టబిలిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లాంటి స్కిల్స్ కూడా అవసరం అన్నారు. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే కృషి చేయాలి అని సూచించారు. లక్ష్యం అంటూ లేని జీవితం చిరునామా లేని లెటర్ లాంటిదని, విద్యార్థి దశలోనే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ దిశగా నిరంతరం పరిశ్రమించాలని అన్నారు. అపజయాలకు కుంగిపోవొద్దు. తప్పులను సరిదిద్దుకొని మరింత శ్రమించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో స్మార్ట్‌వర్క్‌తో కూడిన హార్డ్ వర్క్ చేస్తేనే సక్సెస్ వస్తుంధ్ధి అని వివరించారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా వినూత్నంగా ఆలోచించాలని సూచించారు.

కొత్త ఆలోచనలకు మేం ఎల్లప్పుడూ అండగా ఉంటాం. స్కిల్ కేపిటల్ ఆఫ్ గ్లోబ్‌గా తెలంగాణను మార్చేందుకు




చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం అన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం మా ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని, సమాజం కోసం కూడా ఆలోచించాలి అని సూచించారు. మాట చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో టాస్క్ సిఈఓ శ్రీకాంత్ సిన్హా, సిఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, విజయ్ భాస్కర్, నగేష్, కళ్యాణి, డా.విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరిట సంచలన లేఖ విడుదల

**చర్ల, ప్రభాతవార్త :** మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో యేడాదికాలంలో 357 మంది కామ్రేడ్‌లు అమరులయ్యారని, వీరిలో 136 మంది మహిళలు, 31 మంది విప్లవకారులు అమరులయ్యారని 14 మంది బీహార్, జార్ఖండ్‌కు చెందిన వారు కాగా 23 మంది తెలంగాణ ప్రాంతం వారు, 281 మంది ఛతీస్‌ఘఢ్‌లోని దండకారణ్యం, మరో 9 మంది ఆంధ్ర, ఒడిస్సా స్పెషల్‌జోన్, 8 మంది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఎంఎంసీ సభ్యులు 20 మంది ఒడిస్సా ప్రాంతానికి చెందిన వారు కాగా ... పశ్చిమ కనుమలో పంజాబ్ ప్రాంతాలకు చెందిన వారు ఇద్దరు ఉన్నారని అన్నారు. నలుగురు సహచరులు అనారోగ్యంతో చనిపోగా ... ఒకరి ప్రమాదంలో, 80 నకిలీ ఎన్‌కౌంటర్‌లో, 269 మంది భద్రతా బలగాలు చుట్టుముట్టిన కాల్పుల్లో మరణించారని మావోయిస్టు కేంద్రకమిటీ పేరిట లేఖ విడుదల కావడం సంచలనం కలిగించింది. గడిచిన ఒకటిన్నర సంవత్సర కాలంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సారయ్య మరియు మరో ముగ్గురు సెంట్రల్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీకు చెందిన 15 మందిని కోల్పోయామని తెలిపారు. కామ్రేడ్ బసవరాజు సారయ్య 51 సంవత్సరాల విప్లవ జీవితంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఎంతో కృషి చేశారని అన్నారు.

# సముద్రంలో కలిసే నదుల వృధానీటిపై అన్ని పరీవాహక రాష్ట్రాలకు హక్కు

### మీట్ ది ప్రెస్‌లో భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ మాజీ సలహాదారు శ్రీరామ్ వెదిరె

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 15, ప్రభాతవార్త :** సముద్రంలో కలిసే నదుల వృధానీరు ఆయా నదుల పరీవాహక రాష్ట్రాలకు చెందుతాయి, సమాన హక్కు ఉంటుందని భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ మాజీ సలహాదారు, భారత ప్రభుత్వ నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ మాజీ చైర్మన్ శ్రీరామ్ వెదిరె స్పష్టం చేశారు. తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ (టిజెయు) ఆధ్వర్యంలో అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి బింగి స్వామి నిర్వహణలో లకిడీకాపూల్‌లో ఒక ప్రముఖ హోటల్‌లోని సమావేశ వేదికలో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో శ్రీరామ్ వేదిరే గోదావరి జలాల వివాదం, వాస్తవాల పరిశీలన అనే అంశంపై వివరణ ఇచ్చారు. గోదావరి నది నాసిక్‌లో ఉద్భవించి మహారాష్ట్ర (48.76శాతం), తెలంగాణ (19.19శాతం), ఆంధ్రప్రదేశ్ (4.59శాతం) రాష్ట్రాల నుండి ప్రవహిస్తూ సుమారు 1465 కిలోమీటర్ల దూరం ప్రయాణించి చివరికి బంగాళాఖాతంలో కలుస్తుందని చెప్పారు.



ఇంకా ఛత్తీస్‌గడ్ (12.49శాతం), మధ్యప్రదేశ్ (7.86శాతం), ఒడిస్సా (5.69శాతం), కర్ణాటక (1.48శాతం) రాష్ట్రాల నుండి ఉపనదులుగా వచ్చి గోదావరిలో కలుస్తాయని వివరించారు. భారత ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదులపై ప్రాజెక్టుల కోసం కొన్ని నిబంధనలు, మార్గదర్శకాలను జారీ చేసిందని, ముఖ్యంగా 75 శాతం నమ్మదగిన ప్రమాణం (డిపెండబులిటీ క్రైటీరియన్) ముఖ్యమైనదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి-బనకచెర్ల జి-బి లింగ్ ప్రాజెక్టు ద్వారా 200(+100) టిఎంసి వరద నీటిని వినియోగించాలనుంది. అయితే మనదేశంలో గోదావరి బేసిన్‌సహా) వరద నీటి వినియోగించాలన్న కాన్సెప్ట్‌కు ఎటువంటి శాస్త్రీయ ధృవీకరణ లేదు.. సిడబ్ల్యుసి ద్వారా వరద నీటి కొలతల కోసం ఎటువంటి విధానాలు, ప్రమాణాలు రూపొందించబడలేదు.

గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్ కూడా తన అవార్డులో వరదనీరు అనే పదాన్ని ఎక్కడా పేర్కొనలేదు. ఈ అంశంపై శ్రీరామ్ సవివరంగా ప్రసంగిస్తూ గోదావరి బేసిన్‌కి సంబంధించిన దేశచట్టం; ఉప బేసిన్లు; గోదావరి జలవివాదాల ట్రిబ్యునల్ ద్వారా జల కేటాయింపులు; ఉప బేసిన్ వారీగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు జల కేటాయింపులు; భారత ప్రభుత్వం (జీఓఐ) అందించిన నిబంధనలు, మార్గదర్శకాలు-ప్రమాణాలు; అవి పాటించకతోనే వచ్చే దుష్పరిణామాలు; సిడబ్ల్యుసి ద్వారా ప్రాజెక్టుల ఆమోదం; గోదావరి-బనకచెర్ల లింక్ ప్రాజెక్టు అంటే ఏమిటి? సగటు ప్రవాహాలపై ఈ లింక్ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రభావాలు; దీనిపై పిఎఫ్ఆర్, జిఆర్ఎంబి, పిపిఎల పిఎఫ్ఆర్‌పై వ్యాఖ్యలు; జాతీయ జలాభివృద్ధి సంస్థ ఎన్‌డబ్ల్యుడిఎ ప్రతిపాదించిన గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టు; 6 మార్చి 2023న హైదరాబాద్లఓ జరిగిన 17వ టిఏఫ్-ఐఎల్ఆర్ సమావేశ వివరాలు; ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు తదితర అంశాల గురించి పవర్ పాయింట్‌తో వివరించారు.

## అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ 2025లో నారాయణ విద్యార్థి కుచ్చి సందీప్‌కు గోల్డ్‌మెడల్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** జూలై 5 నుండి 14 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్లో నిర్వహించబడిన ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసిహెచ్‌వో) 2025లో నారాయణ విద్యార్థి కుచ్చి సందీప్ సత్తాచాటి భారతదేశ గౌరవాన్ని మరింత ఇనుమడింప జేశాడు. ఏకంగా గోల్డ్ మెడల్ సాధించి అబ్బుర పరిచాడు. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన నలుగురు అధికారిక సభ్యులలో సందీప్ ఒకరు. ప్రపంచం మొత్తం నుండి వచ్చిన ప్రతిభావంతులైన యువ రసాయన శాస్త్రవేత్తలతో గట్టిపోటీ ఎదుర్కొన్న సందీప్ అసాధారణమైన ప్రజ్ఞ, పాటవాలతో బంగారు పథకం కైవసం చేసుకున్నాడు.ఈ విజయం వెనుక నారాయణ విద్యాసంస్థల అధ్యాపకుల ప్రోత్సాహం, నిరంతర మద్దతు ఈ విజయానికి బాటలు పరిచాయని ఈ సందర్భంగా కుచ్చి సందీప్ పేర్కొన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు సైతం అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలో ఒకటిగా పరిగణించబడే అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్కు నారాయణ తన విద్యార్థులను అధునాతన సైద్ధాంతిక భావనలు, ప్రయోగశాలలో సవాళ్ళతో కూడిన పరీక్షలతో తీర్చి దిద్దింది. ఈ పరీక్షలో సందీప్ సాధించిన విజయం భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు పునాదులు వేస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు. మంచి విద్యకు ఈ విజయం ఒక నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భం గా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలింపియాడ్ (ఐసి హెచ్‌వో) 2025లో




సందీప్ సాధించిన ఈ విజయంతో నారాయణ సంస్థ ఎంతో గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది కేవలం అతని వ్యక్తిగత విజయం మాత్రమే కాదు,నారాయణ కుటుంబంతో పాటు మొత్తం భారతదేశం గర్వపడే క్షణమని ఉద్వేగానికి లోనయ్యారు.నారాయణ ఎల్లప్పుడూ అత్యుత్తమ శిక్షణ, నిరంతర అభ్యాసం ద్వారానే యువ ప్రతిభావంతులను పెంపొం దించగలమని నమ్ముతుందన్నారు. నారా యణ ఒలింపియాడ్ శిక్షణ స్పష్టమైన అవగాహన, కఠినమైన శిక్షణ, నిపుణులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంతో రూపొంది ంచబడుతుం దన్నారు. ఈ విధానాలే విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విజయం సాధించేందుకు ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. గతంలోనూ జెఎస్‌వో, ఐపిహెచ్‌వో, ఐసిహెచ్‌వో, ఐబివో, ఐఓఏఏ, ఐఎమ్‌వో, ఎన్ఎమ్‌టిసి వంటి ప్రతిష్టాత్మక పోటీల్లో ఓ నారాయణ విద్యార్థులు గొప్ప ఎన్నో గొప్ప విజయాలు సాధించారు.అదే విధంగా సందీప్ తన ధ్యేయం కోసం ఎంతో పట్టుదలతో,క్రమశిక్షణతో నిరంతరం శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాడన్నారు. జేఈఈ,నీట్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ ఒలంపియాడ్‌సలో నారాయణ విద్యార్థులు సంఛలన విజయాల సరసనసందీప్ విజమం స్పూర్తికెరటంలా వెలుగులీనుతుందన్నారు.

గత 46 సంవత్సరాలుగా అనుభవం, నైపుణ్యం, బోధన, నిరంతర అభ్యాసం, అనే స్తంభాలపై ఆధారపడి నారాయణ పని చేస్తోందన్నారు.ఈ నిరంతర విజయ ప్రయాణంలో విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కీలకమైన, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో నారాయ ణకు నారాయణే సాటిగా నిలుస్తుందన్నారు,

## మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది స్టేట్ మార్క్ లామీ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సచివాలయం భేటి అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షి క సంబంధాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు సహా ఇరుపక్షాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. టిజిఐఐసి ఎండి శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మేం ఆయుధాలిస్తే మాస్కోపై నేరుగా దాడి చేయగలవా?

### జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడి చర్చలు లీక్

**వాషింగ్టన్, జూలై 15:** ఉక్రెయిన్‌రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్ ఇకపై రష్యాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు తాజా పరిణామాలు చెబుతున్నాయి. జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్ బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్ర



తరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తారన్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్యదేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.ఇందులోభాగంగానే రష్యా ప్రజల్లో పుతిన్‌పట్ల వ్యతిరేకతను పెంచాలంటే ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి ఆయుధాలు అందించి రష్యాలోని కీలకనగరాలపై దాడులుచేయిస్తేనే పుతిన్ దారికి రాగలరన్న అంచనాతో ఉన్నారు. ఇదే అమెరికా రక్షణరంగ నిపుణులు కూడా చెపుతున్నట్లు సమాచారం. అందువల్లనే పుతిన్‌తో చర్చల తర్వాత ట్రంప్ ఇపుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో కూడా మాట్లాడి ఒకవేళ దీర్ఘశ్రేణి ఆయుధాలిస్తే మాస్కో, సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరాలపై దాడులు చేయగలరా అని ప్రశ్నించారని ఆంగ్లమీడియాల్లో కథనాలు వచ్చాయి.

### జగదీశ్‌రెడ్డి ఉనికికోసం నిందలు వేయొద్దు ..

## దమ్ముంటే రాజీనామచేసి మళ్లీ గెలువు

### ఎమ్మెల్యే వేముల వీరేశం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** సూర్యపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కి దమ్ముంటే, మొగొడివైతే తన పదవి కి స్పీకర్ ఫార్మాట్ లో రాజీనామా చేయాలని సూర్యాపేట నుంచి ఆయన మళ్లీ గెలిస్తే నేను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా ఆ సవాల్ కు సిద్ధమా అని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట లో నేను కాని, బీర్ల ఐలయ్య కాని జగదీష్ రెడ్డి పైన పోటీకి సిద్ధమని వేముల వీరేశం ప్రకటించారు.నల్గొండ జిల్లాలో బిఆర్ఎస్ ను జనం మర్చిపోయారని ఆయన అన్నారు.ప్రజల్లో ఉనికి కోసమే జగదీష్‌రెడ్డి ఏదో ఒకటి మాట్లాడుతున్నాడని ఆరోపించారు.బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నల్గొండ జిల్లాలో కేవలం 25 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు.మరీ ఆరు లక్షల కార్డులు ఇచ్చామన్న జగదీష్ రెడ్డి ని చెంపదెబ్బ కొట్టాలా లేక కట్టెలతో కొట్టాలా అని ఆయన ప్రజలను అడిగారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఉప ఎన్నికలప్పుడే స్కీంలు, ఆ తర్వాత స్కాంలని ఎకసెక్కాలు చేశారుజ నల్గొండ జిల్లాలో బిఆర్ఎస్ హాయాంలో ఎన్ని ప్రాజెక్టులు కట్టారో జగదీష్ రెడ్డి లెక్క చెప్పాలని అన్నారు. ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చారో లెక్క చెప్పు అని ఆయన అడిగారు.ధర్మారెడ్డి కాలువ, పిల్లాయిపల్లి కాల్వ కు టెండర్లు పిలిచి జగదీష్ రెడ్డి తన వాళ్లకు ఇప్పించుకున్నాడని అన్నారు.నల్గొండ జిల్లాకు జగదీష్ రెడ్డి శనిలా దాపురించాడని వేముల వీరేశం నిందించారు. అధికారంలో ఉన్నప్పుడు జగదీష్ రెడ్డి రైస్ మిల్లులు,పిడిఎఫ్ రైస్ దందాలు చేశాడని విమర్శించారు.నల్గొండ జిల్లా అభివృద్ధి పైన జగదీష్ రెడ్డి ఊరికి వెళ్లి చర్చించడానికి మేం సిద్ధమని సవాల్ విసిరారు.!జగదీష్ రెడ్డి నీ భాష, వ్యవహార శైలి బాగాలేదు మార్చుకో లేకుంటే జనం బుద్ధి చెపుతారని అన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట లో బిజెపి తో లాలూచీ పడటం వల్లనే జగదీష్ రెడ్డి మూడు సార్లు గెలిచారని తెలిపారు.మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన మాట్లాడే నైతిక అర్హత జగదీష్ రెడ్డికి లేదు అని అన్నారు. నీవు రాజీనామా చేస్తే మేం ఎవరైనా సూర్యాపేట లో పోటీ చేసి జగదీష్ రెడ్డిని ఓడిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో గంజాయి మొక్క జగదీష్ రెడ్డి అని అన్నారు. మూడు ఫీట్లు ఉన్న జగదీష్ రెడ్డి ఎనిమిది ఫీట్ల మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు.

### నిమిషప్రియ తరహాలో

## ఉరి కంబానికి చేరువలో 49 మంది

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** గల్ఫ్ దేశం యెమెన్‌లో ఉరిశిక్ష పడ్డ కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియను విడిపించేందుకు భారత్ దౌత్య మార్గంలో చేస్తున్న ప్రయత్నాలు కొంతమేర ఫలించి ఆమె ఉరి తాత్కాలికంగా వాయిదా పడింది. నిమిష ప్రియ ఉదంతం ఇలావుంటే విదేశాలలో నేరాలకు సంబంధించిన అభియోగాలపై పది వేల మందికి పైగా భారతీయులు ఆయా దేశాలలోని జైళ్లలో మగ్గుతున్నారు. ఇందులో 49 మంది ఉరిశిక్షను ఎదుర్కొంటున్నారు. గతంలో పలు దేశాల్లో నేరాలు చేసి, చట్ట విరుద్ధంగా ఆయా దేశాలలో వెళ్లినందుకు వందల సంఖ్యలో భారతీయులు జైలు పాలైన ఉదంతాలు వున్నాయి. ఇందులో తీవ్రమైన నేరాలు చేసిన పలువురికి ఉరిశిక్ష పడింది. ఇందులో కొందరి మృతదేహాలు భారత్‌కు రప్పి ంచగా చాలా మంది మృతదేహాలను ఆయా దేశాలలోనే అంత్యక్రియలు నిర్వహించారు. గల్ఫ్ దేశాలలో నేరాలు, చట్ట విరుద్ధంగా వున్న వేలాది మ ంది భారతీయులు అక్కడి జైళ్లో శిక్షలు

## విదేశీ జైళ్లలో మగ్గుతున్న పదివేల మందికిపైగా భారతీయులు

అనుభవిస్తున్నారు. ఇందులో తెలంగాణకు చెందిన వారు కూడా చాలా మంది వున్నారు. గల్ఫ్ దేశాల్లో జైల్లో వున్న వారిలో చాలా మంది ఏజెంట్ల మోసాలకు బలైన వారే. వీరిలో కొందరిని ఆయా రాష్ట్రాలు సొంత ఖర్చుతో తిరిగి వెనక్కు రప్పించాయి. ఇక కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియ తన వ్యాపార భాగస్వామిని చంపి, శవాన్ని ముక్కలు చేసి డ్రైనేజిలో పడ వేసిన అభియోగాలపై ఉరిశిక్ష పడ్డ ఖైదీగా యెమెన్‌లో బందీగా వుంది. కేంద్ర విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం గల్ఫ్, అమెరికా, యూరప్ దేశాలలో పది వేల మందికి పైగా భారతీయులు అనేక నేరాలు లేదా చట్టవిరుద్ధంగా వెళ్లినందుకు అరెస్టయి జైళ్లలో బందీలుగా వున్నారు. ఇందులో అనేక మంది డ్రగ్స్, స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడ్డ వారు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారు వుండడం గమనార్హం. వీరిలో గల్ఫ్ దేశాలలోనే ఎ క్కువగా వున్నారని విదేశాంగ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కొన్నిసార్లు తెలియకుండా చేసిన చిన్నపాటి పొరపాట్లు కూడా ఆయా దేశాలలోనే రంగా తేలడంతో జైలు పాలైన భారతీయులు అనేక మంది వున్నారు. ఇందులో అక్రమంగా బంగారం తేవడంతో పాటు డబ్బులకు ఆశపడి మనుషుల అక్రమ రవాణాలో నేరగాళ్లకు సహకరించడం వంటివి ఎక్కువగా వున్నాయి. ఇంకొన్ని ఘటనల్లో ఆయా దేశాలకు సంబంధించిన సామాజిక, సా ంస్కృతిక అంశాలపై అవగాహన లేక పోవడం కూడా నేరంగా మారుతోంది. ఇలా అరెస్టవుతున్న వారు జైలు పాలవుతున్న సందర్భాలలో బయటకు వచ్చేందుకు వారి ఆర్థిక స్తోమత సరిపోవడం లేదు.

ఇలాంటి వారిలో కొందరికి ఆయా దేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు సహాయం అందిస్తున్నా చాలా మందికి ఇవి లభించడం లేదు. కొన్నిసార్లు ఆయా దేశాలలో వున్న కఠిన చట్టాలు జైళ్లలో వున్న వారి విడుదలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఏడాది క్రితం గల్ఫ్ దేశమైన ఖతార్‌లో నావికదళంలో పనిచేసేందుకు వెళ్లిన భారత నేవి విశ్రాంత ఉద్యోగులు కొందరు అక్కడి చట్టాలను ఉల్లంఘిం చడంతో వారికి అక్కడి కోర్టు ఉరిశిక్ష విధించింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. చివరకు భారత్ దౌత్యమార్గంలో ఉరిశిక్షణను జీవి త ఖైదుగా మార్పించి, ఆ తరువాత ఖతార్‌పై ఒత్తిడి తెచ్చి అందరిని విడుదల చేయించడంలో సఫలం అయ్యింది.

### విదేశాలకు వెళ్లే వారు అక్కడి చట్టాలను ముందుగానే తెలుసుకోవాలి

ఇదిలావుండగా విదేశాలకు వెళ్లేవారు ముందుగా ఆయా దేశాలకు చెందిన చట్టాలను తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో వీసాలను దుర్వినియోగం చేయరాదని, అక్రమాలకు పాల్పడరాదని, ఏజెంట్లను గుడ్డిగా నమ్మరాదని వారు చెబుతున్నారు. ఇదే సమయంలో విదేశా లకు వెళుతున్న వారు తాము ఎందుకు వెళుతున్నామో...? దానికోసమే వుండాలని వారంటున్నారు. ఇక విదేశాలలో చిక్కుకుంటున్న వారికి న్యా య సహాయం అందించేందుకు ఆయా దేశాలలోని భారత రాయబార కార్యాలయాలు మరింత చురుకుగా పనిచేయాలని నిపుణులు కోరుతున్నారు.

# తెర



# జూనియర్‌కి బాస్..

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. జెనీలియా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సినిమాలో నాది ఒక మంచి బాస్ క్యారెక్టర్. సినిమా ముందు కెళ్తున్న కొద్ది ఆ క్యారెక్టర్‌లో చాలా మార్పులు వస్తాయి. అవన్నీ కూడా చాలా కొత్తగా ట్రీట్ చేశారు డైరెక్టర్. జీవితమన్నప్పుడు అన్ని ఉంటాయి. అయితే ఎన్నో అద్భుతమైన సినిమాలు చేశాను. బొమ్మరిల్లు హాసిని వెరీ మెమొరబుల్ క్యారెక్టర్. అలాగే హ్యాపీలో మధుమతి, కథ సినిమా.. ఇప్పటికీ ఆడియన్స్ నా క్యారెక్టర్స్ పేరుతోనే నన్ను పిలుస్తుంటారు. అది ఒక నటిగా చాలా గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. మంచి క్యారెక్టర్స్ వస్తే నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. చిన్న క్యారెక్టర్ అయినా గుర్తుండిపోయే క్యారెక్టర్ చేయడం నాకు ఇష్టం. ఇండస్ట్రీలోకి రావడం, ఇన్ని పాత్రలు చేయడం, ప్రేక్షకుల నుంచి విశేషమైనటువంటి అభిమానాలు పొందడం ఇదంతా కూడా నాకు ఒక డ్రీమ్ లాగా అనిపిస్తుంది. ఇంతకుమించిన డ్రీమ్ ఏమీ లేదు. మజిలీ రీమేక్ చేశాం. అది అద్భుతమైన విజయాన్ని ఇచ్చింది. మరో మంచి లవ్ స్టోరీ కుదిరితే సినిమా చేయాలని ఆలోచన అయితే ఉంది.



### ఓ రాజకీయ కుటుంబ నేపథ్యం
# ప్రభుత్వ సారాయి దుకాణం

జాతీయ అవార్డ్ దర్శకులు నరసింహ నంది తాజాగా ఎస్విఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకులు సముద్ర, నటుడు పృధ్వీతో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. షేక్స్పియర్ కథలోని పాత్రల ఆధారంగా తీసుకొని తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా పగ, ద్వేషం, ఈర్ష్య, అసూయ, ప్రేమ మనిషిలోని వివిధ కోణాలను చూపిస్తూ ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా కథను తయారు చెయ్యడం జరిగింది. 1980 నాటి పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలిచారు. ఈ సందర్భంగా దర్శకులు నరసింహ నంది మాట్లాడుతూ కమర్షియల్ అంశాలతో కూడుకున్న కథ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ కథకు కనెక్ట్ అవుతారని తెలిపారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ....నేను నరసింహ నంది మంచి స్నేహితులం. ప్రతి సినిమా విభిన్నంగా చేస్తూ వచ్చారు. ప్రభుత్వ సారాయి దుకాణం మోషన్ పోస్టర్ చాలా బాగుంది అని అన్నారు. నిర్మాత ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నరసింహ నంది డైరెక్ట్ చేసిన 1940లో ఒక గ్రామం సినిమాకు నేషనల్ అవార్డ్ రావడం విశేషం. ఈ చిత్ర యూనిట్ చాలా క్రమశిక్షణతో కనిపిస్తున్నారు. ఆర్టిస్ట్‌గా కాకుండా గెస్ట్‌గా వచ్చిన పృధ్వీ ఈ సినిమా చాలా బాగుందని చెపుతున్నారు. తప్పకుండా ఆయన మాటలు నిజం కాబోతున్నాయని తెలిపారు. నటుడు పృధ్వీ మాట్లాడుతూ ఈ సినిమాలో మా అమ్మాయి శ్రీలు చక్కటి రోల్‌లో నటించింది. తనతో పాటు అందరికి ఈ సినిమా ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత నరేష్ గౌడ మాట్లాడుతూ.... త్వరలో మా ప్రభుత్వ సారాయి దుకాణం సినిమా థియేటర్స్ లో అందరిని అలరించబోతోందన్నారు. నిర్మాత పరిగి మల్లిక్ మాట్లాడుతూ నరసింహ నంది ప్రాణం పెట్టి ఈ సినిమాను తెరకెక్కించాని చెప్పారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ..ఈ చిత్రం తప్పకుండా మీ అందరికి నచ్చుతుందని భావిస్తున్నానన్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ఒక మంచి సినిమాగా మిగిలిపోతుందని నమ్మకం ఉంది అని హీరో సదన్ పేర్కొన్నారు. హీరో వినయ్, హీరోయిన్ అధితి మైకేల్, హీరోయిన్ శ్రీలు దాసరి, హీరోయిన్ మోహన సిద్ధి, నటుడు తిలక్ తదితరులు మాట్లాడారు.

# 18న ఓం సంత్ తుకారాం

పదిహేడవ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి భక్తిని ప్రతిఘటనగా మార్చిన సంత్ తుకారాం జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా దర్శకుడు, నిర్మాత, నటుడు అయిన ఆదిత్య ఓం సంత్ తుకారం చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రంలో ప్రముఖ మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్‌ను పోషిస్తున్నారు. మరాఠీ, హిందీ సినిమాల్లో భావే తన అద్భుతమైన నటనతో అందరినీ మెప్పించారు. ఈ చిత్రం జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో శివ సూర్యవంశీ, షీనా చోహన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్, శిశిర్ శర్మ, హేమంత్ పాండే, గణేష్ యాదవ్, లలిత్ తివారీ, ముఖేష్ భట్, గౌరీ శంకర్, ట్వింకిల్ కపూర్, రూపాలి జాదవ్, దీరి అక్బర్ సామి వంటి ప్రఖ్యాత నటులు కీలక పాత్రలకు జీవం పోశారు. ప్రముఖ నటుడు ముఖేష్ ఖన్నా ఇచ్చిన వాయిస్ ఓవర్ సినిమాకి హైలెట్ కానుంది. నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్ స్వరపరిచిన పాటలు అందరినీ ఆకట్టుకోనున్నాయి. శాస్త్రీయ, జానపద, భక్తి భావాల్ని కలిగించేలా పాటలు ఉండనన్నాయి. ప్రతి పాట తుకారాం పాత్ర భావోద్వేగ, తాత్విక పరిణామాన్ని ప్రతిధ్వనిస్తుంది. పురుషోత్తం స్టూడియోస్‌తో కలిసి బి. గౌతమ్‌కు చెందిన కర్జన్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం పాన్‌ఇండియా వైడ్‌గా రిలీజ్ కాబోతోంది.



### హాలీవుడ్ స్థాయికి
# హైదరాబాద్ ఎదగాలి

**శ్రీమద్ భాగవతం తెలంగాణ సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి అవుతుంది**
**చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, ప్రముఖ నిర్మాత మోతీ సాగర్, రామోజీ గ్రూప్ ఎండీ కిరణ్, విజయేశ్వరి (ఎండి, రామోజీ ఫిల్మ్ సిటీ) తదితర ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీమద్ భాగవతం సినిమా తీయాలన్న ఆలోచన వచ్చినందుకు సినిమా టీమ్‌ను అభినందిస్తున్నా. తరం మారుతున్న ఈ సమయంలో శ్రీమద్ భాగవతం లాంటి సినిమాలు చాలా అవసరం. నలభై ఏళ్ల క్రితం రామాయణం సీరియల్ రామాయణాన్ని అందరికీ చేరువ చేసింది. కోవిడ్ టైమ్‌లో మళ్లీ రామాయణం సీరియల్‌ను టెలికాస్ట్ చేస్తే రికార్డు సృష్టించింది. 2035 లోగా తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దాలని మేం సంకల్పించాం. 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందుకోసం 2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకుంటున్నాం.. ఇందులో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుంది. ఆనాడు రామానంద్ సాగర్ తీసిన రామాయణం సీరియల్ ఎంత పాపులర్ అయిందో.. శ్రీమద్ భాగవతం పార్ట్1 సినిమా అంత హిట్ అవ్వాలని కోరుకుంటున్నా.. రాబోయే రోజుల్లో హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ చేసే స్థాయికి ఎదగాలని మా ఆకాంక్ష.. అని ఆయన పేర్కొన్నారు.

ఈ చిత్రం తెలంగాణలో సినిమా పరిశ్రమకు కొత్త ఊపిరి పోసే అవకాశం ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి అత్యాధునిక సౌకర్యాలు దీనికి దోహదపడతాయని సినీ పరిశ్రమ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. శ్రీమద్ భాగవతం పార్ట్1 చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని మరింత పెంచే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు.




రామోజీ ఫిల్మ్ సిటీలో 'శ్రీమద్ భాగవతం పార్ట్ 1' చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి


### ఎన్టీఆర్ పాత్రల ప్రేరణతో
# వీరమల్లు విల్లు



పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు జూలై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం గురించి దర్శకుడు జ్యోతి కృష్ణ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. హరి హర వీరమల్లు చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ వెల్లడించారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజ వ్యక్తుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణాలను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి ప్రేరణ పొందానని జ్యోతి కృష్ణ పేర్కొన్నారు. ధర్మపరుడిగా, బలవంతుడిగా మరియు ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని హరి హర వీరమల్లులో ఆయన పాత్రను చాలా జాగ్రత్తగా రూపొందించినట్లు దర్శకుడు జ్యోతి కృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఎంజీఆర్ సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగించారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే హరి హర వీరమల్లులో 'మాట వినాల్సి' అనే శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే పాటను స్వరపరిచాము. ఈ పాట యొక్క సారాంశం పవన్ భావజాలాన్ని ప్రతిబింబిస్తూ జీవితంలో సానుకూలత మరియు ధర్మాన్ని స్వీకరించడాన్ని తెలియజేస్తుంది. ఈ పాట ప్రేక్షకులను బాగా ప్రభావితం చేసింది.. అని జ్యోతి కృష్ణ అన్నారు. నటుడిగా ఎన్టీఆర్ యొక్క గొప్ప ప్రదర్శనలు పౌరాణిక మరియు జానపద చిత్రాల నుండి వచ్చాయి. ముఖ్యంగా రాముడు, కృష్ణుడు పాత్రలలో ఆయన ఒదిగిపోయిన తీరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ తన శక్తిని మరియు ధర్మాన్ని నిలబెట్టే సామర్థ్యాన్ని సూచించే విల్లు, బాణం పట్టుకున్న శ్రీరాముడిగా అద్భుతంగా చిత్రీకరించబడ్డారు. ఈ అంశం నుండి ప్రేరణ పొంది, హరి హర వీరమల్లులో పవన్ కోసం విల్లు, బాణాన్ని రూపొందించాము. పవన్ కళ్యాణ్ యొక్క శక్తిని సూచించడానికి, న్యాయం కోసం పోరాడటానికి మరియు ధర్మాన్ని నిలబెట్టడానికి ప్రతీకగా ఈ ఆయుధాలు రూపొందించబడ్డాయి అని జ్యోతి కృష్ణ వివరించారు. అలాగే తాను స్క్రిప్ట్ రాస్తున్నప్పుడు ప్రజలు పవన్ కళ్యాణ్‌ను కథానాయకుడిగా కాకుండా నాయకుడిగా చూస్తున్నారని గ్రహించానని ఆయన అన్నారు. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నాను.. అని జ్యోతి కృష్ణ చెప్పారు.

# 'సయార్లా' ఈ తరానికి ప్రతిబింబం

భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన ఫిల్మ్ మేకర్స్‌లో ఒకరైన మహేష్ భట్ తాజాగా 'సయార్లా'పై స్పందించారు. ప్రతి తరానికి ఒక ప్రేమకథ ఉంటుంది. ఆ తరానికి ప్రతిబింబంలా ఆ ప్రేమ కథ నిలుస్తుంది. నా దృష్టిలో 'సయార్లా' ఈ తరానికి చెందిన ప్రేమ కథగా, ప్రేమకు నిర్వచనంగా మారుతుంది. నేను ఆషికి సినిమాను ఎంతో నిజాయితీతో, స్వచ్ఛమైన ప్రేమతో చేశాను. అందుకే ప్రేక్షకులు ఆ చిత్రానికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. నేటి తరానికి రొమాంటిక్ సినిమా ఎలా ఉండాలో చెప్పే నియమాల్ని 'సయార్లా' తిరిగి రాస్తుందని నమ్మకంగా చెప్పగలను. ఇంత వరకు మోహిత్ తీసిన చిత్రాల్లో ఇది చాలా భిన్నంగా అనిపిస్తోంది. ఈ చిత్రంలో మోహిత్ తనలోని ప్రేమ, లోతుని చూపించినట్టుగా కనిపిస్తోంది. తెరపై ఇద్దరు ప్రతిభావంతులైన నటులతో సయారాను తెరకెక్కించారు. ఇంత గొప్ప సినిమాను తీసేందుకు ముందుకు వచ్చిన వైఆర్‌ఎఫ్ వంటి స్టూడియోని చూస్తే గర్వంగా, సంతోషంగా ఉంది. సయారా చాలా కొత్తగా కనిపిస్తోంది. కొత్తవారితో మాత్రమే జరిగే ఓ మ్యాజిక్‌లా ఉంది. సయారా చిత్రంపై నా అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. జూలై 18న ఈ మూవీని చూడాలని వెయిట్ చేస్తున్నాను అని అన్నారు.





# 4వేల కోట్లతో రామాయణ

నితీష్ తివారి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్ రామాయణ. ఈ సినిమాపై రోజు రోజుకూ ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా పెరిగి పోతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ సినిమా బడ్జెట్ గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాయి. ఏకంగా రూ. 4000 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పి ఆశ్చర్యపరిచారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకూ.. ఇంత భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కలేదని.. రామాయణ చరిత్ర సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఏ భారతీయ సినిమా కూడా ఈ ప్రాజెక్ట్ దరిదాపుల్లోకి కూడా రాలేదని తెలిపారు.

### సమ సమాజ స్థాపన కోసం
# అగ్రహారంలో అంబేద్కర్




మన భారత రాజ్యాంగ రూపశిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో పురస్కారాలు అందుకున్న ఈ చిత్రాన్ని రామోజీ లక్షమోజి ఫిల్మ్స్ పతాకంపై మంతా కృష్ణచైతన్య స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హీరో కూడా ఆయనే కావడం విశేషం. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను దళిత సంచలనం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ రిలీజ్ చేశారు. కృష్ణచైతన్య ఎన్నో కష్టాలు పడి తెరకెక్కించిన ఈ చిత్రం అసాధారణ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షి ంచారు. అంబేద్కర్ అభిమానులైన ప్రతి ఒక్కరూ అగ్రహారంలో అంబేద్కర్ చిత్రం చూసి తీరాలని పిలుపునిచ్చారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ అంబేద్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని సినిటేరియా మీడియా వర్క్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.. కుల మత ప్రాంత వర్గ వైషమ్యాలకు అతీతంగా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా.. ఎన్నో వ్యయప్రయాసలకు లోనై చిత్రీకరించిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం అన్నారు.

# 'మిస్టర్ రెడ్డి' కి ఎమోషన్లు ఎన్నో..



ఎంతో తపన ఉంటేనే సినిమాలు నిర్మిస్తారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడితే గానీ ఓ మూవీ బయటకు రాదు. ఈ క్రమంలో నన్ను ఎంతో మంది మోసం చేశారు. కానీ నేను ఎప్పుడూ ఎక్కడా భయప డలేదు. నా టాలెంట్‌ను నమ్ముకుని ఇక్కడి వరకు వచ్చాను అని 'మిస్టర్ రెడ్డి' చిత్ర నిర్మాత టి. నరసింహారెడ్డి అన్నారు. ఈ మూవీని జూలై 18న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇది అన్ని రకాల ఎమోషన్‌తో తీసిన చిత్రమన్నారు.

# రాశి నెగెటివ్ షేడ్



యదార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా ఉసురే ఆగస్టు 1న థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను చూస్తుంటే ఇదొక సహజమైన, వైవిధ్యమైన ప్రేమకథలా అనిపిస్తుంది. ప్రముఖ హీరోయిన్ రాశి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తుందని అర్థమోతుంది.

### 'పోలీసు వారి హెచ్చరిక్ష' తో
# బాధ్యత పెరుగుతుంది



తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక్ష'. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటో గ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ చిత్ర తొలి టికెట్ లాంచ్ చేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరు అయిన మట్టి కవి బెల్లి యాదయ్య మాట్లాడారు. 'నేను ఎన్నో సంవత్సరాల క్రితం నాటక రంగంలో నటించా.. ఇంతకాలం తర్వాత ఈ సినిమా కోసం ఇప్పుడు కెమెరాల ముందుకు వచ్చి మాట్లాడుతున్నాను. ఈ సినిమా మా ప్రాంతంలో కొన్ని నిజమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. అలాగే సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుంద్ఞి అని అన్నారు. నాకు చిన్నప్పటి నుండి సినిమాలపైన ఉన్న ఆసక్తితో ఈ సినిమాలో మంచి పాత్రను పోషించానని నటుడు సన్నీ అఖిల్ చెప్పుకొచ్చారు. నేను సాధారణంగా నాటికల ద్వారా ప్రేక్షకులకు పరిచయం. ఎక్కువగా నెగటివ్ రోల్స్‌లో నటించా.. ఈ సినిమాలో నా పాత్ర ఇప్పటి వరకు ప్రేక్షకులు నన్ను చూసిన పాత్రలతో పోలిస్తే కొంచెం భిన్నంగా ఉంటుంది అని నటి జయ వాహిని అన్నారు.

నిర్మాత బెల్లి జనార్ధన మాట్లాడుతూ... నేను ఆర్మీలో పని చేసి వచ్చాను. ఒక సినిమాను తెరపై చూపించేందుకు ముందుగా దర్శకులు ఎంతో కష్టపడతారు. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు బాబ్జి మాట్లాడుతూ మనకు సాధారణంగా బయట కనిపించే సినిమాలు కాకుండా ఈ సినిమా కాస్త భిన్నంగా ఉండబోతోంది. ఈ సినిమాలో నెగటివ్ క్యారెక్టర్ల మధ్య మంచి సన్నివేశాలు ఉండబోతున్నాయి. వారి మధ్య ప్రేమ, పాటలు ఉండబోతున్నాయి. మా చిత్ర టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులలోకి బాగా వెళ్ళింది. దానికి పోలీస్ వారికి మేము ధన్యవాదాలు తెలుపుకోవాలి. ఒక మంచి సందేశాన్ని ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు తెలుపబోతున్నాము. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు సమాజం మీద ఒక ప్రేమతో, బాధ్యతతో థియేటర్ నుండి బయటకు వెళ్తారు. మా సినిమాను అందరూ సపోర్ట్ చేయండి అంటూ ముగించారు.

# ఫోన్ కేస్‌తోనూ ముప్పే !



అవసరం, వ్యాపకం.. అమ్మాయిలకు ఫోన్ ఇంతకే పరిమితం కావడం లేదు. అది వాళ్లకో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కూడా. అందుకే క్యూట్ బొమ్మలు, చెయిన్లు, స్టోన్లంటూ భిన్న ఫోన్‌కేస్‌లతో అలంకరించేస్తుంటారు. అయితే అది అందానికి చేటవుతోందని గుర్తించారా మరి?

ఒక్కసారి ఊహించుకోండి... ఉదయం లేచి ఫోన్ చేతిలోకి తీసుకున్న దగ్గర్నుంచి... దాన్ని ఎక్కడెక్కడ పెడతాం! మంచం, డెస్క్‌టాప్, టీపాయ్, మనం ఎక్కడుంటే దాన్ని అందుబాటులో పెట్టాల్సిందే. వీటిల్లో తెర కాస్త మేలు దానిమీద దుమ్ము కనిపించినా, జిడ్డుగా తోచిన శుభ్రం వేసేస్తాం. కానీ వెనకా శుభ్రం చేయాలన్న ఆలోచనే రాదు.

దీంతో అది కాస్త సూక్ష్మజీవులకు ఆవాసంగా మారుతుంది. వాటిని తాకి ఆ చేతులతో ముఖాన్ని తాకితే అవి కాస్త మన చర్మంలోకి చేరతాయి. దీనితో యూక్నే, నైట్‌వాడ్స్, బ్లాక్‌హెడ్స్ వంటి సమస్యలన్నీ. పైగా అన్నీ తయారయ్యేది సింథటిక్ పదార్థాలు, ప్లాస్టిక్‌తోనే, అంటే తయారీలో రసాయనాలు వాడాల్సిందే. ఈ అలర్జీలు, కాంటాక్ట్ డెర్మటైటిస్‌లకు కారణం. అంతేనా, కొన్నిసార్లు ఏదో పనిచేసుకుంటూ భుజానికి ముఖానికీ మధ్య ఫోన్ బంధించి ఉంచుతాం. లేదా మాట్లాడేటప్పుడు అనుకోకుండా చెవికి, చెంపకీ ఫోన్ అదిమి పెడతాం ఈ రాపిడి అక్కడి హెయిర్ ఫాలికల్స్ మీద ప్రభావం చూపడమే కాదు, యాక్నేకీ కారణమవుతుంది. కాబట్టి, ఈ సమస్యలు తప్పాలంటే ఫోన్‌తోపాటు దాని కేసుని తరచుగా శుభ్రం చేయాలి. అలాగే ఇప్పుడు ఆంటీబ్యాక్టీరియల్ మెటీరియల్‌తో తయారవుతోంది. వాటిని తెచ్చుకుంటే సరిగ్గా ఎప్పుడూ హెడ్‌ఫోన్‌లు, ఇయర్ పాడ్స్ నిడివి వాడినా యాక్నే, అలర్జీల నుండి దూరంగా ఉండొచ్చు. వీటితోపాటు స్కిన్ కేర్ హైజీన్... అంటే బయటికి వెళ్లొచ్చాక ముఖం శుభ్రం చేసుకోవడం, మేకప్ తొలగించుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే తిప్పలే ఉండవు. □

# మహిళలకు పథకాలపై అవగాహన కల్పిస్తూ..


శాంతి

**రైతులు, గిరిజనులు, మహిళలనే కాకుండా పల్లెల్లో అందరి కోసం అన్నీ తానై పనిచేస్తున్నారు లచ్చిపతిని శాంతి. దీని కోసం 'దీక్ష' స్వచ్ఛంద సంస్థను స్థాపించి వేల కుటుంబాల్లో మార్పు తెచ్చారు. అధికారులు సైతం ఈమె కృషికి అభినందనలు తెలుపుతున్నారు. ఆ ప్రయాణం గురించి తెలుసుకుందాం..**

అమ్మవాళ్లది రాజమహేంద్రవరం సమీపంలోని నీలధరావుపేట. పెళ్లి తర్వాత విజయనగరం జిల్లా బాడంగి మండలం, వీరసాగరం వచ్చాక ఇక్కడి రైతులు, మహిళలు పడుతున్న ఇబ్బందుల్ని గమనించా. వీళ్లకోసం ఏదైనా చేయాలనుకున్నా. అప్పట్లో మా గ్రామ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక, బ్యాంకు రుణాలు అందేవి కాదు. అధికారుల సాయంతో పాసు పుస్తకాలు చేయించా. మహిళల కోసం 'అక్షర విజయం' కార్యక్రమాన్ని నిర్వహించా. నేనూ దూరవిద్యలో పిజి పూర్తి చేశా.

**నాబార్డ్ మెచ్చింది..**

గ్రామం కోసం కలసికట్టుగా పనిచేయాలని 1999 'దీక్షా మహిళా సంక్షేమ సంఘం' స్థాపించా. మొదట రోడ్లు, వీధులు, చెరువుల్ని బాగు చేసుకున్నాం. తర్వాత 'మన సంరక్షణ సమితి'లో భాగమై ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదు గిరిజన గ్రామాల్లో చెట్ల సంరక్షణ, పోడు వ్యవసాయం, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన.. వంటివి చేపట్టా. 2005లో గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన కల్పించా. మా గురించి తెలుసుకున్న నాబార్డ్.. రైతు క్లబ్‌లు పెట్టమంటూ 2012లో సూచించింది. మొత్తం 45 గ్రామాల్లో క్లబ్‌లు ఏర్పాటుచేశాం. వీటిద్వారా రైతులు తమ సమస్యల్ని చర్చించి అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించు కుంటారు. మా ప్రాంతంలో రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనడమే కాకుండా, ఆ డబ్బు సమయానికి ఇచ్చేవారు కాదు. పరిష్కారంగా 'రైతుల జట్టు' ఉత్పత్తిదారుల కంపెనీని నాబార్డ్ సహకారంతో ఏర్పాటుచేసుకున్నాం. దీన్లో 10 గ్రామాలకు చెందిన రైతులు సభ్యులు 2017 నుంచి బెల్లం ప్రాసెస్ చేసి, మార్కెటింగ్ చేస్తున్నాం. అనకాపల్లి పరిశోధన కేంద్రం నుంచి బెల్లం పొడి, క్యూబ్స్, చాక్లెట్లు.. తయారీపైన శిక్షణ తీసుకున్నాం. రాగి లడ్డూలు, పల్లీ ఉండలు, సున్నుండలు తయారుచేస్తున్నాం. బెల్లం ప్రాసెసింగ్ పరిశ్రమ కోసం ఎంపి ఫుడ్ ప్రాసెసింగ్‌లో దరఖాస్తు చేయగా.. డిసిసిబి, యాప్ ద్వారా రూ.5 కోట్ల రుణం వచ్చింది. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే బెల్లంతో మరిన్ని ఉత్పత్తులు తెస్తాం. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయలం. అనుబంధ సంస్థలైన ఎఆర్ఎస్, కెవికెల ద్వారా పంట రైతులకు యాజమాన్య పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి జీడి, పసుపు, తృణధాన్యాల్ని ప్రాసెసింగ్ చేయిస్తున్నాం.

**పథకాలపై అవగాహన...**

'దీక్ష' నిర్వహణలో రైతుల జట్టు, అక్షయ ధరణి, రైతు నేస్తం ఎఫ్‌పిసిలు ఉన్నాయి. మొత్తం 3500 మంది రైతులు వీటిలో అంకితభావంతో పనిచేస్తున్నారు. విశాఖకు చెందిన వై.లక్ష్మి, రైతుల జట్టుకు సిఇఒ, 'అక్షయ సిఇఒ లక్ష్మి.. మొదట్నుంచీ నాతో కలిసి ప్రయాణిస్తున్నారు. ఈ ఎఫ్‌పిసిలకు వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖల నుంచి నిరంతర సహకారం, ప్రోత్సాహం అందుతున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పురస్కారం అందించడంతోపాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఆర్ఇఎసి) సభ్యురాలిగా, ఆర్ఎఆర్ఎస్ గుంటూరు సలహాదారుగా నియమించింది. 750 మంది మహిళలకు టైలరింగ్‌లో, వివిధ వ్యవసాయ ఉత్పత్తులపై విలువ ఆధారిత ఉత్పత్తుల్ని తయారుచేసుకునేలా నాబార్డ్ సహకారంతో శిక్షణ ఇచ్చాం. వీరందరికీ డిసిసిబి ద్వారా రుణాలనూ అందించాం. మేం పనిచేసే ప్రతిచోటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వాలంటీర్లకు 'గూంజ్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో గృహోపకరణాల కిట్లు అందిస్తున్నాం. ఉచిత నేత్ర శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకూ 30 వేల క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాం. 'లీఫార్మసీ-విశాఖపట్నం సంస్థ ద్వారా రక్తహీనత ఉన్న 1500 మంది గిరిజన గర్భిణులకు ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నాం. □

# శాకాహారుల మెనూలో..



శరీరంలో జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా, కండరాలు బలోపేతం కావాలన్నా ప్రొటీన్లు ఎంతో అవసరం. ప్రత్యేకించి ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో నిత్య బిజీగా ఉండే మహిళలు అలుపు లేకుండా ఉత్సాహంగా ఉండాలంటే ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. అయితే ఇవి ఎక్కువగా లభించే మాంసాహారం, కోడిగుడ్లను పక్కన పెట్టి శాకాహారానికే ప్రాధాన్యమిస్తుంటారు కొందరు. ఇలాంటి వారు ప్రొటీన్లు పొందాలంటే ఈ పదార్థాల్ని మెనూలో చేర్చుకోవాలంటూన్నారు నిపుణులు.

**పప్పుధాన్యాలు....** కందులు, పెసలు, మినుములు మొదలైన వాటిలో ఉండే పోషకాలతో ఎన్నో ఆరోగ్య



ప్రయోజనాలు ఉన్నాయి. పప్పుధాన్యాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలోని పీచు పదార్థాలు కూడా శరీర బరువును క్రమబద్ధీకరిస్తాయి. అదేవిధంగా వీటిలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ డయాబెటిస్ లాంటి దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

**చిక్కుళ్లు...** కిడ్నీ బీన్స్ (రాజ్మా), బ్లాక్ బీన్స్.. వంటి చిక్కుడు జాతికి చెందిన పదార్థాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే



ప్రొటీన్లతో పాటు బి-విటమిన్, ఫైబర్ శరీరానికి పుష్కలంగా అందుతాయి. అలాగే వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి.

**నట్స్...** ప్రొటీన్లతో నిండి ఉండే బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ తీసుకుంటే గుండెకు ఎంతో మేలు కలుగుతుంది. వీటితో పాటు కొన్ని రకాల విటమిన్లు ఫైబర్ శరీరానికి అందుతాయి. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని



ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.


**.పచ్చి బఠాణీలు..**ఒక కప్పు పచ్చి బఠానీల్లో 8 గ్రాముల వరకు ప్రొటీన్ ఉంటుంది. వీటిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరం లోని చెడు కొలెస్ట్రాల్ స్థాయుల్ని తగ్గిస్తాయి. తద్వారా క్యాన్సర్, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండచ్చు. ఇక వీటిలో 'ఎ'. 'కె', 'సి'.. విటమిన్లు, ఫైబర్ వంటి పోష కాలు కూడా సమృద్ధిగా లభిస్తాయి.

**సోయా బీన్స్...** సోయా బీన్స్‌లో మాంసాహారానికి సరిసమానమైన స్థాయిలో ప్రొటీన్లు ఉంటాయి. ఇందు లోని బి, డి, ఇ- విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, జింక్, అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి.. రక్తపోటును నివారి స్తాయి. సోయాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు మహిళల్లో మెనోపాజ్ దుష్ప్రభావాల్ని తగ్గించడంతో పాటు రొమ్ము క్యాన్సర్ నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. □

**చెలి చిట్కా**

✦ సూప్‌ను స్టవ్‌మీద నుండి దించి రెండుచెంచాల పాలమీగడ కలపండి రుచిగా ఉండటమే కాక చిక్కదనం వస్తుంది. ✦ బ్రష్‌ను ఉప యోగించేముందు ఉప్పునీటిలో కొంచెం నానబెట్టండి. వేడినీరు వాడండి. ✦రాత్రి పడుకోబోయే ముందు మౌత్‌వాష్ చేసుకోవాలి. □

# చింతించడానికీ ఓ సమయం..



మనిషో చోట... మనసో చోట... చాలామంది అమ్మాయిలూ, మహిళలు ఎదుర్కొన్న పరిస్థితే ఇది, దీనంతటికీ కారణం మైండ్‌ఫుల్‌నెస్ లేకపోవడం. చేస్తోన్న పని మీద మనసు నిలవకపోవడం దీనికన్నా ముఖ్యమైన విషయాలు మనసుని వేధిస్తూ ఉండటం.

ఇకపై ఇలా కాకూడదంటే... వ్యాయామాలకీ అల్పాహారానికి, భోజనానికి, పని సమయాన్ని ఎలా కేటాయిస్తామో.... సమస్యల కోసం ఆలోచించడానికీ ఓ సమయం కేటాయించాలి. దాన్నే 'వర్రీ విండో టైం' అంటున్నారు నిపుణులు.

15-20 నిమిషాలు చాలు! రోజులో మనకు వచ్చిన ప్రతికూల ఆలోచనలన్నీ ఓ చోట రాకుంటే ఉదయం ప్రయాణాల్లోనో, పనులన్నీ అయిపోయాకో, బ్రేక్ సమయంలో రాసిన వాటి ఎంపికగా చదువుతూ... వాటికోసం ఆలోచించమంటున్నారు. దీనికి పూర్తిగా 15-20 నిమిషాలు సరిపోతాయి. అలా చేయడం వల్ల ఒకదాని మీదే దృష్టి కేంద్రీకృతమై ఉంటుంది. దాంతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. కొన్ని వాటిని ఎలావచ్చే మైండ్ ఆలోచిస్తుంది. మైండ్ ఫుల్‌నెస్ టెక్నిక్ ఇది. నిర్ణీత సమయం తర్వాత ఆలోచనల్ని వెంటనే కట్టడి చేయాల్సిన బాధ్యత కూడా మీదే అంటే మనసూ, మైండ్ మీద నియంత్రణ ఈ స్థాయిలో ఉండాలంటోంది ఈ పద్ధతి. ఇంట్లో ఉండే నెగిటివిటీనీ, దుమ్మూ, దూళినీ బయటికి పంపడానికి ఎలా అయితే... ద్వారాలు, కిటికీలు తెరుస్తామో... అలానే మన మైండ్‌లో ఉండే ప్రతికూల ఆలోచనల్ని తరిమేయడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకోమంటోంది వర్రీ విండో పద్ధతి అందుకే దీని పేరు కూడా. అయితే రాత్రిళ్లు, నిద్రపోయేముందు మాత్రం దీనికి సమయం కేటాయించొద్దు అంటున్నారు నిపుణులు. ఎందుకంటేటే ఈ సమయంలో ఆలోచనల్ని అదుపు చేసుకోవడం కష్టమట. □

# కాఫీ ప్రేమికుల కోసం..



ఓ కప్పు వేడివేడి కాఫీ తాగితే.. వర్క్‌టెన్షన్ పరార్ కదా! ఇందుకు ప్రతిసారీ వంటగది, పాంట్రీకి వెళ్లనక్కర్లేదు. ఈ మగ్ వార్మర్ ఒకటి మీ దగ్గర ఉంటే చాలు. క్షణాల్లో మీరున్నచోటు నుంచే కాఫీ చేసుకుని తాగేయొచ్చు మరి. ఒక్క కాఫీ మాత్రమే కాదు వేడివేడి సూప్‌లను సైతం తయారుచేసుకోవచ్చు. ఈ వాటర్ ప్రూఫ్ మగ్ ఛార్జింగ్‌తో పనిచేస్తుంది. □

# ఒళ్లు విరుచుకుంటున్నారా?



పొద్దున నిద్ర లేవగానే ఒళ్లు విరుచుకుంటాం. ఎక్కువసేపు కూర్చొని చేసే పని పూర్తయ్యాక అప్రయత్నంగానే చేతులు చాచి, ఒళ్లు విరుచుకుంటాం. దీంతో పాటు తెలియకుండానే ఆవలిస్తాం కూడా. మనమే కాదు, పిల్లలు, కుక్కల వంటి చాలా జంతువులూ తరచూ ఒళ్లు విరుచుకుంటుంటాయి. ఇంతకీ దీంతో ఏమైనా ప్రయోజనముందా?

ఒళ్లు విరుచుకుకోవటమనేది మెదడులోని హైపోథలమస్ భాగంలో మొదలవుతుంది. నిద్ర మ శరీర వంటి పనులను హైపోథలమస్ చేస్తుంది. దీన్నుంచి విడుదలైన హార్మోన్లు కార్టిజల్ వంటి ఇతర హార్మోన్లనూ ప్రేరేపిస్తుంది. కార్టిజాల్ ఒత్తిడి కారక హా అయినప్పటికీ జీవ గడియారంలో ఇదీ ఒక భాగమే. ఒళ్లు విరుచుకు పడుతున్నప్పుడు హాయి భావన కలగటానికి ఇది ఒక కారణం కావొచ్చు. లాభాలు చాలానే ఒళ్లు విరుచుకో వడంతో చాలా లాభాలే ఉన్నాయి. వయసు మీద పడుత విరుచుకోవటం తగ్గుతుండొచ్చు గానీ ప్రయోజనాల గురించి తెలిస్తే ఔరా అనాల్సిందే. ✦ కండర సంకోచాలను నియంత్రించే నాడులు తిరిగి గాడిలో పడతాయి. దీనితో ఎక్కువసే కదలకుండా ఉండటం వల్ల కండరాల్లో తలెత్తిన ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా కండరాల వదులై కదలికలు సాఫీగా సాగుతాయి. ✦ లోపలి అవయవాలను పట్టి ఉంచే అనుసంధాన కణజాల పొరలు ఉత్తేజితమవుతాయి. అనుసంధాన కణజాలాల ఆరోగ్యం మెరుగవుతుంది. ✦ భంగిమను సరిచేసే కండరాలే శరీరం నిటారుగా ఉండటానికీ తోడ్పడతాయి. ఒళ్లు విరుచుకోవటం వల్ల ఉత్తేజితమయ్యే ఈ కండరాలు నడుస్తున్నప్పుడు తూలిపోకుండానూ కాపాడతాయి. □

# పిల్లలు నిజాయితీగా..

**పిల్లలు ప్రతి చిన్న విషయానికి అబద్ధం చెప్పడం, తాము తప్పు చేయడంలేదని వాదించడం వంటివి చేస్తున్నారంటే అది తల్లిదండ్రులను చూసి నేర్చుకుంటూ ఉండొచ్చు. అబద్ధాలు చెప్పే అలవాటు పెద్దవాళ్లకు ఉంటే గనుక పిల్లలు గ్రహిస్తారు. అదే విధానాన్ని అనుసరిస్తారు.** తాము నిజం మాట్లాడకుండా పిల్లలను మాత్రం పాటించాలని చెప్పడం మంచిది కాదు. వారిలో మార్పు తేవాలని అనుకోవడం కన్నా ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. ఆ తర వాతే.. పిల్లలకు నేర్పించాలి. ఉన్నదున్నట్లుగా నిజాన్ని మాత్రమే మాట్లాడగలగడం, నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచుకోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తిం




చాలి. చుట్టుపక్కలవారితో అనుబంధాన్నెలా కొనసాగిస్తు న్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకోవడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉండటం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో కథల ద్వారానూ వినిపించాలి.

**అడిగి తెలుసుకోండి...** రోజూ కొంత సమయాన్ని పిల్లలతో గడపాలి. వారితో చర్చిస్తూనే వారి ఆలోచనలను పంచు కోవాలి. ఆ రోజు విశేషాలను అడిగి తెలుసుకుంటూనే ఆయా సందర్భాల్లో పిల్లలెలా ప్రవర్తించి ఉంటారో గుర్తిం చాలి. చుట్టుపకనకలవారితో అనుబంధాన్ని కొనసాగి స్తున్నారో తెలుసుకోవాలి. స్నేహితుల ఆలోచనలను అర్థం చేసుకవోడంతోపాటు వారిపట్ల నిజాయితీగా ఉంటే, ఆ బంధాలను కలకాలం నిలుపుకోగలమన్న అవగాహన కలిగించాలి.

**ప్రశంసిస్తేనే...** మార్కుల విషయంలో మాత్రమే కాకుండా పిల్లల ప్రవర్తన ప్రశంసాపూర్తకంగా కనిపిస్తే వెంటనే అభినందించాలి. దీంతో ఇతరులను ప్రశంసించగలిగే నిజాయితీ పిల్లలూ నేర్చుకుంటారు. అసూయ, ద్వేషం వంటివి ప్రదర్శించకుండా మనస్ఫూర్తిగా ఎదుటివారి గొప్ప తనాన్ని గుర్తించి అభినందించడం తెలుసుకుంటారు. దీని ద్వారా ఎదుటివారి విశ్వాసాన్నీ, ప్రేమనూ పొందవచ్చని ప్రయోగాత్మకంగానూ పిల్లలకు అర్థమవుతుంది. అందరితో సత్సంబంధాలను ఏర్పరుచుకోగలుగుతారు.□

# ధైర్యమే ఆయుధం..

ఆధ్యాత్మికం



స్వామి వివేకానంద పరివ్రాజక సన్యాసిగా దేశమంతా పర్యటిస్తూ వారణాసి వెళ్లారు. అంజనేయ ఆలయం దర్శించుకొని తిరిగివస్తున్నారు. ఇంతలో కోతుల సమూహం కనిపించింది. అన్ని కోతులు ఒకేసారి ఎదురొచ్చే సరికి ఏం చేయాలో తోచక వెనుతిరిగారు. అవి వెంబడించసాగాయి. స్వామీజీ నడక వేగాన్ని పెంచారు. మర్కటాలూ అంతే వేగంగా తరమసాగాయి. నిస్సహాయస్థితిలో స్వామీజీ అటూ ఇటూ చూస్తున్నారు. ఇంతలో దగ్గర్లో చెట్టుకింద ఓ వృద్ధసాధువు 'అవేమీ చేయవు. భయపడకుండా ధైర్యంగా ఎదుర్కో అని హితవు పలికారు. దాంతో వివేకానంద పరుగు ఆపి నిర్భయంగా, స్థిమితంగా నిలబడ్డారు. తదేక దీక్షతో కోతుల వంక చూశారు. అంతే అవి తోకముడిచి పారిపోయాయి. కొన్ని సంవత్సరాల తర్వాత స్వామీజీ న్యూయార్క్‌లో ప్రసంగిస్తూ వారనాసి సంఘటన ప్రసావించారు. ఆ ఉదంతం నుంచి దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలనే పాఠం నేర్చుకున్నాను. సమస్యలను చూసి పారిపోకుండా నిర్భయముగా నిలిస్తే ఎంతటి భయానక పరిస్థితులైనా చక్క బడతాయి. జీవితంలో ఎదురయ్యే కష్టాలు ఆ కోతుల్లాంటివే! మనం భయపడితే, అవి భయపెడతాయి. ఎదురుతిరిగితే అవే పారిపోతాయి. పిరికివాళ్లకు పిల్లి కూడా పులిలాగే కనిపిస్తుంది. ధీశాలులు పులిని చూసినా భయపడరు. వాళ్లను ఏ అవాంతరాలూ అడ్డుకోలేవు. ధైర్యమే ఆయుధమౌతుంది అంటూ ఉద్ఘాటించారు. □

# కొల్హాపురీ గుడ్డుకూర



**గుడ్లతో ఆమ్లెట్**, ఇగురు, పులుసు, బుర్జీ ఇలా ఎన్నో రకాలుగారుచికరమైంది, ఎంతో ప్రసిద్ధి పొందింది కొల్హాపురీ ఎగ్ కర్రీ. మహా ఇది ప్రసిద్ధం. కొల్హాపురీ మసాలాతో చేసే ఈ కూర వేరే లెవెల్లో ఉంటుంది.

కావలసినవి: గుడ్లు 6, ఉల్లితరుగు కప్పున్నర, టొమాటో ముక్కలు పేస్ట్, కొల్హాపురి మసాలా, ధనియాల పొడి, కారం చెంచా చొప్పున, ప పొడి, ఆవాలు, మెంతులు పావు చెంచా చొప్పున, నూనె 2 టేబుల్ తగినంత, కొత్తిమీర తరుగు పావు కప్పు

**తయారీ:** ముందుగా గుడ్లను ఉడకబెట్టి సిద్ధంగా ఉంచాలి. ప్యాన్‌లో నూనె వేయాలి. అవి చిటపటలాడుతున్నప్పుడు.. జీలకర్ర, మెంతులు.. ఉల్లిపా ఉల్లితరుగు బంగారురంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి నిమిషం వేయించాలి. టొమాటో ముక్కలు కలపాలి. అవి మెత్తగా అయ్యాక.. కొన్ని నీళ్ల, ధనియాల పొడి, కారం, పసుపు, జీలకర్ర పొడి జోడించి కలపాలి. నాలుగైదు నిమిషా తర్వాత ఉడికించిన గుడ్లకు మధ్యలో గాటుపెట్టి వేయాలి. ఓసారి రుచి చూసి కారం, ఉప్పు తగ్గితే ఇంకొంచెం వేసి.. సన్న సెగ మీద ఇంకో రెండు నిమిషాలు ఉడక నివ్వాలి. వేసి కలియబెట్టి దించాలి. అంతే.. అదిరి పోయే కొల్హాపురీ గుడ్డు కూర సిద్ధమైనట్లె. □

# ఒత్తిడి తట్టుకోలేకపోతున్న బ్యాటర్లు



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ సిరీస్‌లో టీమిండియా బ్యాటర్లు పేలవ ప్రదర్శనతో వరుస వైఫల్యాలు చవిచూస్తున్నారు. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. నాల్గో టెస్టు మ్యాచ్ ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టెస్టు మ్యాచ్‌కు భారత్ జట్టుకు చెందిన కీలక ప్లేయర్లలో మార్పులు జరుగనున్నాయి. టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను మార్చే అలోచన జరుగుతోంది. మూడో టెస్టులో ప్లేయర్ల వైఫల్యంపై బోర్డు పోస్ట్‌మార్టం చేస్తోంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 193 పరుగుల

## ఇంగ్లండ్ నాల్గో టెస్ట్‌కు రిషబ్, బుమ్రా దూరం

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ బ్యాటర్లు ఒత్తిడి తట్టుకోలేక తడబడుతూ వరుస వికెట్లు సమర్పించుకుని ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, ఆకాష్ దీప్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు ఛేజింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. భారత్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన యశస్వి జైస్వాల్ (0) ఏడు బంతుల్లో డకౌట్ అవ్వడం టీమ్ ఇండియాకు భారీ ఎదురుదెబ్బ. ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ఆర్చర్ బౌన్సర్‌కు పెవిలియన్ చేరాడు. ఈ సిరీస్‌లో జైస్వాల్ కీలక ఛేజింగ్‌లో అతను పూర్తిగా నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13 పరుగులు చేసిన జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవలేకపోయాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (6) కూడా తక్కువ స్కోరుకే అవుట్ అయిపోవడం ఆందోళన కలిగించింది. బ్రిడాన్ కార్స్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన గిల్, కెప్టెన్‌గా జట్టుకు కావాల్సిన స్థిరత్వాన్ని ఇవ్వలేకపోయాడు. ఈ సిరీస్‌లో గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, ఈ కీలక ఛేజింగ్‌లో అతను విఫలం కావడం జట్టును ఒత్తిడిలోకి నెట్టింది. ఆకాష్ దీప్ నిష్క్రమణతో పెరిగిన ఒత్తిడి నైట్ వాచ్‌మన్‌గా క్రీజులోకి వచ్చిన ఆకాష్ దీప్ (1) కూడా ఎక్కువసేపు నిలబడలేకపోయాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆకాష్ దీప్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్‌ను అవుట్ చేసి అద్భుతంగా రాణించినప్పటికీ, బ్యాటింగ్‌లో అతను తనవంతు సహకారం అందించలేకపోయాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్, జట్టును ఆదుకున్నప్పటికీ, కీలకమైన నాలుగో ఇన్నింగ్స్ ఛేజింగ్‌లో కేవలం 9 పరుగులే చేసి, పెవిలియన్ చేరాడు. పంత్ నుంచి మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆశించారు. గబ్బాలో ఆస్ట్రేలియాపై విజయాన్ని అందించిన విధంగా ఇక్కడ కూడా పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడితే విజయం సాధ్యమని భావించినా నిరాశే మిగిల్చాడు.





## మహిళల ప్రపంచ కప్..
# ఫైనల్స్‌కు హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్-2025లో భారత్‌కు చెందిన ద్రోణవల్లి హారిక మరియు ఆర్ వైశాలి కఠినమైన టైబ్రేక్‌ల ద్వారా పోరాడి 16వ రౌండ్‌కు చేరుకున్నారు, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో స్వదేశీయులైన కోనేరు హంపి మరియు దివ్య దేశ్‌ముఖ్‌లతో చేరారు. అయితే, కాటెరినా లగ్నోతో జరిగిన హోరాహోరీ మ్యాచ్ తర్వాత వంటికా అగర్వాల్ ప్రచారం నిరాశాజనకంగా ముగిసింది. అమెరికాకు చెందిన కారిస్సా యిప్‌పై వైశాలి అద్భుతమైన స్థితిస్థాపకతను ప్రదర్శించింది. క్లాసికల్ గేమ్స్ మరియు ప్రారంభ రాపిడ్ టైబ్రేక్‌లు డ్రాగా ముగియడంతో, వైశాలి 10+10 రాపిడ్ గేమ్‌లను గెలుచుకుని 4-2 తేడాతో మొత్తం విజయాన్ని నమోదు చేసింది. ఆమె తదుపరి కజకిస్తాన్‌కుచెందిన మెరుర్ట్ కమలిడెనోవాతో తలపడనుంది, ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ అలెగ్జాండ్రా గోరియాచ్కినాను ఓడించడంద్వారా భారీ ఓటమిని చవి చూసింది. వైశాలి విజయానికి హారిక అద్దం పట్టింది, గ్రీకు ప్రత్యర్థి స్టావ్రౌలా సోలాకిడౌను టైబ్రేకర్లలో 4-2 స్కోరుతో ఓడించింది. ఆమె తదుపరి సవాలు లాగ్నో, వంటికాను ఓడించి ముందుకు సాగింది. లాగ్నోతో జరిగిన తన తొలి క్లాసికల్‌గేమ్‌లో విజయంతో వంటిక ఆశలు రేకెత్తించింది, కానీ పట్టు విడుచుకోలేకపోయింది. రష్యన్ గ్రాండ్‌మాస్టర్ తిరిగి పుంజుకుని మ్యాచ్‌ను సమం చేసినా చివరికి 10+10 రాపిడ్ టైబ్రేకర్‌లో వంటికను ఓడించింది. ఇంతలో, దివ్య దేశ్‌ముఖ్ తన ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చైనాకు చెందిన రెండవ సీడ్ జు జినర్‌తో తలపడనుండగా, కోనేరు హంపి స్విస్ గ్రాండ్ మాస్టర్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌తో తలపడనుంది.

## జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్..
## తొలి రౌండ్‌లో నిష్క్రమించిన
# రుతపర్ణ, శ్వేతపర్ణ



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ సూపర్ 750లో ఒడిశాకు చెందిన పాండా సోదరీమణులు రుతపర్ణ మరియు శ్వేతపర్ణ మహిళల డబుల్స్ ఓపెనింగ్ రౌండ్‌లోనే ఓడిపోయారు. టోక్యోలో మంగళవారం జరిగిన భారత ద్వయం జపాన్‌కు చెందిన కొకోనా ఇషికావా, మైకో కవాజో చేతిలో 30 నిమిషాల వ్యవధిలో 13-21, 7-21 తేడాతో ఓడిపోయింది. టోర్నమెంట్ ప్రారంభ రోజున బరిలోకి దిగిన ఏకైక భారతీయులు శ్వేతపర్ణ మరియు రుతపర్ణ, జనవరిలో జరిగిన 2025 ఇండియా ఓపెన్ సూపర్ 750 తర్వాత వారి మొదటి మ్యాచ్‌లో జపాన్ ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయారు. భారత షట్లర్లు బుధవారం ఎనిమిది మ్యాచ్‌లలో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ చైనాకు చెందిన వాంగ్ జడ్‌ఎక్స్‌తో తలపడనుండగా, నలుగురు మహిళా సింగిల్స్ క్రీడాకారిణులు పివి సింధు, ఉన్నతి హుడా, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత రామ్‌రాజ్ బరిలోకి దిగుతారు. పురుషుల డబుల్స్‌జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి, మరియు హరిహరన్ అంసకరుణన్‌రూబన్ కుమార్‌కూడా మహిళల డబుల్స్‌లో కవి ప్రియ సెల్వం సిమ్రాన్ సింఘితో కలిసి తమ ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.

# నేషనల్ రగ్బీ ఛాంపియన్‌గా బీహార్




**న్యూఢిల్లీ:** జూనియర్ నేషనల్ రగ్బీ ఛాంపియన్‌షిప్-2025లో ఉత్కంఠభరితమైన ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఒడిశాను ఓడించి, బీహార్ అండర్ 18 బాలుర జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ వారం ప్రారంభంలో బాలికల అండర్ 18 కిరీటాన్ని కూడా బీహార్ కైవసం చేసుకోవడం విశేషం. అత్యంత నిలకడగా ఆడిన రెండు జూనియర్ రగ్బీ జట్లు పాల్గొన్న ఈ ఫైనల్ పోటీకి సరైన క్లైమాక్స్. గోల్డాన్ కుమార్ ఒక ట్రై మరియు కన్వర్షన్‌తో బీహార్ తరపున గోల్ చేయడం ప్రారంభించాడు, కానీ ఒడిశా మంటుడు, సుబాష్ హన్స్‌దా, ఈశ్వర్ పూజారి చేసిన ప్రయత్నాల ద్వారా తిరిగి విజయం సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించింది. బీహార్ తరపున సన్నీ కుమార్ ఒక గోల్ చేయడంతో గోల్డాన్ మరోసారి సత్తా చాటాడు.

చివరి క్షణాల్లో విజయ ప్రయత్నం చేసి 17-15 తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాలుర ఫైనల్‌లో ఒడిశాను (14-12) ఓడించిన బీహార్, మరోసారి అత్యంత ముఖ్యమైన సమయంలో ఆధిక్యంలో ఉంది. గ్రూప్ దశలో చండీగఢ్ (49-0) మరియు హర్యానా (62-0) పై విజయాలు, పంజాబ్ పై 29-0 రౌండ్ ఆఫ్ 16, పశ్చిమ బెంగాల్ పై 39-0 క్వార్టర్ ఫైనల్, మరియు మహారాష్ట్రపై 10-5 సెమీఫైనల్ విజయాలతో వరుస గెలుపులు సాధించింది. ఫైనల్‌కు ముందు, ఉత్కంఠభరితమైన మూడవ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో మహారాష్ట్ర ఢిల్లీని ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అథర్వ్ పాల్కర్ చేసిన ట్రై మరియు కన్వర్షన్ మహారాష్ట్రను ప్రారంభంలోనే నియంత్రణలోకి తెచ్చింది, కానీ జావేద్ ఖాన్ మరియు పుష్పెందర్ ఢిల్లీ తరపున ట్రై మరియు ట్రైకన్వర్షన్ కాంబోతో స్కోరును తిప్పికొట్టారు. ఇక రెండవ అర్ధభాగం చివరిలో మ్యాచ్ సమంగా ఉండటంతో, సౌరభ్ సంజయ్ రాజ్‌పుత్ ఒక ట్రై చేసి దానిని సమం చేశాడు, ఆ తర్వాత గోల్డెన్ ట్రైతో మ్యాచ్‌ను మరియు పోడియం స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఢిల్లీకి, 2024లో 7వ స్థానంలో నిలిచిన తర్వాత, జూనియర్ రగ్బీలో పురోగతితో నాల్గవ స్థానం చేరింది.

## కాంటినెంటల్ టూర్.. లాంగ్‌జంప్‌లో
# సోజన్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య (కేటగిరీ-సి) ఈవెంట్ అయిన లిగ్నానో మీటింగ్‌లో మహిళల లాంగ్ జంప్‌లో యాన్సీ సోజన్ మూడవ స్థానంలో నిలిచింది. ఇటలీలో జరిగిన ఈ పోటీలో ఆమె ఆరు జంప్‌లలో ఐదు 6.15 మీటర్ల మార్కును దాటాయి. నాల్గవ ప్రయత్నంలో 6.36 మీటర్ల జంప్ చేసి స్థిరత్వాన్ని ప్రదర్శించింది. ఆమె 6.26 మీటర్లు (మొదటి ప్రయత్నం), 6.35 మీటర్లు (రెండవ ప్రయత్నం), 6.19 మీటర్లు (మూడవ ప్రయత్నం), 6.36 మీటర్లు (నాల్గవ ప్రయత్నం), 6.18 మీటర్లు (ఐదవ ప్రయత్నం), మరియు 6.11 మీటర్లు (చివరి ప్రయత్నం) దూకింది. ఆస్ట్రేలియాకు చెందిన డెల్టా అమిడ్జోవ్స్కీ కేవలం రెండు చెల్లుబాటు అయ్యే ప్రయత్నాలను మాత్రమే నమోదు చేసినప్పటికీ 6.47 మీటర్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన డేనియల్ నోల్టే 6.44 మీటర్లతో రజతం గెలుచుకుంది. ఆమె అత్యుత్తమ ప్రదర్శన ఆమె సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన అయిన 6.54 మీటర్ల కంటే చాలా తక్కువ, ఈ సంవత్సరం మే ప్రారంభంలో ఆమె నమోదుచేసింది. అయితే, 2025 యూరోపియన్ లెగ్‌లో స్పెయిన్‌లో ఆమె 6.21 మీటర్లు దూకినప్పటి నుండి యాన్సీ ఈ జంప్ గణనీయమైన మెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో బెంగళూరులోని శ్రీకంఠీరవ స్టేడియంలో ఆమె నమోదు చేసిన 6.71 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ రికార్డుకూడాఉంది. దీంతో 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లకు అర్హత ర్యాంకింగ్స్‌లో, రోడ్ టు టోక్యో 25లో యాన్సీ ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది.

# ముంబైలో టెస్లా తొలి షోరూం

**ముంబై, జులై 15:** అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత్ మార్కెట్లోకి ప్రవేశించింది. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో తొలి షోరూంను మంగళవారం ప్రారంభించింది. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మార్కర్ మ్యాక్సిటీ మాల్‌లో దానిని తెరిచింది. ఈ షోరూం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హాజరయ్యారు. ఈ సంస్థకు వెల్‌కమ్ చెప్పారు. భారత్‌లో ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలపై ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మోడల్ వై కారును సంస్థ ఆవిష్కరించింది. తొలుత మోడల్ ఈవీలను టెస్లా భారత్ మార్కెట్లో విక్రయించనుంది. ఇక్కడ ఆర్‌డబ్ల్యూడీ వెర్షన్ (బేస్) మోడల్ వై ధర రూ.61.07 లక్షలుగా (ఆన్‌రోడ్) నిర్ణయించింది. లాంగ్‌రేంజ్ వెర్షన్‌ధర రూ.69.15 లక్షలుగా ఉంది. బేస్ మోడల్ ధర అమెరికాలో 44,990 డాలర్లు (రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్లు (రూ.31.57లక్షలు) జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09లక్షలు)గా ఉంది. దిగుమతి సుంకాలు, రవాణా ఖర్చుల కారణంగా భారత్‌లో దీని ధర ఎక్కువగా ఉంది. కొన్నిరోజుల క్రితం భారత రోడ్లపై మోడల్‌ను పరీక్షించిన సంగతి తెలిసిందే. ముంబయి-పుణె జాతీయ రహదారిపై ఈ వాహనం దర్శనమివ్వడం చూపరులను ఆకర్షించింది. ఇది పూర్తిగా అప్‌డేట్ అయిన మోడల్ కారుగా నిపుణులు గుర్తించారు. దీని కోడ్‌నేమ్ జునిపెర్. సాధారణ మోడల్ కంటే దీనిలో ఎక్కువ ఫీచర్లు ఉంటాయి. అమెరికా, కెనడా మార్కెట్లలో వీటిని విక్రయిస్తున్నారు. దీని సీ షేప్‌లోని ఎల్‌ఈడీ లైట్లు, ట్విన్ స్పోక్ అలాయ్ వీల్స్, టెస్లా ప్రత్యేకతను తెలిపే గ్లాస్ రూఫ్ ఉన్నాయి. ఇది భారత్‌లో ఆరు రంగుల్లో లభించవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడల్ కారు ఆల్‌వీల్ డ్రైవ్‌గా లభిస్తోంది. వీటిల్లో లాంగ్ రేంజ్ బ్యాటరీ ప్రత్యేకత. ఒక్కసారి ఛార్జి చేస్తే 500600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు.



కేవలం 4.6 సెకన్లలో గంటకు 096 కిలోమీటర్ల వేగాన్ని అందుకొంటుంది. అత్యధికంగా గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించ గలదు. దీనిలో భారీ 15.4 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను అమర్చారు. వెనక సీట్లలోని ప్యాసింజర్ల కోసం 8 అంగుళాల ప్రత్యేకమైన స్క్రీన్ కూడా ఉంటుంది. అడాస్ ఫీచర్లు, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్ వంటి హంగులు ఇందులో కస్టమర్లకు లభించనున్నాయి. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ, టెస్లా సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుంది. ఈ కంపెనీ కార్ల డిజైన్, ఇన్నోవేషన్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉంటుంది. 2015లో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి టెస్లా కారులో తిరిగాను అని ఫడణవీస్ మాట్లాడారు.

# నష్టాలకు బ్రేక్..లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జులై 15:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో పాటు దేశీయంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠానికి చేరడం వంటి కారణాలు పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో ఇండెక్స్ ఒకటిన్నర శాతం మేర లాభపడగా, ఫార్మా, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ ఉదయం 82,233.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,253.46) స్వల్ప నష్టాల్లో ప్రారంభమయ్యాయి. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల బాట పట్టిన సూచీ.. ఇంట్రాడేలో 82,743.62 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 317.45 పాయింట్ల లాభంతో 82,570.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 113.50 పాయింట్ల లాభంతో 25,195.80 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.99 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,374 డాలర్ల వద్ద కొనసాగింది.



# భారత్ మార్కెట్‌కు వియత్నాం కార్లు

**ముంబై, జులై 15:** దేశీయ కార్ల మార్కెట్‌లోకి విదేశీ కార్ల కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఎన్నోఏళ్ల ఎదురుచూపుల తర్వాత అమెరికాకు చెందిన టెస్లాదేశంలోకి మంగళవారం ఎంట్రీ ఇచ్చింది. ముంబయిలో తొలి కార్ల షోరూమ్‌ను ప్రారంభించింది. అదేరోజున మరో విదేశీ కంపెనీ తన ప్రణాళికలను ప్రారంభించింది. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ సంస్థ తన వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్ల ప్రీ బుకింగ్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఆగస్టులో వీటిని లాంచ్ చేయబోతోంది. దేశంలోకి ఎంట్రీ ఇచ్చిన రోజే.. మరో విదేశీ కంపెనీ నుంచి టెస్లా ఎదుర్కోవడం గమనార్హం. ముంబయిలో తొలి షోరూమ్‌ను ప్రారం భించిన టెస్లా.. దేశీయంగా తొలుత మోడల్ ఈవీలను విక్రయించనుంది. ఇందులో బేస్ మోడల్ ధర రూ.60 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. లాంగ్ రేంజ్ మోడల్‌ధర రూ.68 లక్షలుగా నిర్ణయించింది. స్టాండర్డ్ వేరియంట్ 60కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 75 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ కలిగిన లాంగ్ రేంజ్ వేరియంట్ 622 కిలోమీటర్లు వెళుతుంది. ఈ ఏడాది మూడో



త్రైమాసికం నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. రూ.22 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తం నాన్‌రిఫండబుల్. వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆగస్టులో వీఎఫ్6, వీఎఫ్7 మోడళ్లను లాంచ్ చేయనుంది. రూ.21 వేలు చెల్లించి కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రీ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మొత్తం రిఫండబుల్. టెస్లా తన కార్లను దిగుమతి చేసుకుంటుండగా.. విన్‌ఫాస్ట్ మాత్రం తమిళనాడులో 2 బిలియన్ డాలర్లు వెచ్చించి తయారీ ప్లాంట్‌ను నెలకొల్పుతోంది.

# టిసిఎస్‌లో వేరియబుల్ పే..

**ముంబై, జులై 15:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ ఉద్యోగులకు వేరియబుల్ పే అలవెన్స్‌ను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు చెల్లింపులు ఉంటాయని తెలిపింది. ఇలా ఎక్కువ మందికి పూర్తి వేరియబుల్ పే చెల్లింపులు చేయడం ఇది వరుసగా రెండోసారి అని సంస్థ తెలిపింది. క్వార్టర్లీ వేరియబుల్ పే ప్లాన్ ప్రకారం సీ2 గ్రేడ్ వరకు ఉన్న అందరు ఉద్యోగులకు నూరు శాతం వేరియబుల్ పే అందుకుంటారు. సీ3 గ్రేడ్, ఆపై ఉన్న వారికి వారి విభాగాల పనితీరు ఆధారంగా చెల్లింపులు ఉంటాయి అని టీసీఎస్ చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. టీసీఎస్‌లో ఉద్యోగుల్లో వివిధ గ్రేడ్‌లు విభజన ఉంటుంది. వై లెవెల్ అనేది ట్రైనీలతో ప్రారంభమవుతుంది.





తర్వాత సిస్టమ్ ఇంజనీర్లు(సి1) ఉంటారు. ఆ తరువాత సి2, సి3, సి4, సి5 ఇలా గ్రేడ్‌ల వారీ విభజన ఉంటుంది. సాధారణంగా సి3, అంతకంటే ఎక్కువ బ్యాండ్‌ల్లోని సిబ్బందిలో సీనియర్ మేనేజర్లు, వ్యాపార యూనిట్ హెడ్స్‌గా ఉంటారు.

# వాణిజ్యం

# 3.51 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్యలోటు

**న్యూఢిల్లీ, జూలై 15:** భారత వాణిజ్యలోటు గణనీయంగా తగ్గింది. 3.51 బిలియన్ డాలర్లకు చేరింది. అదే గత ఏడాది జూన్‌నెలలో 7.30 బిలియన్ డాలర్లు ఉన్న వాణిజ్యలోటు ఏటికేడాది చొప్పున చూస్తే గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. ఎగుమతులు భారీగా నమోదు చేయడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. వాణిజ్య ఎగుమతులు జూన్‌నెలలో 67.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే గత ఏడాది-జూన్‌లో 63.83 బిలియన్ డాలర్లు నమోదయ్యాయి. దీన్ని బట్టి చూస్తే భారత్‌లో దిగుమతులపరంగాచూస్తే డిమాండ్ భారీగా ఉన్నట్లే తెలుస్తోంది. వాణిజ్య లోటు తగ్గడం అనేది భారత కరెంటు ఖాతా మెరుగుపడేందుకు సానుకూల సంకేతంగా నిలుస్తోంది. దేశ వాణిజ్యలోటు మేనెలలో కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాద ఇమేనెలలో నమోదయిన 9.35 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది జూన్‌నెలలో 6.62 బిలియన్ డాలర్లుగా నమోదయింది. మేనెలలో కూడా వాణిజ్య ఎగుమతులు 71.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వార్షిక పద్ధతిలో చూస్తే 2.77శాతం పెరిగాయి. మొత్తం ఎగుమతులు గత ఏడాది ఇదేనెలలో 69.20 బిలియన్ డాలర్లుగా నమోదయింది. ఇతర కార్యాచరణ చర్యలపరంగాచూస్తే కేంద్ర ప్రభుత్వం కీలకంగా ఉన్న 14 రంగాలకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను ప్రకటించడంతో కొంతమేర ఎగుమతులకు ఊతం లభించింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, టెలికాం, ఈవీ బ్యాటరీల రంగానికి ఈ పిఎల్ఐ స్కీం అన్వయింప చేసారు. 2025-26 సంవత్సరంలో ప్రభుత్వం లక్ష కోట్ల డాలర్ల విలు వైన ఎగుమతులు చేయాలనన లక్ష్యంతో ఉంది. స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలు వివిధ దేశాలతో చేసుకోవడం వల్ల ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇటీవలే బ్రిటన్, యుఎఇలతో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ మాట్లాడుతూ పరిశ్రమల సదస్సులోనే ఎఫ్‌టిఎల ప్రాధాన్యతలను వివరించామని, భారత్ యుకె స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందం ఇందుకు నిదర్శనమని వెల్లడించారు.



# హీరో మోటోకార్ప్ విదేశీ విస్తరణ

**న్యూఢిల్లీ, జులై 15:** ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టిపెడుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంద్వితీయార్థంలో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, బ్రిటన్ మార్కెట్లలోకి అడుగు పెట్టే ప్రణాళికల్లో ఉంది. 2024-25 వార్షిక నివేదికలో షేర్ హోల్డర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కంపెనీ చైర్మన్ పవన్ ముంజాల్ ఈ విషయాలు తెలిపారు. హీరో ఫర్ స్టార్టప్స్ తదితర సొంత వేదికల ద్వారా కొత్త తరం ఎంట్రప్రెన్యూర్లను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కొత్త ఉత్పత్తులు, సేవలపై పరిశోధనలు సాగించేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాసియా నుంచి లాటిన్ అమెరికా వరకు అంతర్జాతీయ మార్కెట్లలో 2024-25లో 43శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు ముంజాల్ వివరించారు. రిటైల్‌లో వ్యూహాత్మక విస్తరణతో ఎలక్ట్రిక్ స్కూటర్ విడా అమ్మకాలు 200 శాతం పెరిగాయని చెప్పారు. ఇక లిస్టెడ్ కంపెనీ ఏథర్ ఎనర్జీతో భాగస్వామ్యం కట్టడమనేది దేశీయంగా 'ఇవి' ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను, ప్రీమి యం ఎలక్ట్రిక్ వాహనాల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు దోహదపడినట్లు పేర్కొన్నారు. అటు అమెరికన్ సంస్థ జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యం ద్వారా సరికొత్త ప్రీమియం మోటార్ సైకిల్ వస్తోందని చెప్పారు. యూలర్ మోటార్స్‌లో రూ.510 కోట్ల పెట్టుబడి పెట్టడమనేది అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ సెగ్మెంట్‌లో తమ కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.